ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY




గురువారం 24 సెప్టెంబర్ 2026 | సంపుటి: 28 సంచిక: 161
Thursday 24 Septembar 2026 | Vol.No 28 Issue No .161
హైదరాబాద్ | Hyderabad
పేజీలు: 12+12
వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in

## ఆయుష్ వైద్య సేవల బలోపేతం

- మంత్రి దామోదర రాజనర్సింహ



సంగారెడ్డి డెస్క్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 23:- రా 'ఆరోగ్యకరమైన రేపటి కోసం ఆయుర్వేదం' అనే ప్రధాన సందేశంతో ఈ ఏడాది ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, వ్యాధులను నివారించడం, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవడంలో ఆయుర్వేదానికి ఎంతో ప్రాధాన్యత ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం జీవనశైలి కారణంగా వచ్చే వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స అందించడం మిగతా 2లో..

## తెలంగాణకు కర్ణాటక సీఎం గుడ్ న్యూస్...
## జూరాలకు నీటి విడుదలకు ఓకే

- జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక అంగీకారం
- విడతల వారీగా 3 టీఎంసీలు ఇచ్చేందుకు సీఎం డీకే శివకుమార్ సుముఖత
- బెంగళూరులో కర్ణాటక సీఎంతో తెలంగాణ మంత్రుల బృందం భేటీ
- జూరాల కింద రైతుల ఇబ్బందులను వివరించిన మంత్రులు జూపల్లి, శ్రీహరి

హైదరాబాద్, సెప్టెంబర్ 23 : తెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. విడతల వారీగా 3 టీఎంసీల నీటిని ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. ఈ నిర్ణయంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతులకు భారీ ఊరట లభించినట్లయింది. మిగతా 2లో..

## తెలంగాణ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..
## రెండు డీఏలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

- సీఎస్‌తో ఉద్యోగ సంఘాల ప్రతినిధుల సమావేశం
- అక్టోబర్ జీతంతో మొదటి డీఏ చెల్లింపు
- ఉగాది సందర్భంగా రెండో డీఏ విడుదల
- చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏలు
- పీఆర్సీపై ఇంకా నిర్ణయం ప్రకటించని ప్రభుత్వం



హైదరాబాద్, సెప్టెంబర్ 23రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కారు తీపి కబురు చెప్పింది. చాలాకాలంగా మిగతా 2లో..

## ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ విజయవంతానికి పటిష్ట ఏర్పాట్లు

### తెలంగాణను ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర): రాష్ట్ర సచివాలయంలో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026' సన్నాహక సమావేశం నిర్వహించారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు ప్రతిష్టాత్మకంగా జరగనున్న ప్రపంచ పెట్టుబడుల సదస్సు ఏర్పాట్లపై మంత్రులు, ఉన్నతాధికారులతో సమగ్రంగా సమీక్షించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు 10 ప్రత్యేక అధికారుల కమిటీలు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దేశ, విదేశాల్లో విస్తృతంగా రోడ్‌షోలు నిర్వహించడంతో పాటు, వార్‌రూమ్ ద్వారా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, ఆర్థిక ప్రగతికి ఈ సదస్సు



కీలక వేదికగా నిలవనున్న నేపథ్యంలో ఏర్పాట్లలో ఎలాంటి రాజీ లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా నిలపడమే ప్రజా ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు.

## డ్రగ్స్ నియంత్రణలో తెలంగాణ ఈగల్ ఫోర్స్‌కు జాతీయ గుర్తింపు

- ఈగల్ ఫోర్స్‌కు అత్యుత్తమ అవార్డు రావడం గర్వకారణం: సీఎం రేవంత్‌రెడ్డి
- 2029 డిసెంబర్ నాటికి డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యం
- మాదకద్రవ్యాల నిర్మూలనకు సమష్టి బాధ్యతతో పనిచేయాలి




హైదరాబాద్, సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర): మాదకద్రవ్యాల నియంత్రణలో దేశంలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన తెలంగాణ ఈగల్ ఫోర్స్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మిగతా 2లో..

## ఓట్ల కోసం చివరికి దేవుడుని కూడా మోసం చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీది..

*భద్రాచలం ఆలయ అభివృద్ధికి కట్టుబడి రూ. 351 కోట్లను కేటాయించి పనులను కూడ మొదలు పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం..*

- 2027 గోదావరి పుష్కరాల నాటికి పనులన్నీ పూర్తి చేస్తాం..



భద్రాద్రి కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనలో భాగంగా భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానాన్ని సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నాను. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం దమ్మక్క మిగతా 2లో..

## యాదాద్రి థర్మల్‌పై సీఎం, డిప్యూటీ సీఎం సమీక్ష

- యాదాద్రి థర్మల్‌పై సీఎం, డిప్యూటీ సీఎం ఆగ్రహం
- దసరాలోపు పూర్తి స్థాయి విద్యుత్ ఉత్పత్తి చేయాలని ఆదేశం



హైదరాబాద్, సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర): విద్యుత్ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలో సమీక్ష నిర్వహించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి ఎందుకు జరగడం లేదని అధికారులను ప్రశ్నించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తికి జీ-9 గ్రేడ్ బొగ్గు అవసరమని అధికారులు సీఎంకు, డిప్యూటీ సీఎంకు వివరించారు. అయితే సింగరేణిలో జీ-9 బొగ్గు ఉత్పత్తి చేసే బ్లాకులు లేవని, మిగతా 2లో..

## విద్యార్థుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

- హాస్టల్‌లో నాణ్యమైన ఆహారం, మౌలిక వసతులు కల్పించాలి



హుస్నాబాద్: శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల, హాస్టల్‌ను ఆకస్మికంగా సందర్శించిన ప్రజాప్రతినిధి అక్కడి వసతులను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులు వెల్లడించిన సమస్యలను స్వయంగా నమోదు చేసుకుని, వాటిని మిగతా 2లో..

## రేవంత్ రెడ్డికి నెల రోజుల డెడ్ లైన్ విధించిన కవిత


- ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాదానికి ప్రభుత్వమే కారణమన్న కవిత
- ఐదుగురు పిల్లలు ప్రాణాలు కోల్పోతే రేవంత్ కు పరామర్శించే సమయం కూడా లేకపోయిందని మండిపాటు
- నెల రోజుల్లోగా ప్రభుత్వ ఆసుపత్రులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని హెచ్చరిక

హైదరాబాద్, సెప్టెంబర్ 23ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్ లో చోటుచేసుకున్న ఏసీ పేలుడు ఘోర ప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, ఈ ఘటనలో ఐదుగురు పసికందులు మరణించడం అత్యంత ఆవేదన కలిగిస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడి ఆదిలాబాద్‌లోని సురక్ష చిల్డ్రన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను, వారి తల్లిదండ్రులను నేడు ఆమె పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కవిత... ఉమ్మడి మిగతా 2లో..




## సీతారామ మారేళ్లపాడు ప్రాజెక్టు ఎత్తిపోతలు ప్రారంభం

- రైతుల చిరకాల స్వప్నాన్ని సాకారం చేసిన ప్రజాప్రభుత్వం



మిగతా 2లో..

## ఇది ఎల్ నినో కాదు.. కాంగ్-నినో

- రాష్ట్రంలో కరెంట్ కోతలపై కేటీఆర్

- రాష్ట్రంలో కరెంట్ కోతలకు 'కాంగ్-నినో' కారణమన్న కేటీఆర్
- కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయిందంటూ ప్రభుత్వానికి చురక
- సింగరేణి నుంచి 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆరోపణ
- జెన్‌కో వద్ద బొగ్గు నిల్వలు లేవని, థర్మల్ ప్లాంట్లు మూసేశారని విమర్శ
- రైతులకు 24 గంటల విద్యుత్ హామీని నెరవేర్చాలని డిమాండ్



హైదరాబాద్, సెప్టెంబర్ 23రాష్ట్రంలో నిరంతరాయంగా విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది 'ఎల్ నినో' ప్రభావం కాదని, మిగతా 2లో..

## విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిపై
## మంత్రి నారా లోకేశ్ ఫోకస్.. అధికారులకు కీలక ఆదేశాలు

- రాష్ట్రవ్యాప్తంగా 963 పాఠశాలల్లో హార్ట్‌ఫుల్ యోగా శిక్షణకు చర్యలు
- టెన్త్, ఇంటర్‌లో 90% ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పనిచేయాలి
- పారిశ్రామిక క్లస్టర్ల అభివృద్ధికి 90 రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి
- ఉద్యోగ మేళాల నిర్వహణలో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలి

అమరావతి : విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించి, విద్యావ్యవస్థలో మెరుగైన ఫలితాలు సాధించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, పాఠశాలల్లో యోగా శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల బలోపేతం వంటి కీలక నిర్ణయాలు తీసుకుంది. బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్.. పాఠశాల విద్య, మిగతా 2లో..



## ఉద్యోగులకు డబుల్ బొనాంజా, కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్లు..

- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కీలక నిర్ణయాలు తీసుకున్న రాష్ట్ర మంత్రివర్గం
- రాష్ట్రానికి రూ.22,171.84 కోట్ల భారీ పెట్టుబడులకు ఆమోదం, 19,739 మందికి ఉపాధి
- మచిలీపట్నంలో రూ.8,000 కోట్లతో గోవా షిప్‌యార్డ్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- తిరుపతి, గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరంలో కొత్త పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటు
- ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు విడతల డీఏల మంజూరుకు ఆమోదముద్ర

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో



పరుగులు పెట్టించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయాలు తీసుకుంది. బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశించే అనేక కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. కేవలం ఒక్క సమావేశంలోనే ఏకంగా రూ. 22,171.84 మిగతా 2లో..

## తెలంగాణకు కర్ణాటక సీఎం గుడ్ న్యూస్...
# జూరాలకు నీటి విడుదలకు ఓకే

మేరకు బుధవారం తెలంగాణ మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి నేతృత్వంలోని ప్రజాప్రతినిధుల బృందం బెంగళూరులో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో సమావేశమైంది. జూరాల ప్రాజెక్టు కింద నీటి అవసరాలను, వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను వారు ఆయనకు వివరించారు. తెలంగాణ మంత్రుల విజ్ఞప్తిని పరిశీలించిన డీకే శివకుమార్, అధికారులతో చర్చించిన అనంతరం జూరాలకు నీటిని విడుదల చేసేందుకు అంగీకరించారు. దీంతో జూరాల ఆయకట్టు కింద ఎండిపోతున్న పంటలకు జీవం పోసినట్లయింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి కర్ణాటక సానుకూలంగా స్పందించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## తెలంగాణ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..
# రెండు డీఏలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం (డీఏ) విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశమయ్యారు. ఉద్యోగుల డిమాండ్లపై చర్చించిన అనంతరం రెండు డీఏలకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ప్రభుత్వం ఆమోదించిన రెండు డీఏల్లో మొదటిదాన్ని అక్టోబర్ నెల జీతంతో కలిపి ఉద్యోగులకు చెల్లించనుంది. దీంతో చాలాకాలంగా డీఏ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ఊరట లభించనుంది. రెండో డీఏను ఉగాది పండుగ సందర్భంగా విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. దీంతో రెండు విడతల్లో ఉద్యోగులకు డీఏ ప్రయోజనం అందనుంది. అయితే డీఏలపై నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం.. ఉద్యోగులు కోరుతున్న పీఆర్సీపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఉద్యోగ సంఘాలు పీఆర్సీ అమలు కోసం డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం డీఏలకే పరిమితం కావడం చర్చనీయాంశంగా మారింది. పీఆర్సీపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై ఉద్యోగుల్లో ఆసక్తి నెలకొంది.

# ఆయుష్ వైద్య సేవల బలోపేతం

కంటే, ముందస్తు ఆరోగ్య పరిరక్షణకు మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఆయుర్వేదం, యోగా ద్వారా ప్రజల్లో ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన పెంచి వ్యాధి నుంచి సంపూర్ణ ఆరోగ్యం వైపు ముందుకు సాగాల్సిన అవసరం ఉందని దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఆయుర్వేదం కేవలం వ్యాధులకు చికిత్స అందించే విధానం మాత్రమే కాదని, ఆరోగ్య పరిరక్షణ, పోషకాహారం, శారీరకమానసిక ఆరోగ్యం, శరీరంమనస్సు మధ్య సమతుల్యతకు ప్రాధాన్యతనిచ్చే సమగ్ర వైద్య విధానమని వివరించారు.

ఆయుష్ వైద్య సేవల బలోపేతం

తెలంగాణలో ఆయుష్ వైద్య సేవలను మరింత బలోపేతం చేసి ప్రజలకు చేరువ చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. గత రెండున్నరేళ్లలో సుమారు 700 మంది యోగా శిక్షకులను నియమించి ప్రజలకు యోగా, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు.ఆయుర్వేదం, హోమియోపతి, యునాని విభాగాల్లో 139 మంది సహాయ ఆచార్యులను నియమించి ఆయుష్ వైద్య విద్య, బోధనా వ్యవస్థను మరింత బలోపేతం చేసినట్లు మంత్రి వెల్లడించారు.తెలంగాణ వార్తలు

మూడు జిల్లాల్లో 50 పడకల ఆసుపత్రులు

ప్రజలకు మెరుగైన ఆయుష్ వైద్య సేవలు అందించేందుకు సిద్ధిపేట, జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్ జిల్లాల్లో 50 పడకల సమగ్ర ఆయుష్ ఆసుపత్రులను ఏర్పాటు చేసినట్లు దామోదర్ రాజనర్సింహ తెలిపారు

## డ్రగ్స్ నియంత్రణలో తెలంగాణ ఈగల్ ఫోర్స్‌కు జాతీయ గుర్తింపు

అభినందనలు తెలిపారు. మాదకద్రవ్యాల విక్రయం, వినియోగాన్ని సమూలంగా నిర్మూలించాలనే రాష్ట్ర ప్రభుత్వ చర్యలకు ఈగల్ ఫోర్స్ సాధించిన జాతీయ స్థాయి గుర్తింపు నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ (ఏఎన్‌టీఎఫ్) 3వ జాతీయ సదస్సులో తెలంగాణ ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య అత్యుత్తమ అవార్డు అందుకోవడం రాష్ట్ర పోలీసు శాఖకు, తెలంగాణకు గర్వకారణమని సీఎం తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణలో తెలంగాణ అనుసరిస్తున్న సమర్థవంతమైన విధానాలకు ఈ గుర్తింపు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని అన్నారు. డ్రగ్స్ మహమ్మారిని అరికట్టడం కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటం ప్రతి కుటుంబం, పాఠశాల, సంస్థ, పౌరుడి సమిష్టి బాధ్యత అని సీఎం పేర్కొన్నారు. యువతే రాష్ట్రానికి, దేశానికి భవిష్యత్తు అని, వారిని డ్రగ్స్ ప్రభావం నుంచి రక్షించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ విక్రయం, వినియోగంపై సమాచారం అందిన వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. "నషా ముక్త్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు తెలంగాణ నుంచి బలమైన అడుగు పడాలి. 2029 డిసెంబర్ నాటికి డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణ దిశగా ఈగల్ ఫోర్స్ మరింత దృఢ సంకల్పంతో పనిచేయాలి" అని సీఎం ఆకాంక్షించారు. యువతలో చైతన్యం పెంపొందించడం, డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవడం, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం ద్వారా సురక్షితమైన, ఆరోగ్యకరమైన, డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# ఇది ఎల్ నినో కాదు.. కాంగ్-నినో

పాలకుల అసమర్థత వల్లే తలెత్తిన 'కాంగ్–నినో' (కాంగ్రెస్ నినో) అని ఆయన ఎద్దేవా చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. "కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విద్యుత్ కోతలు తప్పవని తాము ముందే హెచ్చరించామని, ఇప్పుడు అదే నిజమవుతోందని" కేటీఆర్ పేర్కొన్నారు. "కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది" అంటూ ఆయన ప్రభుత్వానికి చురకలంటించారు. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ వ్యవస్థ అత్యంత పటిష్ఠంగా నడిచిందని, కానీ కాంగ్రెస్ పాలనలో పరిస్థితి దారుణంగా మారిందని విమర్శించారు. అనేక సబ్‌స్టేషన్ల పరిధిలో రోజుకు 6 గంటలకు మించి విద్యుత్ సరఫరా కావడం లేదని పత్రికల్లో వస్తున్న కథనాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. విద్యుత్ కోతలకు ప్రభుత్వం ఎల్ నినోను సాకుగా చూపుతోందని, అయితే అసలు కారణం ప్రభుత్వ వైఫల్యమేనని కేటీఆర్ ఆరోపించారు. జెన్‌కో వద్ద తగినంత బొగ్గు నిల్వలు లేవని, సింగరేణి నుంచి ఏకంగా 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. బొగ్గు అందుబాటులో ఉన్నప్పటికీ థర్మల్ విద్యుత్ కేంద్రాలను, నీరు లేదన్న సాకుతో జల విద్యుత్ కేంద్రాలను మూసివేశారని దుయ్యబట్టారు. రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామన్న హామీని ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# యాదాద్రి థర్మల్‌పై సీఎం, డిప్యూటీ సీఎం సమీక్ష

సమీప భవిష్యత్తులోనూ అక్కడి నుంచి జీ–9 బొగ్గు లభించే అవకాశం లేదని తెలిపారు. జీ–9 బొగ్గు లభ్యత లేనప్పుడు ఆ సాంకేతికతతో యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఎలా నిర్మించారని సీఎం, డిప్యూటీ సీఎం అధికారులను ప్రశ్నించారు. అలాగే పిట్‌హెడ్ వద్ద కాకుండా బొగ్గు గనులకు దూరంగా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఎందుకు నిర్మించారని, బొగ్గు రవాణా వల్ల రాష్ట్రంపై పడుతున్న అదనపు భారం ఎంతమేర ఉందని ఆరా తీశారు. రాజకీయ కారణాలతోనే అప్పట్లో పిట్‌హెడ్ వద్ద కాకుండా దూరంగా ప్లాంట్‌ను నిర్మించినట్లు అధికారులు వివరించినట్లు సమాచారం. యాదాద్రి ప్లాంట్‌కు బొగ్గు సరఫరా కారణంగా తెలంగాణపై సుమారు రూ.40 వేల కోట్ల అదనపు భారం పడుతోందని అధికారులు వెల్లడించారు. సింగరేణి నుంచి జీ–9 బొగ్గు సరఫరాకు ఉన్న అవకాశాలపై సీఎం, డిప్యూటీ సీఎం ఆరా తీశారు. గత ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకపోవడంతో సింగరేణి నుంచి జీ–9 బొగ్గు సరఫరా సాధ్యం కాలేదని అధికారులు తెలిపారు. ఇప్పటికే సింగరేణిలో 14 బొగ్గు బ్లాకులు మూతపడ్డాయని వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మహానది కోల్‌ఫీల్డ్స్, కోల్ ఇండియా నుంచి బొగ్గు కొనుగోలుకు తక్షణ చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో తక్షణమే చర్చించాలని సీఎం, డిప్యూటీ సీఎంకు సూచించారు. దసరాలోపు యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

# ఉద్యోగులకు డబుల్ బొనాంజా, కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్లు..

కోట్ల విలువైన భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ద్వారా, రాష్ట్రాన్ని పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చాలనే ప్రభుత్వ సంకల్పాన్ని చాటిచెప్పింది. ఈ పెట్టుబడుల ద్వారా సుమారు 19,739 మంది యువతకు ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా ఉద్యోగులకు రెండు డీఏలకు ఆమోదం తెలపడంతోటు, రాష్ట్రంలో కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటుపై నిర్ణయం తీసుకున్నారు. క్యాబినెట్ సమావేశానంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు.

జగన్ పై మంత్రి ఫైర్

ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి, గత వైసీపీ ప్రభుత్వంపై, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ఒకవైపు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ అహర్నిశలు శ్రమిస్తూ, రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని ప్రయత్నిస్తుంటే, మరోవైపు ఐదేళ్ల విఫల నాయకుడు జగన్ రాష్ట్రంలో విధ్వంసం, అలజడి సృష్టించి పెట్టుబడిదారులను భయపెట్టాలని చూస్తున్నారు. గొడ్డలి పార్టీ నాయకుడి చర్యలు అత్యంత శోచనీయం. ప్రజాస్వామ్యాన్ని, ప్రజాతీర్పును గౌరవించకుండా అసెంబ్లీకి రాకుండా, తన ఇంటినే అసెంబ్లీగా మార్చుకుని, సొంత పత్రిక ద్వారా అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి రాజకీయ పరిస్థితి దేశంలో మరే రాష్ట్రంలోనూ ఉండదు" అని పార్థసారథి తీవ్రంగా ధ్వజమెత్తారు. డీఎస్సీ నియామకాల విషయంలో కూడా చిన్న సమస్యలను పట్టుకుని యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ఆయన ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా, కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అత్యున్నత స్థానానికి తీసుకెళ్లి తీరుతుందని ఆయన స్పష్టం చేశారు.

కృష్ణా జిల్లాకు వరం.. మచిలీపట్నంలో గోవా షిప్‌యార్డ్

కేబినెట్ నిర్ణయాల్లో అత్యంత కీలకమైనది కృష్ణా జిల్లాకు దక్కిన భారీ వరం. రక్షణ రంగంలో ప్రఖ్యాత ప్రభుత్వ రంగ సంస్థ అయిన గోవా షిప్‌యార్డ్, మచిలీపట్నంలో తమ నౌకా నిర్మాణ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ.8,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. ప్రభుత్వం ఈ సంస్థకు 400 ఎకరాల భూమిని, 1.7 కిలోమీటర్ల సముద్ర తీరాన్ని కేటాయించింది. ఇప్పటికే రూ.30,000 కోట్ల ఆర్డర్లతో ఉన్న ఈ సంస్థ వెంటనే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉందని, దీనివల్ల ఒకవైపు పోర్టు, మరోవైపు షిప్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లతో కృష్ణా జిల్లా స్వరూపమే మారిపోతుందని మంత్రి పార్థసారథి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు సాధనలో కృషి చేసిన సీఎం చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

పారిశ్రామిక, శాంతిభద్రతలపై కీలక నిర్ణయాలు

పరిశ్రమలకు పెద్దపీట: ఎలక్ట్రానిక్స్ రంగంలో అగ్రగామి సంస్థ 'డిక్సన్', గత ప్రభుత్వ హయాంలో ఎంఓయూ చేసుకుని వెనక్కి వెళ్లిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో మళ్లీ ముందుకు వచ్చిందని మంత్రి తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ రంగంలో రాష్ట్రాన్ని హబ్‌గా మార్చే 'క్వాంటం వ్యాలీ' ఏర్పాటుకు ప్రభుత్వం వసతులు కల్పించనుంది.

కొత్త పోలీస్ కమిషనరేట్లు: రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు, మారుతున్న నేరాల స్వరూపాన్ని ఎదుర్కొనేందుకు తిరుపతి, గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరం కేంద్రాలుగా నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఐజీ/డీఐజీ స్థాయి అధికారి కమిషనర్‌గా వ్యవహరిస్తారు. దీంతోపాటు సైబర్, సోషల్ మీడియా నేరాలను అరికట్టేందుకు ప్రతి జిల్లాలో 20 మందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నారు. ఉద్యోగులకు డబుల్ బొనాంజా: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సీఎం చంద్రబాబు తీపికబురు అందించారు. వారికి 1.7.2024 నుంచి 2.73%, 1.1.2025 నుంచి 1.82% చొప్పున రెండు విడతల కరవు భత్యం (డీఏ) మంజూరు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

అమరావతి పునరుజ్జీవం.. రైతులకు న్యాయం

అసెంబ్లీకి రూ.661 కోట్లు: అమరావతిలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో, తెలుగు ప్రజలు గర్వపడేలా శాసనసభ భవనం నిర్మించేందుకు రూ.661 కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. రాజధానిలోని గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కోసం మరో రూ.1,543.98 కోట్లను కేటాయించారు. చిన్న రైతులకు భరోసా: భూ సమీకరణ పథకం కింద ఎకరం కంటే తక్కువ భూమి ఇచ్చిన రైతులకు కూడా ఎకరాకు వర్తించే విధంగా వార్షిక కౌలు (యాన్యుటీ) చెల్లించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇది రాజధాని రైతులకు ఎప్పెన్ని ఊరటనిచ్చే నిర్ణయం.

ఇతర ముఖ్యమైన నిర్ణయాలు

మద్యం పాలసీ: మద్యం దుకాణాల లైసెన్సులను పునరుద్ధరిస్తూ, ఎమ్మార్పీ ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. తొలిసారి ఉల్లంఘిస్తే రూ.10 లక్షల జరిమానా, రెండోసారి లైసెన్స్ రద్దు చేయాలని నిర్ణయించారు.

షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ: మూతపడిన సహకార చక్కెర కర్మాగారాల (చోడవరం, గోవాడ మొదలైనవి) సమస్యల పరిష్కారానికి, రైతులకు, కార్మికులకు బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం రుణం ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు.

సామాజిక మీడియా పాలసీ: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు 'సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ పాలసీ'కి ఆమోదం తెలిపారు. ఫాలోవర్ల సంఖ్య ఆధారంగా వారికి పారితోషికం చెల్లిస్తారు.

న్యాయాధికారుల పదవీ విరమణ: న్యాయాధికారుల పదవీ విరమణ వయసును 61 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ఆర్డినెన్స్ ముసాయిదాకు ఆమోదం తెలిపారు.

భూ కేటాయింపులు: సాగర్మాల ప్రాజెక్టుల కింద భూసేకరణకు ఏపీఐఐసీకి రూ.2,500 కోట్ల టర్మ్ లోన్ వినియోగానికి, విజయనగరంలో మిల్లెట్ల ప్రాసెసింగ్ యూనిట్ కోసం డీఆర్‌డీఏకు ఉచితంగా భూమి కేటాయింపు వంటి అనేక నిర్ణయాలు తీసుకున్నారు.

సచివాలయ ఉద్యోగుల ప్రమోషన్లు: వార్డు సచివాలయాల్లోని పలు కేటగిరీల ఉద్యోగులకు ప్రమోషన్ అవకాశాలు కల్పించేందుకు, ప్రత్యేక సర్వీస్ రూల్స్ రూపొందించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

మొత్తంమీద, ఈ కేబినెట్ సమావేశం ద్వారా కూటమి ప్రభుత్వం ఒకవైపు పారిశ్రామిక అభివృద్ధికి పెద్దపీట వేస్తూనే, మరోవైపు ఉద్యోగ, రైత, ప్రజా సంక్షేమానికి, పరిపాలన సంస్కరణలకు కట్టుబడి ఉన్నామని స్పష్టమైన సందేశాన్ని పంపింది.

# విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిపై మంత్రి నారా లోకేశ్ ఫోకస్.. అధికారులకు కీలక ఆదేశాలు

ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో మానసిక ఆరోగ్య పరిరక్షణకు మిషన్ మోడ్‌లో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఆదేశించారు. దీనికోసం అవగాహన, సంస్థాగత మద్దతు, మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ, విద్యార్థుల మానసిక ఆరోగ్యం కోసం 'కేర్ ఏపీ' అనే టూల్‌ను సిద్ధం చేశామని, పైలట్ ప్రాజెక్టు కూడా పూర్తయిందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతగా 963 ప్రభుత్వ పాఠశాలల్లో 4.47 లక్షల మంది విద్యార్థులకు 'హార్ట్‌ఫుల్ యోగా' శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. హైదరాబాద్‌లోని కన్హా శాంతి వనం సంస్థ ద్వారా 2,000 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించనున్నామని, ఈ ఏడాది హైబ్రిడ్ పద్ధతిలో, వచ్చే ఏడాది నుంచి పూర్తిస్థాయిలో యోగా తరగతులు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.పాఠశాల విద్యలో సంస్కరణల దశ ముగిసిందని, ఇకపై అధికారులంతా ఫలితాలపైనే పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని లోకేశ్ స్పష్టం చేశారు. టెన్త్, ఇంటర్మీడియట్‌లో 90 శాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. 'మిషన్ మార్చ్' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్న అధికారులను, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

బోధనలో వెనుకబడిన ఉపాధ్యాయులకు మెంటార్ టీచర్లతో శిక్షణ తప్పనిసరి చేయాలన్నారు. యూనివర్సిటీలు, కళాశాలల్లో విద్యార్థులు, అధ్యాపకుల హాజరుశాతం పెంచేందుకు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఫీ=ా) అమలు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమైన 'అక్షర ఆంధ్ర' ద్వారా వచ్చే ఏడాది చివరికల్లా నూరు శాతం అక్షరాస్యత సాధించాలని కోరారు.నైపుణ్యాభివృద్ధి శాఖపై సమీక్షించిన మంత్రి, పీఎం సేతు పథకం కింద పారిశ్రామికవేత్తల సహకారంతో తొలి విడతగా 10 పారిశ్రామిక అనుసంధానిత ఐటీఐ క్లస్టర్లను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. స్టీల్, రెన్యూవబుల్ ఎనర్జీ, ఆక్వా, ఫార్మా రంగాల సంస్థలతో సంప్రదించి 90 రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. గత రెండేళ్లలో జాబ్ మేళాల ద్వారా 1.72 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని, మొత్తం 5.43 లక్షల మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చామని అధికారులు వివరించారు. ఇకపై జాబ్ మేళాల నిర్వహణలో శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని మంత్రి లోకేశ్ సూచించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని స్పష్టం చేశారు. ప్రతిరోజూ సిబ్బందిలో ఒకరు విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను పర్యవేక్షించాలని సూచించారు. భోజనం, వసతులపై విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు వారి కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బాయ్స్ హాస్టల్‌లో బాత్రూమ్ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని, విద్యార్థులకు అవసరమైన రవాణా సదుపాయాలు కల్పించాలని సూచించారు. విద్యార్థులు కోరుతున్న బస్సు సౌకర్యాన్ని కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కళాశాల లైబ్రరీ సమస్యను పరిష్కరించడంతో పాటు విద్యార్థులకు అవసరమైన స్పోర్ట్స్ కిట్లు అందిస్తామని తెలిపారు. సమీపంలో స్టేడియం అందుబాటులో ఉన్నందున విద్యార్థులు క్రీడల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు, ఇతర సహపాఠ్య కార్యక్రమాలను నిర్వహించాలని అధ్యాపకులకు సూచించారు. గంజాయి, డ్రగ్స్ వంటి దురలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్, శాంతిభద్రతలపై పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కళాశాలలో ప్రతిభ కనబరిచే టాపర్లకు ల్యాప్‌టాప్‌లు అందిస్తామని, సైకిళ్లు లేని విద్యార్థులకు సైకిళ్లు అందించే చర్యలు చేపడతామని తెలిపారు. విద్యార్థులకు క్యాంపస్ సెలెక్షన్స్, ప్లేస్‌మెంట్స్ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలకు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్లతో మోటివేషనల్ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో పిల్లలను ఉన్నత విద్య కోసం కళాశాలకు పంపుతున్నారని, విద్యార్థులు తమ దృష్టిని పూర్తిగా చదువుపైనే కేంద్రీకరించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. తాను కూడా విద్యార్థి దశలోనే ప్రజా జీవితంలోకి వచ్చానని తెలిపారు. 1987లో డిగ్రీ కళాశాల ప్రెసిడెంట్‌గా ఎన్నికై విద్యార్థి సంఘం నాయకుడిగా తన ప్రస్థానం ప్రారంభమైందని, అప్పటి నుంచి ప్రజా జీవితంలో కొనసాగుతూ ఈ స్థాయికి చేరుకున్నానని వివరించారు. విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. హుస్నాబాద్‌లో శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల, హాస్టల్ భవనాలకు ఏడాది కాలంలోనే శంకుస్థాపన జరిగిందని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యార్థులకు మంచి ఆహారం, వసతి, రవాణా కల్పించడం తన బాధ్యతగా, నాణ్యమైన బోధన అందించడం అధ్యాపకుల బాధ్యతగా, కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడం విద్యార్థుల బాధ్యతగా ఉండాలని పేర్కొన్నారు.

# సీతారామ మారేళ్లపాడు ప్రాజెక్టు ఎత్తిపోతలు ప్రారంభం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం అశ్వాపురం మండలంలో సుమారు రూ.610 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన సీతారామ మారేళ్లపాడు ఎత్తిపోతల పథకానికి ఈ రోజు సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు, ఎంపీ బలరాం నాయక్ గారు, ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభించి, పంపులను ఆన్ చేసి నీటిని విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా గొందిగూడెం లో స్థానిక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు గారి అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభలో పాల్గొన్నాను. తెలంగాణలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి 33 నెలలు పూర్తి చేసుకున్నాం. ప్రజలు కోరుకున్న పాలనను అందిస్తూ ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్నాం.సీతారామ మారెళ్ళ పాడు ఎత్తిపోతల లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా గోదావరి జలాలను మొదటి విడతగా తుమ్మల చెరువు వరకు 4300 ఎకరాల సాగునీరు అందించేందుకు నీటిని విడుదల చేయడం జరిగింది. ఈ ప్రాజెక్టు రాబోయే రోజుల్లో దశలవారీగా అశ్వాపురం మండలంలో 22 నుంచి 23 వేల ఎకరాలకు సాగునీరు నీరు అందించనుంది. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి గారు ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 10ఏండ్లు అధికారంలో ఉన్న దొరలు స్వార్థంగా వారి స్వలాభం కోసం ప్రాజెక్టుల పేరు మార్చి, కొత్త డిజైన్లతో కోట్లాది రూపాయల ప్రజల సొమ్మును కొల్లగొట్టారు. అసంపూర్తిగా వదిలేసిన సీతారామ ప్రాజెక్టు పనులను ప్రజా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చేపట్టి త్వరలో పూర్తి



చేయబోతుంది. ఇప్పటికే మంజూరైన దొమ్మలవాగు రిజర్వాయర్ పనులకు నిధులు మంజూరు చేసి,త్వరలో టెండర్లు పిలుస్తాం. దీన్ని కూడా తప్పకుండా సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తెస్తాం. దీని ద్వారా బూర్గంపాడు ప్రాంతంలో వ్యవసాయానికి ఉన్న ఇబ్బందులు శాశ్వతంగా తొలగిపోతాయి. అదేవిధంగా రేకులగండి ప్రాజెక్టు పనులు కూడా ప్రారంభిస్తాము. అంతేకాదు జిల్లాలో పెండింగ్ లో ఉన్న పులుసుబొంత ప్రాజెక్టు సంబంధించి భూసేకరణ, అటవీ శాఖకు ప్రత్యామ్నాయ భూముల కేటాయింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు గారు, కోరం కనకయ్య గారు, జారే ఆదినారాయణ గారు, డిసిసి అధ్యక్షురాలు దేవి ప్రసన్న గారు, కలెక్టర్, సబ్ కలెక్టర్, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ఆయా గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

## ఓట్ల కోసం చివరికి దేవుడుని కూడా
## మోసం చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీది..

అన్నదాన సత్రం నుంచి మెట్లదారిన దేవస్థానం చుట్టూ కలియతిరిగి నేరుగా పనులను పరిశీలించాను. ఆ తర్వాత భద్రాచలంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో దేవస్థాన పునరాభివృద్ధి పనులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించి, పనుల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం నెలకొనొద్దని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచనలు చేయడం జరిగింది. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని ప్రగల్బాలు పలికారు. ఓట్ల కోసం చివరికి దేవుని పేరు చెప్పి ప్రజలను మోసం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భద్రాచలం అభివృద్ధికి రూ. 351 కోట్లను కేటాయించడం జరిగింది. అదేవిధంగా సుమారు రూ. 275 కోట్లు నిధుల మంజూరుతో పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. అధికారులు కూడా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఆ స్వామి వారి దయతో 2027 గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు అందేలా తప్పకుండా సకాలంలో పనులన్నీ పూర్తి చేస్తాం. ఈ కార్యక్రమంలో ఎంపీ బలరాం నాయక్ గారు, ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ గారు, తెల్లం వెంకట్రావు గారు, జిల్లా కలెక్టర్, నిర్మాణ సంస్థ ప్రతినిధులు, స్తపతి, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ ఈవో, పండితులు, సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డికి నెల రోజుల డెడ్ లైన్ విధించిన కవిత



ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్నానన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐదుగురు గిరిజన, మైనార్టీ పసిపిల్లలు ప్రాణాలు కోల్పోతే కనీసం వచ్చి పరామర్శించే సమయం కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. వైఫల్యాలను ఎండగడుతూ, సీఎంకు నెల రోజుల గడువు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ వ్యవధిలోగా ప్రభుత్వ ఆసుపత్రుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, గిరిజన గూడేలకు రహదారి సదుపాయాలు కల్పించాలని, కేంద్ర నిధుల వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రులకు నిధులు కేటాయించకపోతే ఆదివాసీలతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 'ఘెరావ్' చేపడతామని హెచ్చరించారు. రిమ్స్‌లో 150 ఏసీలు ఉన్నా ఒక్క మెకానిక్ కూడా లేకపోవడం, హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో రూ.500 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వైద్యారోగ్య రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని దుయ్యబట్టారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# ఊగిసలాటలో చమురు ధరలు

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల వేళ ఇరాన్ కీలక ప్రతిపాదన చేసింది. అమెరికా సైనిక ఒత్తిడిని తగ్గించి, దిగ్బంధనాన్ని ఎత్తివేస్తే ఏడు రోజుల్లో హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు సిద్ధమని తెలిపింది. ఈ విషయాన్ని ఓ సీనియర్ ఇరాన్ అధికారి వెల్లడించినట్లు రాయిటర్స్ తెలిపింది. మధ్యవర్తుల ద్వారా ఈ ప్రతిపాదనను అమెరికాకు చేరవేసినట్లు సమాచారం.అమెరికాతో చర్చలను తిరిగి ప్రారంభించేందుకు ఇరాన్ సిద్ధంగా ఉన్నట్లు ఈ ప్రతిపాదనతో సంకేతాలు ఇచ్చింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సందర్భంగా న్యూయార్క్‌లో మధ్యవర్తి దేశాలతో ఈ అంశంపై చర్చించాలని టెహ్రాన్ భావిస్తోంది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య భేటీ ఉండబోదని ఇరాన్ అధికారి తెలిపారు. అయితే అమెరికా నిబద్ధత చూపితే ఒప్పందం దిశగా వెళ్లే అవకాశం ఉందన్నారు.హర్మూజ్ జలసంధికి సంబంధించిన సైనిక చర్యలను అమెరికా నిలిపివేయాలని ఇరాన్ కోరుతోంది. అమెరికా సైనిక ఒత్తిడిని తగ్గించి, ఇరాన్ పోర్టులపై ఆంక్షలు ఎత్తివేస్తే జలసంధిని తిరిగి తెరిచి చర్చలను కొనసాగిస్తామని టెహ్రాన్ చెబుతోంది. పోర్టులపై ఆంక్షలు ఇరాన్ ముడిచమురు ఎగుమతులు, సముద్ర రవాణాపై ప్రభావం చూపుతున్నాయి. చర్చలను పునరుద్ధరించేందుకు ఇరాన్ గతంలో ఏడు షరతులను కూడా వెల్లడించింది.హర్మూజ్ జలసంధి త్వరలో తెరుచుకునే అవకాశం ఉందన్న వార్తలతో అంతర్జాతీయ చమురు ధరలు తగ్గాయి. బ్యారెల్ చమురు ధర 99 డాలర్ల దిగువకు పడిపోయింది. బ్రెంట్ క్రూడ్ ధర సెషన్ గరిష్ఠ స్థాయి నుంచి 3.5 శాతానికి పైగా తగ్గగా, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ 2.25 శాతం పడిపోయింది. హర్మూజ్ ద్వారా ముడిచమురు సరఫరాలో అంతరాయాలపై ఆందోళనలు తగ్గడంతో ధరలు దిగివచ్చాయి. మురు సరఫరా వ్యవస్థలో తలెత్తిన కీలక పరిణామాలు మరియు మౌలిక వసతులు నరుద్ధరించబడటమే ఈ లభ్యతకు, ఫలితంగా ధరల తగ్గుదలకు ముఖ్య కారణాలుగా నిలుస్తున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఉత్పత్తి దారులలో ???న సౌదీ అరేబియా తమ 'ఈస్ట్ వెస్ట్ ఆయిల్ పైప్‌లైన్' ద్వారా సరఫరాలను తిరిగి ప్రారంభించడం మార్కెట్లో సానుకూల వాతావరణాన్ని నింపింది. దీనికితోడు గత కొంతకాలంగా అంతరాయం ఏర్పడిన ఎర్ర సముద్రపు సరుకు రవాణా మార్గాల ద్వారా చమురు ఎగుమతులు మళ్లీ పునరుద్ధరించబడటం అంతర్జాతీయంగా చమురు కొరత భయాలను తొలగించింది. సరఫరా మార్గాలు సజావుగా మారడంతో క్రూడాయిల్ లభ్యత పెరిగి, అంతర్జాతీయ బెంచ్ మార్క్ లైన బ్రెంట్ మరియు డబ్ల్యూటీఐ ధరలు గణనీయంగా దిగిరావడానికి మార్గం సుగమమైంది.వారం రోజుల క్రితం మధ్యప్రాచ్యంలో క్షీణిస్తున్న భద్రతా పరిస్థితులు ,సరికొత్త పరిణామాలతో అమెరికా ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఖతార్ మధ్యవర్తిత్వంతో అమెరికాతో యుద్ధాన్ని ముగించేందుకు తాము ఏడు ప్రధాన షరతులను ప్రతిపాదించినట్లు ఇరాన్ ప్రకటించింది. యుద్ధం పూర్తిగా నిలిచిపోవాలని, ఫ్రీజ్ చేసిన ఇరాన్ నిధులను విడుదల చేయాలని, అలాగే ఇరాన్ ఓడరేవులపై అమెరికా అమలు చేస్తున్న నావికా దిగ్బంధాన్ని ఎత్తివేయాలని టెహ్రాన్ డిమాండ్ చేస్తోంది. మరోవైపు, తాము సరికొత్త యాంటీ-షిప్ బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించామని, వాషింగ్టన్ కనుక పూర్తి స్థాయి యుద్ధానికే మొగ్గుచూపితే తాము సిద్ధమేనని ఇరాన్ హెచ్చరించింది.ఈ ఉద్రిక్తతల నీడలోనే యెమెన్‌లోని ఇరాన్ మద్దతుగల హూతీ రెబెల్స్ సౌదీ



అరేబియాపై దాడులను తీవ్రతరం చేశారు. రాజధాని రియాద్‌లోని అత్యంత సున్నితమైన ప్రాంతాలతో పాటు యాన్బు లోని ప్రముఖ అరామ్‌కో చమురు నిల్వలపై బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు నిర్వహించినట్లు హూతీలు ప్రకటించారు. అయితే, ఈ దాడులను సౌదీ నేతృత్వంలోని కూటమి బలగాలు సమర్థవంతంగా తిప్పికొట్టాయని, ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా క్షిపణులను గాలిలోనే ధ్వంసం చేశామని సౌదీ స్పష్టం చేసింది. పౌరులు, పౌరసౌకర్యాలపై హూతీలు చేస్తున్న దాడులను తీవ్రంగా ఖండించిన కూటమి, తగిన రీతిలో బదులిచ్చే హక్కు తమకు ఉందని హెచ్చరించింది.ఈ ప్రాంతంలో క్షీణిస్తున్న భద్రతా పరిస్థితుల కారణంగా, మధ్యప్రాచ్యంలోని తొమ్మిది దేశాలలో ఉన్న అమెరికన్ పౌరులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, గగనతల మూసివేతలు, విమానాల రాకపోకలు ఆగిపోయే పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని యూఎస్ విదేశాంగ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు, సౌదీ అరేబియాను ఈ ప్రాంతీయ యుద్ధంలోకి అనవసరంగా లాగకూడదని టర్కీ అంటోంది. ఇటీవలే కుదిరిన మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్ నిబంధనల ప్రకారం సౌదీకి అవసరమైన సైనిక సహాయాన్ని అందించడానికి సిద్ధంగా ఉన్నామని టర్కీ అంటోంది.మరో వైపు ట్రంప్ తన వారాంతాన్ని అత్యవసరంగా ముగించుకుని క్యాంపు డేవిడ్ కు చేరుకున్నారు. ఈ పరిణామాల మధ్యే దౌత్యపరమైన మంతనాలు కూడా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పాకిస్థాన్ మినిస్టర్ మొహ్సిన్ నఖ్వీ టెహ్రాన్ వెళ్లనున్నారు. అయితే అమెరికా ప్రతిపాదనలకు సంబంధించిన ఎలాంటి అధికారిక సమాచారాన్ని ఆయన మోసుకొని రావడం లేదని ఇరాన్ విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఏది ఏమైనప్పటికీ, హూతీల క్షిపణి దాడులు, ఇరాన్-అమెరికా మధ్య నడుస్తున్న మాటల యుద్ధం, గ్లోబల్ షిప్పింగ్ రూట్లపై పెరుగుతున్న నీడలు మిడిల్ ఈస్ట్‌ను మరోసారి అత్యంత ప్రమాదకర అంచున నిలబెట్టాయి.

# నకిలీ విల్లా వెంచర్ బిల్డర్‌పై తెలంగాణ రెరా కొరడా!

హైదరాబాద్, సెప్టెంబర్ 23,: తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ మోసపూరిత బిల్డర్లపై తన ప్రతాపాన్ని చూపుతూ మరో సంచలన తీర్పు వెలువరించింది. సరైన అనుమతులు లేని విల్లా ప్రాజెక్ట్ పేరుతో ఓ అమాయక మహిళ నుంచి రూ. 79 లక్షలు భారీగా వసూలు చేసి, ఆపై నిర్మాణం పూర్తి చేయకుండా చేతులెత్తేసిన ఓ కేటుగాడికి వ్యతిరేకంగా బాధితురాలికి అనుకూలంగా తీర్పునిచ్చింది. చట్ట నిబంధనలను ఉల్లంఘించి వినియోగదారులను మోసం చేసిన ఆ బిల్డర్‌కు భారీ జరిమానా విధిస్తూ రెరా కఠిన చర్యలు తీసుకుంది.ఎలాంటి చట్టపరమైన అనుమతులు, లేఅవుట్ అప్రూవల్స్ లేకపోయినా ఆకర్షణీయమైన ప్రకటనలతో సదరు బిల్డర్ విల్లా ప్రాజెక్ట్‌ను విక్రయిస్తున్నట్లు నమ్మించాడు. దీనిని నిజమని నమ్మిన బాధితురాలు విల్లా కొనుగోలు నిమిత్తం విడతలవారీగా మొత్తం రూ. 79 లక్షలను ఆ సంస్థకు చెల్లించింది. అయితే డబ్బులు తీసుకున్నప్పటికీ ప్రాజెక్ట్ పనులు ముందుకు సాగకపోగా, కనీస నిర్మాణాలు కూడా పూర్తి చేయకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. మోసపోయానని గ్రహించిన బాధితురాలు తక్షణమే న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ రెరాను ఆశ్రయించింది.బాధితురాలి ఫిర్యాదును అత్యంత సీరియస్‌గా పరిగణించిన టీఎస్‌రెరా అధికారులు ఇరువర్గాల వాదనలను విచారించి సమగ్ర దర్యాప్తు జరిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రాజెక్ట్ చేపట్టడం, డబ్బులు వసూలు చేసి మోసం చేయడం నిరూపితం కావడంతో రెరా చట్టం ప్రకారం బిల్డర్‌ను దోషిగా తేల్చారు. బాధితురాలి నుంచి వసూలు చేసిన అసలు మొత్తం రూ. 79 లక్షలను, ఎలాంటి జాప్యం లేకుండా చెల్లించాలని స్పష్టం చేసింది.అంతేకాకుండా, ఆ మొత్తంపై కాలయాపన చేసినందుకు గాను వార్షికంగా 10.7 శాతం వడ్డీని కలిపి బాధితురాలికి తిరిగి చెల్లించాలని రెరా తన తీర్పులో తేల్చిచెప్పింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి వినియోగదారులను మోసగిస్తే చట్టపరంగా ఎంతటి కఠిన చర్యలు ఉంటాయో ఈ తీర్పు ద్వారా మరోసారి రుజువైంది. సోషల్ మీడియా ప్రకటనలు, అనుమతులు లేని ప్రీలాంచ్ వెంచర్లను గుడ్డిగా నమ్మి మోసపోవద్దని, రియల్ ఎస్టేట్ లావాదేవీల్లో కొనుగోలుదారులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఈ ఘటన హెచ్చరిస్తోంది

# ఉత్సాహభరితంగా జిల్లాస్థాయి ఎస్ జిఎఫ్ కబడ్డీ పోటీలు

- విజేతలుగా మదనాపూర్ బాలురు, ఘనపూర్ బాలికలు
- పోటీలకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పూర్తి సహకారం
- 15 మండలాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు



వనపర్తి జిల్లా ప్రతినిధి,సెప్టెంబరు 23 (విజన్ ఆంధ్ర) : వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-17 బాలబాలికల కబడ్డీ పోటీలు ఉత్సాహభరితంగా ముగిశాయి. ఈ పోటీల్లో జిల్లా పరిధిలోని అమరచింత, ఆత్మకూర్, చిన్నంబావి, ఘనపూర్, గోపాల్‌పేట, కొత్తకోట, పానగల్, పెబ్బేరు, పెద్దమందడి, మదనాపూర్, రేవల్లి, వనపర్తి, వీపనగండ్ల, శ్రీరంగాపూర్, ఏదుల 15 మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

**ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లు**

పోటీల్లో క్రీడాకారులు అద్భుత నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఉత్కంఠభరితంగా సాగిన బాలుర విభాగంలో మదనాపూర్ జట్టు ప్రథమ బహుమతి సాధించగా, కొత్తకోట జట్టు ద్వితీయ బహుమతి కైవసం చేసుకుంది. అలాగే బాలికల విభాగంలో ఘనపూర్ జట్టు విజేతగా నిలిచి ప్రథమ బహుమతి గెలుచుకోగా, పెబ్బేరు జట్టు ద్వితీయ స్థానంతో సరిపెట్టుకుంది.

**ఎమ్మెల్యే ప్రోత్సాహం అభినందనీయం**


గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు వనపర్తి శాసనసభ్యులు గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి ఈ పోటీలకు పూర్తి సహాయ సహకారాలు అందించారని నిర్వాహకులు తెలిపారు. ప్రతిభావంతులైన క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ముందుకు వెళ్లేలా ఎమ్మెల్యే ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. పాఠశాల స్థాయి క్రీడలు విద్యార్థుల్లో నైపుణ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

**సమన్వయంతో పోటీల నిర్వహణ**

ఖిల్లా ఘణపురం మండల పీఈటీ చిట్టెమ్మ సమన్వయంతో, 15 మండలాల ఫిజికల్ డైరెక్టర్లు పీడీలు, వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో పోటీలు సజావుగా సాగాయి. క్రీడాకారులకు పీడీలు తగిన మార్గదర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ సుధీర్‌రెడ్డి, ఎస్ జిఎఫ్ ఇన్‌చార్జి కుమార్, స్థానిక సర్పంచ్ రమేష్ నాయక్, గ్రామ పెద్ద వెంకటరామిరెడ్డి, మండలాధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, వనపర్తి మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎంపీడీవో పరిణతి, రాఘవేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, క్రీడా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# న్యూక్లియర్ ఫ్యూజన్ లో భారత్ ముందడుగు

విజయవాడ, సెప్టెంబర్ 23, : న్యూక్లియర్ ఫ్యూజన్ ఎనర్జీ రంగంలో భారత్ మరో



మైలురాయిని అధిగమించింది. సూర్యుడి కేంద్రం కన్నా 20 రెట్ల వేడి ప్లాస్మాను సృష్టించారు. గుజరాత్‌లోని ప్లాస్మా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐపీఆర్)కు చెందిన సాషు-1 టోకామాక్‌పై కొత్త శక్తివంతమైన గైరో ట్రాన్ వ్యవస్థను విజయవంతంగా ప్రారంభించారు. ఇది 82.6 గిగాహెర్ట్జ్ ఫ్రీక్వెన్సీ, 400 కిలోవాట్ల సామర్థ్యంతో పనిచేస్తుంది. టోకామాక్‌లోని అత్యంత వేడి ప్లాస్మాను మరింత వేడి చేయడానికి ఈ కొత్త పరికరం ఉపయోగపడుతుంది.స్టడీ స్టేట్ సూపర్‌కండక్టింగ్ టోకామాక్(సాషు-1) అనే పరికరం, నియంత్రిత పద్ధతుల్లో సూర్యుడిపై జరిగే న్యూక్లియర్ ఫ్యూజన్ ప్రక్రియను నిర్వహిస్తుంది. టోకామాక్‌లోని బలమైన అయస్కాంత క్షేత్రం ప్లాస్మాను నియంత్రిస్తుంది. తాజా పరిశోధనల్లో ప్లాస్మా ఉష్ణోగ్రత 20 కోట్ల డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా చేరింది. ఇది సూర్యుడి కేంద్రంలో ఉత్పత్తి అవుతున్న వేడి కన్నా దాదాపు 10-20 రెట్లు ఎక్కువ.గైరో ట్రాన్ అనేది అధిక ఫ్రీక్వెన్సీ మైక్రోవేవ్ శక్తిని ఉత్పత్తి చేసే ప్రత్యేక పరికరం. ఈ శక్తిని టోకామాక్‌లోని ప్లాస్మాలోకి పంపించడం ద్వారా దాని ఉష్ణోగ్రతను మరింత పెంచుతారు. సాషు-1లో ఇంతకుముందు 42 గిగాహెర్ట్జ్ జైరోట్రాన్ వ్యవస్థను ఉపయోగించారు. ఇప్పుడు ఏర్పాటు చేసిన 82.6 గిగాహెర్ట్జ్ వ్యవస్థ అధిక సామర్థ్యంతో ప్లాస్మాను వేడి చేయడానికి సహాయపడుతుంది.ఫ్యూజన్ ప్రక్రియలో ప్లాస్మాను అత్యంత వేడికి చేర్చడమే కాకుండా, దానిని తగిన సమయం పాటు స్థిరంగా ఉంచడం కూడా అత్యంత కీలకం. కొత్త గైరో ట్రాన్ ఈ ప్రయోగాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు సైంటిస్టులకు ఉపయోగపడింది.ఫ్యూజన్ (కేంద్ర సంలీన చర్య) ముఖ్యంగా సూర్యుడి వంటి నక్షత్రాల్లో జరుగుతుంది. దీని వల్ల అపారమైన శక్తి వెలువడుతుంది. స్వచ్ఛమైన భారీ స్థాయిలో శక్తిని అందించగల సామర్థ్యం దీని సొంతం. ఇందులో హైడ్రోజన్ ఐసోటోపులను ఇంధనంగా ఉపయోగించే అవకాశం ఉంది. హైడ్రోజన్ ఐసోటోపులు ఢీకొని హీలియంగా మారి, భారీ శక్తి విడుదల అవుతుందిప్రస్తుతం సాంప్రదాయ అణు విద్యుత్ కేంద్రాల్లో జరిగే న్యూక్లియన్ ఫిజన్(కేంద్ర విచ్ఛిత్తి చర్య) వల్ల యురేనియం లేదా ప్లూటోనియం ఢీకొట్టుకోవడం వల్ల చిన్న కేంద్రకాలుగా విడిపోతుంది. దీని వల్ల శక్తి విడుదల అవుతుంది. ఫిషన్‌తో పోలిస్తే ఫ్యూజన్ చర్యలో దీర్ఘకాలికంగా నిల్వ చేయాల్సిన రేడియోధార్మిక వ్యర్థాల సమస్య తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. తక్కువ ఇంధనంతో భారీ శక్తిని ఉత్పత్తి చేయవచ్చు.అణు రియాక్టర్లలో న్యూక్లియన్ ఫిషన్ చర్య ఒక విచ్ఛత్తి మరో విచ్ఛత్తికి దారి తీసే చైన్ రియాక్షన్ ఉంటుంది. ఫ్యూజన్‌లో ప్లాస్మా పరిస్థితులు కొనసాగకుంటే ఫ్యూజన్ చర్య వెంటనే స్వయంగా ఆగిపోతోంది. దీని వల్ల పెద్ద ప్రమాదాలు ఉదాహరణకు చెర్నో బిల్ వంటి ప్రమాదాలు ఉండవు. ఫ్యూజన్ చర్యలో విడుదలయ్యే హీలియం రేడియో యాక్టివ్ కాదు. అణు వ్యర్థాల సమస్యే ఉండదు.

# నయీం హత్య కేసులో మరో ముగ్గురి అరెస్ట్

- ప్రధాన సూత్రధారి ఉమామహేష్ సహా ఇద్దరి అరెస్ట్
- అదుపులో మొత్తం 11 మంది నిందితులు



హైదరాబాద్, సెప్టెంబర్ 23,:బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో రౌడీషీటర్ మహమ్మద్ నయీం హత్య కేసులో పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారి సహా ముగ్గురిని నాగోల్ పోలీసులు మంగళవారం రాత్రి అరెస్టు చేశారు. ఖమ్మంకు చెందిన కె.ఉమామహేష్ అలియాస్ జేకే మహేష్ (34), సాయినగర్‌కు చెందిన మహమ్మద్ మున్నా అలియాస్ బోలె (47), ఖమ్మం జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దుగ్గిరాల కార్తీక్ (29)లను ఎల్.బి.నగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 14న బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో నయీమ్‌పై నిందితులు వేటకొడవళ్లతో దాడి చేసి హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఈ నెల 16న ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన సూత్రధారి ఉమామహేష్ మాత్రం అప్పటి నుంచి పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. తాజాగా అతడితో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేశారు. నయీం, ఉమామహేష్ బాల్య స్నేహితులు. చిన్నతనం నుంచే నేరాలకు పాల్పడటంతో ఇల్లందు పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరిపై రౌడీషీట్లు ఉన్నాయి. కొంతకాలంగా ఇల్లందు, కొత్తగూడెం, ఖమ్మం, హైదరాబాద్ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్లు చేస్తూ ఉండేవారు. ఓ రియల్ ఎస్టేట్ సెటిల్మెంట్లో విభేదాలు రావడంతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుండగా, ఉమా మహేష్ ఖమ్మంలో సోలార్ ప్యానల్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. కాగా ఇద్దరి మధ్య ఏర్పడిన విభేదాలు ఒకరిపై ఒకరు కక్ష పెంచుకునేలా దారితీసింది. నయీంను హత్య చేసేందుకు ఈ నెల 13న ఖమ్మంలోని ఓ హోటల్‌లో ఉమా మహేష్ తన అనుచరులతో కలిసి పథకం రచించి మరుసటి రోజు ఖమ్మం నుంచి నిందితులు కారులో హైదరాబాద్‌కు చేరుకున్నారు. మున్నా ద్వారా నయీంకు ఫోన్ చేసి అతడి ఆచూకీ తెలుసుకున్నారు. బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో నయీం ఉన్నట్లు నిర్ధారించుకుని అక్కడికి వెళ్లి అతడి కళ్లలో కారం చల్లి వెంబడించిన నిందితులు.. హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో ఇప్పటికే ఎనిమిది మంది అరెస్టు కాగా.. తాజాగా మరో ముగ్గురి అరెస్టుతో మొత్తం అరెస్టుల సంఖ్య 11కు చేరింది. కాగా ఈ కేసులో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్, ఐపీఎస్ బి.సుమతి ఆదేశాలతో ఎల్.బి.నగర్ డీసీపీ బి.అనురాధ, ఎస్ఓటి ఏసీపీ రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో నాగోల్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పరారీలో ఉన్న నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చేపట్టి ప్రధాన సూత్రధారి ఉమామహేష్‌తో పాటు మరో పదిమంది నిందితులను అరెస్టు చేసినట్లు నాగోల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు.




# తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించిన శ్రీధర్

మల్కాజిగిరి, అల్వాల్ ,సెప్టెంబర్ 23, (విజన్ ఆంధ్ర): బ్రహ్మోత్సవాల పర్వదినాలను పురస్కరించుకుని తిరుమల శ్రీక్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర మాజీ ఎంబీసీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీస్సులు తీసుకున్నారు.

# రాష్ట్రంలోని 14 లక్షల మంది విద్యార్థుల స్కాలర్ షిప్ లు

- ఫీజులు వెంటనే చెల్లించాలి
- విద్యానగర్ నుంచి వేలాదిమంది విద్యార్థులతో భారీ ప్రదర్శన
- రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై ఆర్.కృష్ణయ్య ఫైర్



హైద్రాబాద్ సెప్టెంబర్ 23 : :రాష్ట్రంలో 14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల స్కాలర్ షిప్లు, ఫీజుల బకాయిలు 8500కోట్లు వెంటనే విడుదల చేయాలని, ఈ స్కీము ఎత్తివేయాలనే కుట్రలు మానుకోవాలని, ఈ స్కీమును యధాతధంగా పాత పద్ధతిలోనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది విద్యార్థులు నేడు విద్యానగర్ నుంచి భారీ ప్రదర్శన జరిపారు. ఈ ప్రదర్శనకు బిసి సంక్షేమ సంఘం సంఘం జాతీయఅధ్యక్షులు,రాజ్య సభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిధిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ స్కీముకు బడ్జెట్ ఇవ్వకుండా ముఖ్యమంత్రి పేద కులాల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. ఫీజుల బకాయిలు ఇవ్వాలని శాంతియుతంగా ఉద్యమాలు చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు చదువుకుంటుంటే కూడా ఓర్వలేక పోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని పేద కులాలు చదువుకోకుండా కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఈ ఫీజుల బకాయిలు 8500 కోట్లు చెల్లించడం ముఖ్యమంత్రికి ఒకలెక్క కాదు. మూడున్నర సంవత్సరాలుగా విద్యార్థులు పడుతున్న భాదలు చెప్పతరం కాదు. కోర్సు పూర్తి అయిన 6 లక్షల మందికి కాలేజి యాజమాన్యాలు సర్టిఫికేట్లు ఇవ్వడం లేదు. వీరికి ఉద్యోగాలు వచ్చిన చేరలేక - ఉన్నత విద్యకు పోలేక చాల ఇబ్బంది పడుతున్నారు. చదువుతున్న వారి ఫీజులు కట్టే వరకు కాలేజీలకు రానివ్వడంలేదు. ఫీజుల బకాయిలు చెల్లించక పోవడంతో విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ భారీ ప్రదర్శనలో రాష్ట్ర బి.సి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, రాష్ట్ర బి.సి విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ నిఖిల్ పటేల్, అధ్యక్షులు పగిళ్ళ సతీష్, బి.సి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి. రాజేందర్, నరేష్ గౌడ్, శివ కుమార్ యాదవ్, రమేష్, రాహుల్, సురేష్, రమణ, కె. వంశీ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# 13 ప్రాంతాల్లో హైటెక్ బస్టాండ్లు...



నల్గొండ సెప్టెంబర్ 23,: తెలంగాణలో ప్రజారవాణా వ్యవస్థను ఆధునీకరించే దిశగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై బస్టాండ్ అంటే కేవలం బస్సు కోసం వేచి చూసే ఇరుకు ప్రదేశం మాత్రమే కాకుండా, షాపింగ్, వినోదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చబోతోంది. తెలంగాణ ప్రభుత్వం, టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి వినూత్న ఆలోచనతో రాష్ట్రవ్యాప్తంగా 13 ప్రాంతాల్లో ఎయిర్‌పోర్ట్, కార్పొరేట్ స్థాయి హంగులతో మోడల్ బస్టాండ్లను నిర్మించేందుకు రవాణా శాఖ నుంచి అధికారిక ఆమోదం లభించింది. నూతనంగా అందుబాటులోకి రానున్న ఈ హైటెక్ బస్ స్టేషన్లలో ప్రయాణికుల కోసం మల్టీ-మోడల్ కనెక్టివిటీని ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల బస్సు దిగిన వెంటనే రైల్వే స్టేషన్లు లేదా ఇతర రవాణా సాధనాలను సులభంగా చేరుకోవచ్చు. అంతేకాకుండా కమర్షియల్ బిజినెస్ కాంప్లెక్స్‌లు, మల్టీప్లెక్స్ రేంజ్ ఫుడ్ కోర్టులు, పిల్లల గేమింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లను అందుబాటులోకి తేనున్నారు. బిజినెస్ విస్తరణ కోసం వ్యాపారులు ఈ కాంప్లెక్స్‌లలో షాపులను కేటాయించుకోవచ్చని ఆర్టీసీ ప్రకటించింది.ప్రపంచ పటాలు పరిశీలించండి తొలివిడతగా నాగర్‌కర్నూల్, రేగొండ, హుజూర్ నగర్, కోదాడ, కొడంగల్, కోస్గి, మద్దూరు, కేసముద్రం, హుస్నాబాద్, ములుగు, మధిర, నల్గొండ, కొత్తగూడెం ప్రాంతాల్లో ఈ మోడల్ బస్టాండ్లను నిర్మించనున్నారు. త్వరలోనే పనులు ప్రారంభం కానున్న ఈ ప్రాజెక్టుతో తెలంగాణ ఆర్టీసీ ప్రయాణికులకు మరింత నాణ్యమైన, ఆధునిక సేవలను అందించనుంది.

# అల్వాల్లో తొలిసారిగా ఆయిల్పామ్ అవగాహన సదస్సు.

**- తొలి పంట కోతను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.**

రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ కేశంపేట మండలం అల్వాల్ గ్రామంలో తొలిసారిగా ఆయిల్పామ్ సాగుపై అవగాహన సదస్సుతో పాటు పంట కోత మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతు భుజంగారెడ్డి సాగు చేసిన ఆయిల్పామ్ తోటలో తొలి పంట కోతను షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు,ఉద్యానవన అధికారులు, ఉద్యానవన విస్తరణ అధికారులు, వాల్యూ ఆయిల్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.జిల్లాలో 4,370 ఎకరాల్లో ఆయిల్పామ్ సాగు రంగారెడ్డి జిల్లా ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ కే.సురేష్ మాట్లాడుతూ... మూడు సంవత్సరాల క్రితం నాటిన ఆయిల్పామ్ తోటలో తొలి పంట కోత ప్రారంభించేందుకు వచ్చామని తెలిపారు.రంగారెడ్డి జిల్లాలో తొలిసారిగా కోతకు వచ్చిన ఆయిల్పామ్ తోట భుజంగారెడ్డిదేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులకు ఆయిల్పామ్ సాగుపై అవగాహన కల్పించేందుకు సదస్సు నిర్వహించినట్లు తెలిపారు.జిల్లాలో మొత్తం 3.57 లక్షల ఎకరాల సాగుయోగ్యమైన భూమి ఉందని,కాల్వలు, రిజర్వాయర్లు అందుబాటులో లేకపోవడంతో 57,637 బోర్లు, 5,600 బావుల ఆధారంగా సాగు జరుగుతోందని వివరించారు. జిల్లాలో మొదటి ఏడాది 510 ఎకరాలు, రెండో ఏడాది 1,637 ఎకరాలు, మూడో ఏడాది 1,601 ఎకరాల్లో ఆయిల్పామ్ సాగు ప్రారంభమైందని, ప్రస్తుతం మొత్తం 4,370 ఎకరాల్లో ఈ పంట సాగులో ఉందన్నారు. ఈ ఏడాది 2,300 ఎకరాల్లో ఆయిల్పామ్ సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే 829 మంది రైతులు 2,672 ఎకరాలకు నాన్-సబ్సిడీ చెల్లించి దరఖాస్తు చేసుకున్నారని సురేష్ తెలిపారు.ఆయిల్పామ్ 30 నుంచి 40 సంవత్సరాల పాటు సాగు చేయగల సుదీర్ఘకాలిక పంట అని, నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమవుతుందని చెప్పారు. ఎకరానికి నాలుగో సంవత్సరంలో సుమారు 4 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉండగా, పదో సంవత్సరం నాటికి 10 టన్నుల వరకు దిగుబడి సాధించే అవకాశం ఉందన్నారు. ప్రపంచంలో అత్యధికంగా నూనె దిగుబడిని ఇచ్చే పంటల్లో ఆయిల్పామ్ ముఖ్యమైనదని, వరి సాగుతో పోలిస్తే నీటి ఎద్దడి, కూలీల కొరత వంటి సమస్యలు తక్కువగా ఉంటాయని వివరించారు.

# చర్చలు విఫలం...

**- ఐదు రోజులు బ్యాంకులు బంద్!**

**- సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల సమ్మె**




న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ సేవలకు మరోసారి అంతరాయం ఏర్పడనుంది. బ్యాంకు యూనియన్లు, ప్రభుత్వ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో, యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్బీయూ దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. ఫలితంగా సెప్టెంబర్ చివరి వారంలో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకులు మూతపడనున్నాయి. వారానికి ఐదు రోజుల పనిదినాలు, ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ బ్యాంకు సంఘాలు కొంతకాలంగా నిరసనలు తెలుపుతున్నాయి. ఈ క్రమంలో ఆర్థిక శాఖ సూచన మేరకు మంగళవారం డిప్యూటీ లేబర్ కమిషనర్తో జరిపిన చర్చలు ఫలప్రదం కాలేదు. ఐదు రోజుల పని విధానం అంశం పరిశీలనలో ఉందని ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ, స్పష్టమైన హామీ లభించకపోవడంతో యూనియన్లు అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు సమ్మె చేపట్టాలని నిర్ణయించాయి. సమ్మెకు ముందు సెప్టెంబర్ 26, 27 తేదీల్లో శని, ఆదివారాలు కావడంతో బ్యాంకులకు సాధారణ సెలవులు ఉన్నాయి. దీంతో మొత్తం ఐదు రోజుల పాటు బ్యాంకింగ్ లావాదేవీలు పూర్తిగా నిలిచిపోనున్నాయి. ఇదే డిమాండ్లతో ఈ నెల 11న కూడా బ్యాంకు సంఘాలు సమ్మె నిర్వహించిన విషయం విదితమే. ఈ పరిణామాల దృష్ట్యా, వినియోగదారులు తమ ముఖ్యమైన ఆర్థిక లావాదేవీలను ముందుగానే పూర్తి చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు

# టైరు పేలి అదుపు తప్పి బోల్తా పడిన ఏపీఎస్ఆర్టీసీ బస్సు

అన్నమయ్య : ఏపీఎస్ఆర్టీసీ బస్సు టైరు పేలి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ వెంకటేశ్వరరావుతో సహా 20 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. వాల్మీకిపురం మండలం విఠలం సమీపంలోని మదనపల్లి- తిరుపతి జాతీయ రహదారిపై ప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికులు క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

# ఎయిర్ పోర్టు క్రెడిట్ కోసం రేవంత్



వరంగల్ సెప్టెంబర్ 23, : తెలంగాణ సంస్కృతికి, పోరాటాల చరిత్రకు వరంగల్ జిల్లా గుండెకాయ లాంటిది. ఓరుగల్లు మట్టికి ఉన్న రాజకీయ, భావోద్వేగ ప్రాముఖ్యత హైదరాబాద్‌ను మించి ఉంటుంది. అలాంటి చారిత్రాత్మక వరంగల్‌లోని దశాబ్దాల కల అయిన మామునూరు ఎయిర్‌పోర్ట్ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వ్యూహం ప్రత్యేకమైనది. ఎయిర్‌పోర్ట్ రన్ వేలు, టెర్మినల్ భవనాల నిర్మాణం ఇంకా తొలి దశలోనే ఉన్నప్పటికీ.. ఈ కొత్త ఎయిర్‌పోర్ట్‌కు ఏ పేరు పెడితే బాగుంటుంది? మీ సూచనలు తెలపండి అంటూ సీఎం రేవంత్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా వేసిన ఒకే ఒక్క ప్రశ్న ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎమోషనల్ అండ్ పొలిటికల్ డిబేట్‌గా మారింది.కార్యరూపంలో ఒక పనిని పూర్తి చేయడం ఒకెత్తయితే, దాని నుంచి గరిష్ట రాజకీయ ప్రయోజనాన్ని, క్రెడిట్ ను తమ ఖాతాలో వేసుకోవడం మరొక ఎత్తు. ఈ విషయంలో రేవంత్ రెడ్డి అందరికంటే రెండు అడుగులు ముందే ఉన్నారని చెప్పవచ్చు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మామునూరు ఎయిర్‌పోర్టుకు భూసేకరణ జరగలేదని, బీఆర్ఎస్ నేతలు కేవలం ఫామ్‌హౌస్‌లకే ప్రాధాన్యమిచ్చారని విమర్శిస్తూనే.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.295 కోట్ల నిధులు కేటాయించి, 280 ఎకరాల భూసేకరణ పూర్తి చేసి ఏఏఐ కి అప్పగించిన విషయాన్ని రేవంత్ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారు. టెండర్ల ప్రక్రియ రూ.213 కోట్లతో ప్రారంభమైన వెంటనే 'పేరు సూచించండి' అని పిలుపునివ్వడం ద్వారా ప్రాజెక్ట్ సాధన క్రెడిట్ మొత్తాన్ని తన ఖాతాలోకి లాక్కోగలిగారు.హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం తర్వాత తెలంగాణలో ప్రస్తుతం మరే ఇతర రవాణా ఎయిర్‌పోర్ట్ లేకపోవడం వల్ల.. ఉత్తర తెలంగాణకు వరంగల్ ఎయిర్‌పోర్టే ఏకైక లైఫ్‌లైన్‌గా మారబోతోంది. ఇది కేవలం రవాణా సౌకర్యం మాత్రమే కాదు; కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఐటీ రంగాలు, రామప్ప దేవాలయం, వెయ్యి స్తంభాల గుడి వంటి పర్యాటక ప్రాంతాలకు ఒక న్యూ గ్లోబల్ గేట్‌వే అని చాటిచెప్పడం ద్వారా రేవంత్ ఓరుగల్లు ప్రజల ఆకాంక్షను తట్టారు. ఈ 'నేమ్ గేమ్' పిలుపునకు సోషల్ మీడియా నుంచి, సినీ రంగానికి చెందిన ప్రముఖుల నుంచి అనూహ్యమైన స్పందన లభించింది. వరంగల్‌కు చెందిన ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా స్పందిస్తూ రుద్రమ అంతర్జాతీయ విమానాశ్రయం లేదా కాకతీయ అంతర్జాతీయ విమానాశ్రయం అనే పేర్లను సూచించగా, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సమ్మక్క-సారలమ్మ , నటుడు విజయ్ దేవరకొండ, బండ్ల గణేష్, ఇతర నేతలు కాకతీయ , పి.వి. నరసింహారావు , 'చాకలి ఐలమ్మ వంటి చారిత్రాత్మక పేర్లను లేవనెత్తారు. సందీప్ వంగాకు రేవంత్ ఇచ్చిన దట్స్ ది స్పిరిట్ రిప్లై కూడా సోషల్ మీడియాలో ట్రెండ్ అయ్యింది.దీని ద్వారా రేవంత్ సాధించిన రాజకీయ ప్రయోజనం ఏంటంటే.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం పూర్తయి అందుబాటులోకి రావడానికి కనీసం మరో రెండేళ్లు సమయం పడుతుంది. కానీ, ఈ పేరు చుట్టూ నడిచే చర్చ వల్ల వరంగల్, కరీంనగర్, ఖమ్మం వంటి కీలక జిల్లాల ప్రజల మనస్సులో మామునూరు ఎయిర్‌పోర్టును మళ్లీ ట్రాక్‌పైకి తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే.. రేవంత్ రెడ్డి చొరవతోనే ఇది సాధ్యమైంది అనే బలమైన ముద్ర పడింది. నిర్మాణం పూర్తికాకముందే ఎమోషనల్ కనెక్ట్‌ను క్రియేట్ చేయడంలో సీఎం సక్సెస్ అయ్యారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ దీనిపై ఎంతగా ఎదురుదాడి చేయాలని చూసినా, భూసేకరణ పూర్తికావడం, ఆంక్షల క్లియరెన్స్ సాధించడం, టెండర్లు పడటం వంటి సాంకేతిక ఆధారాలు కాంగ్రెస్ వైపే ఉన్నాయి. ఎయిర్‌పోర్ట్ పేరుపై చర్చ పెట్టడం ద్వారా తెలంగాణ మూలాలను, ప్రజాభిప్రాయాన్ని గౌరవిస్తున్నారనే భావన కల్పిస్తూనే.. రాబోయే రోజుల్లో వరంగల్‌లో కాంగ్రెస్ తన రాజకీయ పట్టును మరింత పటిష్టం చేసుకునే దిశగా సీఎం రేవంత్ రెడ్డి తెలివైన పావును కదిపారని భావిస్తున్నారు.

# భాగ్యనగరంలో తగ్గిన రియల్ జోరు... నిలబెడుతున్న ఐటీ, జీసీసీలు



హైదరాబాద్, సెప్టెంబర్ 23, : కొన్నేళ్లుగా అనూహ్యమైన వృద్ధిని నమోదు చేసిన హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం ఇప్పుడు కాస్త నెమ్మదించింది. నివాస గృహాల విక్రయాలు మందగించినప్పటికీ, రికార్డు స్థాయిలో ఆఫీస్ స్పేస్ లీజింగ్, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ) విస్తరణతో ఉద్యోగాల ఆధారిత డిమాండ్ బలంగా ఉంది. దీంతో రియల్టీ రంగం కుప్పకూలిపోయే ప్రమాదం ఏమీ లేదని, కాస్త జాగ్రత్తపడే దశలోకి ప్రవేశించిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక ప్రకారం, 2026 ప్రథమార్ధంలో హైదరాబాద్‌లో 19,249 నివాస గృహాల అమ్మకాలు జరిగాయి. ఇది గతేడాదితో పోలిస్తే కేవలం ఒకశాతం మాత్రమే అధికం. కొత్త ప్రాజెక్టుల ప్రారంభం 2 శాతం తగ్గి 20,466 యూనిట్లుగా నమోదైంది. అయితే, ఇళ్ల సగటు ధరలు మాత్రం 7 శాతం పెరిగి చదరపు అడుగుకు రూ. 8,258కి చేరాయి. అమ్ముడుకాని ఇళ్ల సంఖ్య 3 శాతం పెరిగి 56,095 యూనిట్లకు చేరింది. గచ్చిబౌలి, కొండాపూర్, కోకాపేట, నియోపోలిస్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి పశ్చిమ హైదరాబాద్ ప్రాంతాలు ఇప్పటికీ మార్కెట్‌లో ఆధిపత్యం చెలాయిస్తున్నాయి.అయితే, క్రెడాయ్ హైదరాబాద్-క్రి మ్యాట్రిక్స్ నివేదికలో భిన్నమైన గణాంకాలు వెల్లడయ్యాయి. ఈ నివేదిక ప్రకారం, ఈ ఏడాది ప్రథమార్ధంలో అమ్మకాలు 13 శాతం తగ్గి 26,068 యూనిట్లుగా నమోదయ్యాయి.నివాస గృహాల మార్కెట్ మిశ్రమంగా ఉన్నప్పటికీ, వాణిజ్య సముదాయాల మార్కెట్ మాత్రం దూసుకుపోతోంది. 2026 ప్రథమార్ధంలో ఆఫీస్ స్పేస్ లావాదేవీలు 29 శాతం పెరిగి రికార్డు స్థాయిలో 7.5 మిలియన్ చదరపు అడుగులకు చేరాయి. ఇందులో జీసీసీల వాటానే 45 శాతం (3.4 మిలియన్ చదరపు అడుగులు) ఉండటం గమనార్హం. ప్రస్తుతం నగరంలో 515కు పైగా జీసీసీలు ఉండగా, వీటిలో 3 లక్షల మందికి పైగా నిపుణులు పనిచేస్తున్నారు. రాబోయే 3-5 ఏళ్లలో జీసీసీల ద్వారా మరో 8-12 మిలియన్ చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ ఏర్పడవచ్చని అనరాక్ రీసెర్చ్ అంచనా వేసింది. "జీసీసీల విస్తరణ నగరంలో రియల్ ఎస్టేట్ డిమాండ్‌ను గణనీయంగా పెంచుతోంది" అని అనరాక్ గ్రూప్ ఛైర్మన్ అనూజ్ పురి తెలిపారు.మరోవైపు, ప్రతిపాదిత మెట్రో ఫేజ్-2, రీజినల్ రింగ్ రోడ్ వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు కూడా రియల్టీ అంచనాలను ప్రభావితం చేస్తున్నాయి. అయితే, పెరుగుతున్న ధరల వల్ల అందుబాటు ధరల్లో ఇళ్లు దొరకడం సవాలుగా మారుతోంది. డెవలపర్లు ఎక్కువగా ప్రీమియం ప్రాజెక్టులపదృష్టి పెడుతున్నారు.మొత్తం మీద హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ఒక పరిణితి చెందిన దశకు చేరుకున్నట్లు కనిపిస్తోంది. ఉద్యోగ కల్పన, మౌలిక సదుపాయాలు, అందుబాటు ధర వంటి అంశాలే భవిష్యత్తులో ఈ రంగం వృద్ధిని నిర్దేశించనున్నాయని స్పష్టమవుతోంది.

# నోరు ఎత్తని టీడీపీ ఫైర్ బ్రాండ్స్...



విజయవాడ, సెప్టెంబర్ 23, : ఆంధ్రప్రదేశ్‌లో అధికార తెలుగుదేశం పార్టీ లో కొంతకాలంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ముఖ్యంగా గతంలో తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు, అంతర్గత విభేదాలతో వార్తల్లో నిలిచిన కొందరు నేతలు ఇప్పుడు తమ నియోజకవర్గాల వ్యవహారాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనే చర్చ మొదలైంది. దీనికి పార్టీ అధిష్టానం అనుసరిస్తున్న క్రమశిక్షణ విధానమే కారణమా అనే ప్రశ్న కూడా వినిపిస్తోంది.2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొందరు టీడీపీ ఎమ్మెల్యేల వ్యవహారశైలి పార్టీకి ఇబ్బందికరంగా మారిందనే విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పేరు పలు సందర్భాల్లో చర్చకు వచ్చింది. ఆయనకు సంబంధించి పార్టీ కార్యకర్తల నుంచి అసంతృప్తి వ్యక్తమైన సందర్భాలు కూడా ఉన్నాయి. 2025లో తిరువూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ కార్యకర్తలు పార్టీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి.ఈ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ కొలికపూడికి పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించినట్లు 2026 ఫిబ్రవరిలో వార్తలు వెలువడ్డాయి. అనంతరం తిరువూరు రాజకీయాల్లో విభేదాలను తగ్గించే ప్రయత్నాలు జరిగినట్లు కూడా సమాచారం వచ్చింది. 2026 మార్చిలో కొలికపూడి, ఎంపీ కేశినేని శివనాథ్ మధ్య నెలకొన్న వివాదానికి పరిష్కారం దిశగా చర్చలు జరిగినట్లు మరో కథనం పేర్కొంది.ఇటీవల కొలికపూడి నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారిస్తున్నట్లు కనిపిస్తోంది. సెప్టెంబర్ 19న తిరువూరు నియోజకవర్గంలోని అభివృద్ధి పనుల్లో పార్టీ కార్యకర్తలకు అవకాశం కల్పించేలా నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి.మరోవైపు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు వ్యవహారశైలిపై కూడా టీడీపీ వర్గాల్లో చర్చ జరుగుతోందనే ప్రచారం ఉంది. గతంలో ప్రభుత్వాన్ని, పార్టీ నిర్ణయాలను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. అయితే ఇటీవలి కాలంలో ఆయన బహిరంగ రాజకీయ వ్యాఖ్యలు తగ్గించుకున్నారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు విషయంలోనూ పార్టీ క్రమశిక్షణ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభకు ఆయన హాజరు కావడం, అక్కడి వ్యాఖ్యలు వివాదానికి దారితీయడంతో పార్టీ నుంచి వివరణ కోరినట్లు వార్తలు వచ్చాయి. అనంతరం బొండా ఉమా పార్టీ లైన్‌ను తాను ఉల్లంఘించలేదని పార్టీ కమిటీ ముందు వివరణ ఇచ్చినట్లు సమాచారం.ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ విషయంలోనూ ఇదే తరహా చర్చ వినిపిస్తోంది. మొత్తంగా చూస్తే, గతంలో తరచూ బహిరంగ వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచిన కొందరు నేతలు ప్రస్తుతం పార్టీ వ్యవహారాల్లో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది. అయితే ఈ మార్పుకు ఖచ్చితమైన కారణం ఇదేనని నిర్ధారించే అధికారిక ప్రకటన మాత్రం లేదు. పార్టీ క్రమశిక్షణ, నాయకత్వ సూచనలు, నియోజకవర్గ రాజకీయ సమీకరణాలు కలిసి ఈ మార్పుకు కారణమై ఉండవచ్చనే చర్చ మాత్రమే ప్రస్తుతం కొనసాగుతోంది.

# దానం గెలిస్తే... అమాత్యా గ్యారంటి



హైదరాబాద్, సెప్టెంబర్ 23,: ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేస్తూ ఇచ్చిన తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో నూతన సమీకరణాలకు తెరలేపింది. బి-ఫామ్‌పై ప్రత్యక్షంగా మరో పార్టీ తరఫున పోటీ చేయడమే ఆధారంగా హైకోర్టు డివిజన్ బెంచ్ చారిత్రాత్మక తీర్పు ఇవ్వడంతో, దానం పొలిటికల్ కెరీర్ ఒక కీలకమైన మలుపు వద్దకు వచ్చింది. తొలుత ఉపఎన్నికకు సిద్ధమని ప్రకటించినప్పటికీ, న్యాయ నిపుణుల సలహాతో దానం నాగేందర్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే, స్పష్టమైన దస్తావేజు ఆధారాలు ఉన్న ఈ కేసులో సుప్రీంకోర్టు నుండి తక్షణ స్టే దక్కడం సులువు కాదనేది చట్ట నిపుణుల అంచనా.న్యాయస్థానాల్లో సుదీర్ఘంగా సాగే ప్రక్రియ ద్వారా విచారణను ఆలస్యం చేయడం కంటే, దానం నాగేందర్ నేరుగా ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ఉపఎన్నికను ఎదుర్కొనడమే ఆయన రాజకీయ భవిష్యత్తుకు అత్యంత ప్రయోజనకరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ కేబినెట్‌లో గ్రేటర్ హైదరాబాద్ పరిధికి చెందిన బలమైన బిసి నాయకుడి ప్రాతినిధ్యం లేకపోవడం ఒక రాజకీయ లోటుగా ఉంది. దానం నాగేందర్ వంటి సీనియర్, బహుళ ప్రజాదరణ ఉన్న హైదరాబాద్ బిసి నేత మంత్రివర్గంలో ఉంటే గ్రేటర్ పరిధిలో పార్టీకి మరింత మైలేజ్ వస్తుందని కాంగ్రెస్ అధిష్టానం కూడా భావిస్తోంది.ఒకవేళ దానం నాగేందర్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఘన విజయం సాధిస్తే, ఆయన రాజకీయ ఇమేజ్ ఒక్కసారిగా మారిపోతుంది. పార్టీ ఫిరాయింపుల ముద్రను, చట్టపరమైన అనర్హత వేటును నియోజకవర్గ ప్రజల తీర్పు ద్వారా చెరిపేసుకున్నట్లు అవుతుంది. అసెంబ్లీలోకి అడుగుపెడితే, ఆయన రాజకీయ నైతికతకు తిరుగులేని బలం చేకూరుతుంది. అప్పుడు ఆయనకు గ్రేటర్ హైదరాబాద్ కోటాలో కేబినెట్ బెర్త్ కేటాయించడం సీఎం రేవంత్ రెడ్డికి కూడా సులభం, అనివార్యం కానుంది. ఖైరతాబాద్ నియోజకవర్గ క్షేత్రస్థాయి సమీకరణాలు కూడా దానంకు పూర్తి అనుకూలంగా ఉన్నాయి. దశాబ్దాలుగా ప్రతి బస్తీలో ఆయనకు ఉన్న సొంత అనుచరగణం, వ్యక్తిగత పట్టు కాదనలేని సత్యం. ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీ వద్ద దానం స్థాయిని తట్టుకుని నిలబడే లోకల్ ఫేస్ గానీ, బలమైన సంస్థాగత కేడర్ గానీ అందుబాటులో లేదు.రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ బలం, అభివృద్ధి సంక్షేమ పథకాలు తోడైతే ఉపఎన్నికలో గెలుపు నల్లేరుపై నడకేనని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. సుప్రీంకోర్టులో కేవలం విచారణల చుట్టూ కాలయాపన చేస్తూ ఉంటే.. నియోజకవర్గంలో అనుమానాలు, ప్రత్యర్థుల ప్రచారాలు ఎక్కువయ్యే ప్రమాదం ఉంది. దానికంటే కోర్టుల కంటే ప్రజా కోర్టు పెద్ది అనే నినాదంతో ఉపఎన్నికల బరిలోకి దిగి, స్పష్టమైన మెజారిటీ సాధించడమే దానం నాగేందర్ స్థానాన్ని, రాజకీయ ఆధిపత్యాన్ని పునరుద్ధరిస్తుంది. కోర్టుల్లో స్టేల కోసం పోరాడటం కంటే ప్రజాక్షేత్రంలో తాడోపేడో తేల్చుకో?మే దానం నాగేందర్‌ను ఖైరతాబాద్‌కే కాదు, ఏకంగా సెక్రటేరియట్‌లోని మంత్రి పీఠం వైపు నడిపించే వ్యూహాత్మక మార్గమని ఎక్కువ మంది సలహాలిస్తున్నారు.

# డ్రైనేజీ సమస్యపై స్పందించిన మున్సిపల్ కమిషనర్

**- గ్రీన్ రోడ్స్ కాలనీలో మురుగు కాలువ పరిశీలన**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 23 (విజన్ ఆంధ్ర) : వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు గ్రీన్ రోడ్స్ కాలనీ, సూర్యచంద్ర స్కూల్ రోడ్డు, అభి స్పోర్ట్స్ సమీపంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యపై మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించారు. సదరు ప్రాంతంలో మురుగు నీటి కాలువకు ప్రధాన డ్రైనేజీ చానల్‌తో సరైన కనెక్షన్ లేకపోవడంతో నీరు సక్రమంగా పారక కాలనీలోనే నిలిచిపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల తీవ్ర దుర్వాసన రావడంతో పాటు దోమల తాకిడి పెరిగి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని కుమార్ భేదడి ఫోన్ ద్వారా మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కుమార్ భేదడి విజ్ఞప్తిపై వెంటనే స్పందించిన మున్సిపల్ కమిషనర్, కాలనీకి చేరుకుని డ్రైనేజీ వ్యవస్థను స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మెయిన్ డ్రైనేజీ చానల్‌కు త్వరితగతిన కనెక్షన్ ఏర్పాటు చేసి, సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్ సాగర్, వెంకటేశ్వర్ గౌడ్, శ్రీనివాస రాజు, కిరణ్ కుమార్, కుమార్ భేదడి తదితరులు పాల్గొన్నారు.

# ల్యాండ్ పూలింగ్ అడుగులు



గుంటూరు, సెప్టెంబర్ 23, : ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని అమరావతి నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. రాజధాని విస్తరణ, మౌలిక వసతుల కల్పన కోసం నిర్వహిస్తున్న రెండో విడత భూసమీకరణ ప్రక్రియకు భూములిచ్చేందుకు రాజధాని ప్రాంత రైతులు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా వైకుంఠపురం గ్రామ పరిధిలోని మాదల కుటుంబం తమకు చెందిన 14.365 ఎకరాల భూమిని అమరావతి నిర్మాణం కోసం సీఆర్డీఏ కు అందజేసేందుకు అంగీకరించింది. రాజధాని నిర్మణంలో భాగస్వామ్యం కావడం పట్ల ఆ రైతు కుటుంబ సభ్యులు తీవ్ర ఆనందం వ్యక్తం చేశారు.రాయపూడిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మాదల శ్రీనివాసరావు కుటుంబసభ్యులు సీఆర్డీఏ అదనపు కమిషనర్ కొల్లాబత్తుల కార్తీక్‌కు అధికారిక అంగీకార పత్రాలను అందజేశారు. ఈ సమీకరణలో భాగంగా మాదల శ్రీనివాసరావు నుంచి 4.395 ఎకరాలు, మాదల అప్పారావు నుంచి 4.985 ఎకరాలు, అలాగే మాదల రాంబాబు నుంచి 4.985 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ బి. కన్యాకుమారి, ఇతర అధికారులు పాల్గొని రైతులకు ధన్యవాదాలు తెలిపారు.నవ్యాంధ్ర రాజధాని నగరం ప్రపంచస్థాయి ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న తరుణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ల్యాండ్ పూలింగ్‌కు భూములిచ్చిన మాదల కుటుంబ సభ్యులు కోరారు. రెండో విడత భూసమీకరణకు అమరావతి పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు, రైతులు పూర్తిస్థాయిలో సహకరించి రాజధాని అభివృద్ధికి తోడ్పడాలని వారు విజ్ఞప్తి చేశారు.

# దసరా, దీవాళికి స్పెషల్ ట్రైన్స్...



నెల్లూరు, సెప్టెంబర్ 23, : పండగలు వచ్చేస్తున్నాయ్.. వచ్చే నెలలో దసరా, దీపావళి రానున్నాయి. ఈ రెండు పండగల నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లేందుకు ప్లాన్ చేస్తున్నారా? అయితే, మీకో గుడ్ న్యూస్.. పండగ ప్రయాణికులకు భారత రైల్వే శుభవార్త చెప్పింది.పండగల సమయంలో రైళ్లపై పెరగనున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా 100 ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ స్పెషల్ ట్రైన్లు నవంబర్ వరకు వివిధ మార్గాల్లో నడవనున్నాయి. ఇప్పటికే కొన్ని రైళ్లకు బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ, అస్సాం, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలను కలుపుతూ ఈ ప్రత్యేక సర్వీసులను నడపనున్నారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల మీదుగా వెళ్లే పలు రైళ్లు ప్రయాణికులకు ఉపయోగపడనున్నాయి. చర్లపల్లి?నాగర్‌కోయిల్ (07535) ప్రత్యేక రైలు సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 23 వరకు ప్రతి శుక్రవారం నడుస్తుంది. నల్లగొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, చెన్నై ఎగ్మోర్, తిరుచిరాపల్లి తదితర స్టేషన్లలో ఆగుతుంది. అలాగే, చర్లపల్లి?శ్రీకాకుళం (07037) రైలు అక్టోబర్ 6 నుంచి నవంబర్ 24 వరకు, తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళం?చర్లపల్లి (07038) రైలు అక్టోబర్ 7 నుంచి నవంబర్ 25 వరకు సర్వీసులు అందించనున్నాయి. ఈ రైళ్లు నల్లగొండ, మిర్యాలగూడ, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, విజయనగరం తదితర స్టేషన్లలో ఆగుతాయి.మరోవైపు.. ప్రయాగ్‌రాజ్?తిరునెల్వేలి (04171) ప్రత్యేక రైలు కూడా తెలుగు రాష్ట్రాల మీదుగా నడుస్తుంది. ఈ సర్వీసు రామగుండం, వరంగల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు తదితర ప్రాంతాలను కలుపుతుంది

## దుర్గపు సుజాత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి పొన్నం

కరీంనగర్ : కరీంనగర్ జిల్లా కేశవపట్నం మండలం తాడికల్ గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు దుర్గపు సుజాత ఇటీవల మృతి చెందడంతో, తాడికల్ గ్రామంలోని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆమె నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దుర్గపు సుజాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం దుర్గపు సుజాత అందించిన సేవలను గుర్తు చేసుకోవడం జరిగింది. పార్టీ పట్ల వారికున్న అంకితభావం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం, గ్రామ అభివృద్ధి కోసం ఆమె చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని పేర్కొన్నారు. ఆమె కుమారుడు, కుమార్తె చదువుల వివరాలను అడిగి తెలుసుకోవడం జరిగింది. వారు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొనడం జరిగింది.

## కొత్త మిత్రుల కోసం

# జగన్ వ్యూహాలు



విజయవాడ, సెప్టెంబర్ 23, : 2024 ఎన్నికల ఓటమి తర్వాత ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యంత క్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి గతంలో లాగా ఒంటరి పోరాటం చేయడానికి ఇప్పుడు వెనుకడుగు వేస్తున్నారు. కూటమి భుత్వం అత్యంత బలంగా ఉండటం, క్షేత్రస్థాయిలో వైసీపీ కేడర్ చెల్లాచెదురు కావడం, వరుస కేసులు, అరెస్టులతో .. జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు ప్రత్యక్షంగా , పరోక్షంగా అదనపు బలాల కోసం ఆరాటపడుతున్నారు. తాము ఎవరితోనైనా కలిసి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని వైసీపీ ముఖ్య నేత సజ్జల రామకృష్ణారెడ్డి పదే పదే సంకేతాలు పంపుతున్నా.. అటువైపు నుండి సానుకూల స్పందన కరువైంది.జగన్మోహన్ రెడ్డి రాజకీయ వ్యూహాలు ఎప్పుడూ భిన్నంగా ఉంటాయి. ప్రస్తుతం ఆయన పరోక్ష రాజకీయంపైనే ఎక్కువ నమ్మకం పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. సోషల్ మీడియాలో వ్యవస్థలను, కూటమి నేతలను టార్గెట్ చేయడానికి జోసఫ్ రావణ్ వంటి వారిని భారీ బడ్జెట్‌తో రెడీ చేసుకుని, షాడో పాలిటిక్స్ నడుపుతున్నారు. కానీ, ప్రత్యక్షంగా తన ఓటు బ్యాంకుకు అదనపు ఓటు బ్యాంకును జోడించగల బలమైన పార్టీలను మాత్రం ఆయన దరిచేర్చుకోలేకపోతున్నారు. మరోవైపు జడ శ్రవణ్ కుమార్ వంటి నేతలు, దళిత ఓటు బ్యాంకును టార్గెట్ చేస్తూ జగన్ రాజకీయాలలోని లోపాలను ఎండగడుతున్నారు. ఇది వైసీపీకి కోలుకోలేని దెబ్బగా పరిణమించే అవకాశం ఉంది.ప్రస్తుత రాజకీయ సమీకరణాలలో జగన్మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీతో కలిసే అవకాశం ఏమాత్రం లేదు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ఉనికి నామమాత్రంగానే ఉన్నా, జాతీయ స్థాయిలో ఆ పార్టీతో వైసీపీ బంధం కుదరదు. పైగా, రాష్ట్రంలో పిసిసి అధ్యక్షురాలిగా ఉన్న తన సోదరి వైఎస్ షర్మిల తో ఉన్న తీవ్రమైన ఆస్తుల వివాదం, రాజకీయ వైరం కారణంగా జగన్ కాంగ్రెస్‌తో వెళ్లాలనుకున్నా వెళ్లలేరు. ఇక మిగిలిన ప్రధాన పార్టీలన్నీ కూటమిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో, కనీసం కమ్యూనిస్టు పార్టీలైనా వైసీపీతో కలిసి వస్తాయని జగన్ ఆశిస్తున్నారు. ఇందుకోసం లెఫ్ట్ పార్టీల నేతలతో వైసీపీ రాయబారాలు నడుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.కనీసం లెఫ్ట్ పార్టీలైనా వైసీపీతో కలిసి నడుస్తాయా? అనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న. కమ్యూనిస్టు పార్టీలు సిద్ధాంతపరంగా బీజేపీని తీవ్రంగా వ్యతిరేకిస్తాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పార్లమెంట్‌లో పదేళ్లపాటు పరోక్షంగా పూర్తి మద్దతు ఇచ్చిన వైసీపీతో కమ్యూనిస్టులు కలవడం అంత ఈజీ కాదు. పైగా, గత వైసీపీ హయాంలో అమరావతి రైతుల పోరాటం, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ, ఉద్యోగుల సమస్యలపై లెఫ్ట్ పార్టీలు వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాయి. ఇప్పుడు అకస్మాత్తుగా జగన్మోహన్ రెడ్డితో చేతులు కలిపితే.. ఆ పార్టీల విశ్వసనీయత దెబ్బతింటుందని కొందరు లెఫ్ట్ నేతలు భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వంపై ఉన్న ప్రజా వ్యతిరేకతను వాడుకోవడానికి సిద్ధాంతాలను పక్కనబెట్టి వైసీపీతో జతకడతారా? లేదా ఒంటరి గానే పోరాడతారా? అన్నది వేచి చూడాలి.నలుగురు మిత్రులు లేకుండా రాజకీయం చేయడం ఎంత కష్టమో జగన్మోహన్ రెడ్డికి ఇప్పుడు అర్థమవుతోంది. పరోక్ష వ్యూహాలు కొంతవరకు బజ్ క్రియేట్ చేయగలవు కానీ, ప్రత్యక్షంగా ఎన్నికలలో గెలవాలంటే బలమైన సామాజిక, రాజకీయ సమీకరణాలు అవసరం. ఒకవైపు తన ఓటు బ్యాంకును జడ శ్రవణ్ వంటి వారు టార్గెట్ చేస్తుంటే, మరోవైపు మిత్రపక్షాల కోసం సజ్జల రామకృష్ణారెడ్డి పంపుతున్న సందేహాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. కనీసం కమ్యూనిస్టులైనా వైసీపీతో కలవకపోతే.. రాబోయే రోజుల్లో వైసీపీ ఉనికి మరింత ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది.

# ఈడీ దూకుడు...



విజయవాడ, సెప్టెంబర్ 23, : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో దశాబ్దంలోనే అతిపెద్ద ఆర్థిక అక్రమంగా విచారణ ఎదుర్కొంటున్న రూ.3,200 కోట్ల లిక్కర్ స్కామ్ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అడుగులు సంచలనం రేపుతున్నాయి. కేవలం పైస్థాయి ప్రకటనలకే పరిమితం కాకుండా.. అక్రమ రవాణా, కమిషన్ల వసూలు, షెల్ కంపెనీల ద్వారా నిధుల మళ్లింపు వంటి ప్రతి చిన్న లావాదేవీని బయటకు తీస్తూ ఈడీ అధికారులు అరెస్టుల పర్వాన్ని ముమ్మరం చేశారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఆయన కుమారుడు సునీల్ కుమార్‌లతో పాటు ఐటీ మాజీ సలహాదారు రాజ్ కేసిరెడ్డిని అరెస్ట్ చేయడం, వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నేత అంబటి రాంబాబుకు ఈడీ సమన్లు జారీ చేయడం ఈ కేసు తీవ్రతకు అద్దం పడుతోంది.ఏపీ బీజేపీ అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ లిక్కర్ స్కామ్‌లోని అసలు సూత్రధారిని, బిగ్ హెడ్‌ను అరెస్ట్ చేయాల్సిందే అని డిమాండ్ చేస్తూ ప్రత్యక్షంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేరును ప్రస్తావించడం రాజకీయంగా కలకలాన్ని రేపింది. సిట్ చార్జ్‌షీట్లతో పాటు ఈడీ నమోదు చేసిన విచారణల్లోనూ మద్యం అమ్మకాలను ప్రభుత్వ నియంత్రణలోని డిజిటల్ పేమెంట్లు లేకుండా నగదు రూపంలోనే సాగించడం, నిర్దిష్ట బ్రాండ్లకే అనుకూలంగా విధానాలు మార్చడం వెనుక నాటి ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశాలు ఉన్నాయనేది విపక్షాల ప్రధాన ఆరోపణ.ఈడీ దర్యాప్తు సరళిని పరిశీలిస్తే.. ఏజెన్సీలు ఎప్పుడూ కిందిస్థాయి నుండి పైస్థాయికి వ్యూహాన్ని అనుసరిస్తాయి. ముందుగా కేటాయింపులు పొందిన డిస్టిలరీలు, రవాణా కాంట్రాక్టర్లు, వసూలు ఏజెంట్ల వద్ద నుంచి సేకరించిన రికార్డులు, వాట్సాప్ చాట్లు, గూగుల్ టేక్-అవుట్ డేటాను విశ్లేషించి మనీ ట్రయల్ ను నిర్ధారిస్తాయి. ఇప్పటికే జగన్ ముఖ్య కార్యదర్శి ధనంజయ్ రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి , మిథున్ రెడ్డి వంటి అత్యంత ఆప్తుల ఇళ్లలో ఈడీ సోదాలు నిర్వహించి కీలక పత్రాలు దక్కించుకోవడం ద్వారా, ఈ కేసు దారంతా చివరికి వైఎస్ జగన్ చుట్టూనే తిరిగేలా పావులు కదుపుతున్నారు. లిక్కర్ పాలసీ మార్పుల ద్వారా వచ్చిన రూ.1,048 కోట్లకు పైగా కిక్‌బ్యాక్‌ల నిధులు హవాలా మార్గాల్లో, షెల్ కంపెనీల ద్వారా ఎక్కడికి మళ్లాయనే సాంకేతిక ఆధారాలను ఈడీ సేకరిస్తోంది. ఢిల్లీ మద్యం కుంభకోణంలో కూడా సరిగ్గా ఇదే తరహాలోనే కిందిస్థాయి అధికారుల నుంచి మొదలై చివరికి నాటి ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ దాకా దర్యాప్తు ముడిపడి అరెస్టులకు దారితీసింది. ఇప్పుడు ఏపీలో కూడా ఈడీ అదే మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద బలమైన ఆధారాలు పొందుపరిస్తే, జగన్‌కు నోటీసులు జారీ చేయడం లేదా విచారణకు పిలవడం అనివార్యంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.మాజీ ముఖ్యమంత్రి స్థాయి నాయకుడిని నేరుగా అరెస్ట్ చేయడమనేది కేవలం ఆరోపణల ఆధారంగా సాధ్యపడదు. ఆయనకు నేరుగా లబ్ధి చేకూరినట్లు డైరెక్ట్ మనీ ఫ్లో సాక్ష్యాధారాలు కోర్టు ముందు నిలబడేలా ఈడీ చూపించాల్సి ఉంటుంది. ఒకవేళ కేవలం అధికారుల ప్రమేయం మాత్రమే తేలితే.. పొలిటికల్ మాస్టర్‌మైండ్‌గా ఆరోపణలు చేసినప్పటికీ, ప్రత్యక్ష చట్టపరమైన చర్యల నుంచి జగన్ తప్పించుకునే వెసులుబాటు కూడా ఉంటుందని న్యాయ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈడీ రికార్డు స్థాయి కస్టడీ విచారణలు చూస్తుంటే.. రాబోయే రోజుల్లో ఏపీ రాజకీయాల్లో ఈ లిక్కర్ స్కామ్ భూకంపం సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది. ఒకవేళ మనీ ట్రయల్ ఆధారాలు జగన్‌కు నేరుగా ముడిపడితే.. అది వైఎస్ఆర్‌సీపీ భవిష్యత్తుకే కాకుండా, రాష్ట్ర రాజకీయ సమీకరణాలకే అతిపెద్ద టర్నింగ్ పాయింట్‌గా మారే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# ఆత్మరక్షణలోకి బీఆర్ఎస్





హైదరాబాద్, సెప్టెంబర్ 23, : తెలంగాణ రాజకీయంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా తీవ్రమైన సామాజిక సమీకరణాల పోరుగా రూపాంతరం చెందుతోంది. కేసీఆర్ కుటుంబంపై కేవలం అవినీతి, భూదోపిడి అనే కోణంలోనే కాకుండా.. తెలంగాణలో దశాబ్దాల పాటు సాగిన గడీల పాలన , దొరల అరాచకాలు అనే సామాజిక భయాన్ని ప్రజల మనసుల్లో బలంగా నాటడానికి కాంగ్రెస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇటీవల కేసీఆర్ ను ఉద్దేశించి చేసిన తీవ్ర వ్యాఖ్యలు, ఆపై వచ్చిన విమర్శలు.. దానికి కౌంటర్ గా వెలమ సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుంటూ ఆయన చేసిన హెచ్చరికలు కొత్త రాజకీయానికి కారణంగా కనిపిస్తున్నాయి.తెలంగాణ చరిత్రను పరిశీలిస్తే బడుగు, బలహీన వర్గాలు గడీల ఆధిపత్యానికి వ్యతిరేకంగా సాగించిన పోరాటాలకు సుదీర్ఘమైన నేపథ్యం ఉంది. తెలంగాణ ఉద్యమం ద్వారా ఆ సామాజిక అసంతృప్తి తాత్కాలికంగా పక్కకు వెళ్లినప్పటికీ, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్ణయాధికారాలన్నీ ఒకే కుటుంబం, నిర్దిష్ట సామాజిక వర్గం చేతుల్లోనే కేంద్రీకృతమయ్యాయనే భావన బీసీ, దళిత వర్గాల్లో బలంగా నాటుకుపోయింది. ఇప్పుడు ఇదే చారిత్రక అసంతృప్తిని ఆసరాగా చేసుకుని, కేసీఆర్ కుటుంబాన్ని కేవలం ఒక రాజకీయ శత్రువుగానే కాక, బహుజన వర్గాల అవకాశాలను ఆక్రమించిన సామాజిక ప్రతినిధిగా చిత్రీకరించేందుకు రేవంత్ పక్కా ప్రణాళికతో వ్యవహరిస్తున్నారు.ఈ రాజకీయ క్రీడలో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మక సంకేతాలను పంపుతున్నారు. కేసీఆర్ కుటుంబం వద్ద ఉన్న ఆస్తులు, వారి సామాజిక వర్గం ఎంత ఉందో, వారు అనుభవిస్తున్న పదవులు ఎన్ని అనే అంశాలపై పరోక్షంగా, ప్రత్యక్షంగా సభల్లోను, సభల వెలుపల ప్రస్తావించడం ద్వారా ప్రజల్లో ఆలోచన రేకెత్తించే ప్రయత్నం చేస్తున్నారు. వెలమ దొరల పాలనలో నష్టపోయిన బహుజన బిడ్డలకు అధికారాన్ని అందించామనే నరేటివ్‌ను బలోపేతం చేయడం ద్వారా ప్రతిపక్ష బీఆర్ఎస్‌ను ఆత్మరక్షణలోకి నెట్టడమే రేవంత్ రెడ్డి మార్క్ రాజకీయ వ్యూహంగా కనిపిస్తోంది.శాసనసభ్యుడు వీర్లపల్లి శంకర్ లాంటి నేతలు మరింత దూకుడు ప్రదర్శిస్తున్నారు.కేసీఆర్‌ను ఉద్దేశించి చావు డప్పు కొడతాం అనడం, వెలమ సామాజిక వర్గాన్ని నేరుగా హెచ్చరిస్తూ పరుష పదజాలంతో విరుచుకుపడటం వెనుక.. బీఆర్ఎస్ కౌంటర్ దాడి చేస్తే దానిని దొరలు-బహుజనుల మధ్య ఘర్షణగా మలిచే ఆంతర్యం దాగి ఉందనేది కొట్టిపారేయలేము. తాండ్ర పాపారాయుడి పౌరుషం ప్రస్తావిస్తూ, సీఎం రేవంత్‌కి తెల్వకుండానే అంతు చూస్తాం అంటూ తొడగొట్టడం వెనుక కేవలం ఆవేశం మాత్రమే కాకుండా, వెలమ ఆధిపత్యాన్ని సవాల్ చేస్తున్నారనే భావనను దిగువ వర్గాల్లోకి బలంగా పంపాలనే ఆలోచన స్పష్టమవుతోంది.బిఆర్ఎస్ తన పది సంవత్సరాల పాలనలోని అభివృద్ధిని చూపి పుంజుకోవాలని చూస్తుంటే, కాంగ్రెస్ సర్కార్ మాత్రం కేసీఆర్ కుటుంబాన్ని పొలిటికల్‌గా మాత్రమే కాకుండా సోషియో-పొలిటికల్‌గా కార్నర్ చేయడానికి సిద్ధమైంది. సెంటిమెంట్లు, కుల సమీకరణాలు అత్యంత సున్నితంగా ఉండే తెలంగాణ రాజకీయాల్లో ఈ సామాజిక వర్గాల ' వ్యతిరేక ప్రచారం రాబోయే రోజుల్లో ఎంతటి విధ్వంసకర రాజకీయ పరిణామాలకు దారితీస్తుందో, ఎవరికి రాజకీయ లబ్ధి చేకూరుస్తుందో వేచి చూడాలి.

# హైదరాబాద్‌లో నీటి వృథాపై జలమండలి కఠిన చర్యలు

**- జూబ్లీహిల్స్‌లో ఐదుగురు వినియోగదారులకు జరిమానా**

హైదరాబాద్, సెప్టెంబర్ 23, : నగరంలో తాగునీటి వృథాను అరికట్టేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ కఠిన చర్యలకు ఉపక్రమించింది. సోమవారం జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన అధికారులు, తాగునీటిని వాహనాలు కడగడానికి, ఫ్లోర్‌లు శుభ్రం చేయడానికి వాడుతున్న ఐదుగురు వినియోగదారులకు జరిమానాలు విధించారు. ట్యాంకులు నిండి పొంగిపోతున్నా, నల్లాలు వదిలేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రారంభంలో అవగాహన కార్యక్రమాలు, హెచ్చరికలతో సరిపెట్టిన జలమండలి, మార్పు రాకపోవడంతో జరిమానాలను భారీగా పెంచింది. నిబంధనల ఉల్లంఘన తీవ్రతను బట్టి రూ.1,000 నుంచి రూ.5,000, రూ.10,000, గరిష్ఠంగా రూ.20,000 వరకు జరిమానాలు విధిస్తున్నారు. పదేపదే నీటిని వృథా చేసేవారి నల్లా కనెక్షన్లను శాశ్వతంగా తొలగిస్తామని స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం జూబ్లీహిల్స్‌లోని రోడ్ నెం. 23లో ఫ్లోర్ క్లీనింగ్‌కు తాగునీరు వాడుతున్న పూర్ణిమ అనే వినియోగదారురాలికి రూ.20,000 జరిమానా విధించడం గమనార్హం.ఈ తనిఖీలను నగరం అంతటా విస్తరిస్తున్నారు. సోమవారం సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని ఎస్కే నగర్‌లో అక్రమంగా మోటార్ వాడుతున్నందుకు ఒకరికి రూ.5,000, అల్కాపురి యాదవ్ నగర్‌లో తాగునీటితో ఫ్లోర్ కడుగుతున్నందుకు మరొకరికి రూ.1,000 ఫైన్ వేశారు.నగరంలో పెరుగుతున్న నీటి డిమాండ్, ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, మంజీరా-సింగూరు జలాశయాల్లో నీటి మట్టాలు తగ్గడం వల్లే ఈ కఠిన చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.




"ఈరోజు మనం వృథా చేసే ప్రతీ నీటి చుక్క, రేపు మరొకరి దాహార్తిని తీర్చగలదు" అని బోర్డు పేర్కొంది.అదే సమయంలో తమ సిబ్బందికి కూడా జలమండలి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. నగరంలోని 15,000 కిలోమీటర్ల పైప్‌లైన్లలో ఎక్కడైనా లీకేజీ ఫిర్యాదు వస్తే 24 గంటల్లోగా శాశ్వత పరిష్కారం చూపాలని, తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకునే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించింది. నీటి దుర్వినియోగంపై ప్రజలు 99499 30003 అనే వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని బోర్డు సూచించింది. నీటి సంరక్షణ అనేది వినియోగదారులు, జలమండలి ఉమ్మడి బాధ్యత అని పేర్కొంది.

# నర్సింగ్ విద్యార్థిని అనుమానాస్పద మృతి



భద్రాద్రి కొత్తగూడెం : ఖమ్మంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో నర్సింగ్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం వెంగన్నపాలెం గ్రామానికి చెందిన హరిణి (18) అనే యువతి అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. ఇంటి ఆవరణలోని బాత్రూమ్ వెనుక మృతదేహం లభించింది. పక్కింటి వ్యక్తి దారుణానికి పాల్పడ్డాడని మృతురాలి తల్లి ఆరోపణ. తండ్రి మరణించడంతో కూలి పనులు చేసి ఇద్దరు కూతుళ్లను తల్లి రాజేశ్వరి చదివిస్తోంది. సెలవుల నేపథ్యంలో హరిణి ఇటీవలే ఇంటికి వచ్చింది. అదే గ్రామంలోని చుట్టాల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చేసరికి హరిణి కనిపించడంలేదని తల్లి వెతికింది. ఈ నేపథ్యంలో ఒంటిపై గాయాలతో, బాత్రూమ్ వెనుక హరిణి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గౌతమ్ నగర్ గణేష్ పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



మల్కాజిగిరి, సెప్టెంబర్ 23,(విజన్ ఆంధ్ర): వినాయ కుడి ఆశీస్సులు ప్రజలు అందరిపై ఉండాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. వినాయక చవితి సందర్భంగా గౌతమ్ నగర్ లో టాలెంట్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని ఆయన దర్శించుకున్నారు. ప్రత్యేక పూజకు హాజరైన ఆయనను మండప నిర్వాహకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వా హకులు మోహన రాజు, బోనగిరి పాండు, క్యాటరింగ్ శ్రీనివాస్, క్రాంతి, మానస నాగేందర్ , పెరిక శ్రీధర్ , బంటి నాయుడు శీనా నాయక్, శేఖర్, మణి, సచిత్, చింటూ , తంబాది నరేంద్ర,మాజీ కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్, బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, పిట్టల శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు వైనాల ప్రవీణ్, రామచందర్, కన్నె మల్ల నాగరాజు, ఫరీద్, రాందాస్ సంతోష్ ముది రాజ్, ఇస్తారి,సిరిగిరి రాజు, చుంకు శ్రీనివాస్, వెంకన్న, పార్ధసారథి, నరేష్ తదితరులు పాల్గొన్నారు


# రైతు సంక్షేమమే లక్ష్యం..

### - చౌటపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా అత్తి కుమారస్వామి బాధ్యతలు!



వరంగల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23(విజన్ ఆంధ్ర); వరంగల్ జిల్లా కేంద్రంలోని పర్వతగిరి మండలంలోని చౌటపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) నూతన చైర్మన్‌గా అత్తి కుమారస్వామి, పాలకవర్గ సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. సొసైటీ సీఈవో కె. ప్రదీప్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ అత్తి కుమారస్వామి మాట్లాడుతూ.. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. రైతులకు అవసరమైన యూరియా, రుణాలు, సబ్సిడీ విత్తనాలు తదితర వ్యవసాయ అవసరాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.పీఏసీఎస్ ద్వారా రైతులకు అందించే సేవలను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. రైతుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి సంబంధిత సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంబటి అడ్డంగా బుక్కైనట్టేనా



గుంటూరు, సెప్టెంబర్ 23, : లిక్కర్ స్కామ్‌లో ఈడీ నోటీసులు ఇస్తే 90 ఎంఎల్ డైలాగులు చెప్పిన అంబటి రాంబాబుకు అసలు నిజం తెలుసు. లిక్కర్ స్కామ్ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీ చేయడంతో ఆయన గారికి అసలు భయం పట్టుకుంది. తొలుత ఈడీ నోటీసులే రాలేదని, తనకేమీ తెలియనట్లు అమాయకపు నటన ప్రదర్శించిన అంబటి.. తీరా విషయం ముదిరి పాకాన పడటంతో నాకేం భయం లేదు.. ఆరోగ్యం కుదుటపడ్డాక విచారణకు వెళ్తా అంటూ కొత్త కవరింగ్ కథనాలు మొదలుపెట్టారు. ఎందుకంటే ఆయన దందాపై పూర్తి సాక్ష్యాలు ఈడీ వద్ద ఉన్నాయి.అంబటి రాంబాబు ఎంత నాటకమాడినా మద్యం కుంభకోణంలో ఆయన పాత్రను దర్యాప్తు సంస్థలు పక్కా ఆధారాలతో పట్టుకున్నాయనేది బహిరంగ రహస్యంగా మారింది. అంబటి రాంబాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీ చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో భారీ ఎత్తున సాగిన మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి ఈడీ ఈ నోటీసులు జారీ చేసింది. మద్యం విధానంలో జరిగిన అవకతవకలు, నిధుల మళ్లింపు, మనీలాండరింగ్ కోణాల్లో దర్యాప్తును వేగవంతం చేసిన కేంద్ర దర్యాప్తు సంస్థ.. తమ ఎదుట విచారణకు హాజరుకావాల్సిందిగా ఆయనను ఆదేశించింది.ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం రవాణా, విక్రయాల ప్రక్రియలో అంబటి రాంబాబు పాత్రపై ఈడీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. మద్యం అక్రమ రవాణాకు సంబంధించిన సబ్ కాంట్రాక్టులను నిబంధనలకు విరుద్ధంగా అంబటి బినామీ సంస్థలకు కట్టబెట్టారనే అభియోగాలు దర్యాప్తులో తెరపైకి వచ్చాయి. మద్యం సిండికేట్ల నుంచి ముడుపులు ఎలా మళ్లాయి, వాటి వెనుక ఉన్న బినామీ నెట్‌వర్క్, డొల్ల కంపెనీల ఆర్థిక లావాదేవీలపై అధికారులు లోతైన ఆధారాలు సేకరించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే పీఎంఎల్‌ఏ చట్టం కింద అంబటికి నోటీసులు జారీ చేసి సమగ్ర వివరణ కోరింది.ఈ నోటీసుల వ్యవహారాన్ని అంబటి దాచి పెట్టే ప్రయత్నం చేశారు. రెండు వారాలుగా అనారోగ్య కారణాలతో తాను హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నానని, ఈ క్రమంలోనే ఈడీ అధికారులు ఫోన్ చేసి ఈనెల 11నే నోటీసులు పంపినట్లు చెప్పారని ఆయన పేర్కొన్నారు. అయితే నోటీసులు చేతికి రాకపోవడం వల్లే విచారణకు రాలేకపోయానని, ఏ కేసులో నోటీసులు ఇచ్చారనేది పత్రాలు చూస్తే తప్ప స్పష్టత రాదని అధికారులకు తెలిపినట్లు సమాచారం. మరోవైపు, ఈవారంలోనే హైదరాబాద్ , విజయవాడలోని ఈడీ కార్యాలయంలో ఆయన విచారణకు హాజరయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఏపీ లిక్కర్ స్కామ్‌పై ఓవైపు రాష్ట్ర సిట్ , మరోవైపు ఈడీ దర్యాప్తును ముమ్మరం చేస్తుండటంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఈ కేసులో పలువురు కీలక వ్యక్తులు, ప్రజాప్రతినిధులు దర్యాప్తు సంస్థల విచారణను ఎదుర్కొంటున్నారు. కారుమూరి, ఆయన కుమారుడు జైలు పాలయ్యారు. అంబటి తనకేమీ సంబంధం లేదని బుకాయించే ప్రయత్నం చేసినా.. ఆధారాల్లేకుండా ఈడీ నోటీసులు ఇచ్చే అవకాశం ఉండదు.జగన్ హయాంలో ప్రభుత్వం అధికారంలోకి రాగానే తన బినామీలుగా ప్రచారంలో ఉన్న సుబ్బారెడ్డి, పురుషోత్తం అనే వ్యక్తులను రంగంలోకి దించిన అంబటి.. వారికి మద్యం సరఫరా, డిస్ట్రిబ్యూషన్ కాంట్రాక్టులు కట్టబెట్టారని విచారణలో తేలినట్లు సమాచారం. ఆ కాంట్రాక్టర్ల వద్ద నుంచి భారీ ఎత్తున కమిషన్లు, నిధులు దండుకున్న వైనంపై సిట్, ఈడీలకు సదరు బినామీలే స్వయంగా పూసగుచ్చినట్లు వివరాలు ఇచ్చేశారని, డబ్బులు ఎలా మార్పిడి జరిగాయో ఆధారాలతో సహా అప్పగించారని ప్రచారం జరుగుతోంది.అంబటి గారు అడ్డంగా దొరికిపోవడంతోనే ఇప్పుడు అసలైన వణుకు మొదలైంది. ఇప్పటికే నేతలు కారుమూరి నాగేశ్వరరావు లాంటి వారు జైలు బాట పట్టిన దృశ్యాలు కళ్లముందు కదులుతుండటంతో, ఎక్కడ ఈడీ అధికారులు తనను కూడా నేరుగా అదుపులోకి తీసుకుని రిమాండ్ కార్డ్ ఇస్తారోనని ఆయన భయాందోళనకు గురవుతున్నారు. సాధారణ పోలీసు కేసుల్లా కాకుండా, ఈడీ చట్టం కింద అరెస్ట్ అయితే అంత సులువుగా బెయిల్ రాదని, ఎంతటి వారికైనా కటకటాలు తప్పవని తెలిసి ఆయన నిద్రలేని రాత్రులు గడుపుతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.టివి ఛానళ్లలో ఎదుటివారిపై పంచ్‌లు వేస్తూ, వెటకారాలతో కాలక్షేపం చేసిన అంబటి రాంబాబుకు.. ఇప్పుడు తన సొంత బినామీలే ఇచ్చిన వాంగ్మూలాలు పెద్ద ఉచ్చుగా మారాయి. మైకుల ముందు నాకేం భయం లేదు అని ఎంత గంభీరంగా నటించినా, లోలోపల మాత్రం ఈడీ అరెస్ట్ వారెంట్ ఎప్పుడు తలుపు తడుతుందోనని బెదిరిపోతున్నారనేది స్పష్టమవుతోంది. గతంలో నడిపిన లీలలు ఒక్కొక్కటిగా బయటపడుతుంటే, ఈడీ విచారణ నుంచి తప్పించుకోవడానికి ఆరోగ్యం సాకుగా చూపే కవరింగ్ డ్రామాలు ఇకపై చెల్లకపోవచ్చు.

# వాజ్‌పేయి నగర్‌లో రోడ్లకు గ్రహణం..!

- అభివృద్ధి పనుల పేరుతో తవ్వేసిన రహదారులు.. నెలలు గడిచినా పునరుద్ధరణ ఏదీ.?
- వెలగని వీధి దీపాలు.. చీకట్లోనే కాలనీవాసుల రాకపోకలు
- గుంతల్లో వర్షపు నీరు.. వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులకు తప్పని తిప్పలు
- దొంగల భయంతో బిక్కుబిక్కుమంటున్నామని స్థానికుల ఆవేదన



కుత్బుల్లాపూర్, సెప్టెంబరు 23 (విజన్ ఆంధ్ర): వాజ్‌పేయి నగర్‌లో రోడ్లు, వీధి దీపాల సమస్యలు కాలనీవాసులకు కష్టాలు తెచ్చిపెడుతున్నాయి. అభివృద్ధి పనుల పేరుతో పలు చోట్ల రహదారులను తవ్వినప్పటికీ.. నెలలు గడుస్తున్నా వాటిని పూర్తిస్థాయిలో పునరుద్ధరించకపోవడంతో గుంతలు, ఎగుడుదిగుడు మార్గాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు పనిచేయక రాత్రివేళ చీకట్లు అలుముకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**తవ్విన రోడ్లతో రాకపోకలకు అవస్థలు**

రోడ్లపై ఏర్పడిన గుంతలు, అసమతల మార్గాలతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇళ్ల ముందు మెట్లు, రాకపోకల దారులు దెబ్బతినడంతో వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులు బయటకు రావాలన్నా ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. వర్షం కురిసిన సమయంలో పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోందని అంటున్నారు.

**అత్యవసర వాహనాల రాకపోకలపై ఆందోళన**

కాలనీలో రహదారుల పరిస్థితి ఇలాగే కొనసాగితే అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు రాకపోకలు సాగించడం కష్టంగా మారుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనారోగ్యంతో ఉన్నవారిని ఆసుపత్రికి తరలించే సమయంలో రోడ్ల పరిస్థితి ఆటంకంగా మారకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**వీధి దీపాలు లేక.. రాత్రివేళ చీకటే!**

వాజ్‌పేయి నగర్‌లోని కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు పనిచేయకపోవడంతో రాత్రివేళ చీకట్లు అలుముకుంటున్నాయని కాలనీవాసులు చెబుతున్నారు. దీంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడటంతో పాటు భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోందని పేర్కొంటున్నారు. పనిచేయని దీపాలను మరమ్మతు చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త దీపాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**గుంతల్లో వర్షపు నీరు.. దోమల బెడద**

ఇటీవల కురుస్తున్న వర్షాలతో రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచిపోతోందని స్థానికులు తెలిపారు. దీంతో రాకపోకలకు మరింత అంతరాయం కలుగుతోందని, నిల్వ నీటితో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లను పునరుద్ధరించి నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

### మరో వారం రోజుల్లో రోడ్ల పనులు

#### - డీసీ శంకర్ సింగ్



వాజ్‌పేయి నగర్‌లో రోడ్లు, వీధి దీపాల సమస్యలపై 'విజన్ ఆంధ్ర' ప్రతినిధి జీడిమెట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శంకర్ సింగ్‌ను సంప్రదించి వివరణ కోరగా ఆయన స్పందించారు. ఒక కాలనీ తర్వాత మరో కాలనీలో రోడ్ల నిర్మాణ పనులు చేపడుతూ వస్తున్నామని తెలిపారు. మరో వారం రోజుల్లో వాజ్‌పేయి నగర్‌లో రోడ్ల నిర్మాణ పనులు చేపట్టి పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. అదేవిదంగా వాజ్‌పేయి నగర్‌లో ఇప్పటికే కొన్ని స్ట్రీట్ లైట్లను మరమ్మతు చేశామని తెలిపారు. రేపు, ఎల్లుండిలోపు మిగిలిన దీపాల ఏర్పాటు, మరమ్మతు పనులు చేపడతామని పేర్కొన్నారు. జీడిమెట్ల సర్కిల్ పరిధిలో వీధి దీపాల నిర్వహణకు ప్రస్తుతం ఇద్దరు లైన్‌మెన్లు మాత్రమే అందుబాటులో ఉన్నారని, సర్కిల్ మొత్తం వారే పర్యవేక్షించాల్సి రావడంతో కొంత ఆలస్యం జరుగుతోందని వివరించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టి పూర్తిచేస్తామని తెలిపారు.

# 13 ఏళ్ల నిరీక్షణకు తెర..

- జగ్గారెడ్డి కృషితో భూములు కోల్పోయిన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ
- తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం వెలువడ్డ మొట్టమొదటి జి వో..
- ఇళ్ల స్థలాల పంపిణీ పై గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుండి కొనసాగుతున్న నిషేధం
- తొగర్‌పల్లిలో 93 మంది లబ్ధిదారులకు 125 గజాల చొప్పున ఇంటి పట్టాలు పంపిణీ చేసిన నిర్మలా జగ్గారెడ్డి







కొండాపూర్, సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర) : ఏళ్ల తరబడి సొంతింటి స్థలం కోసం ఎదురుచూస్తున్న పేదల నిరీక్షణకు తెరపడింది. తొగర్‌పల్లి, అలియాబాద్ గ్రామాలకు చెందిన భూములు కోల్పోయిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తొగర్‌పల్లి సర్వే నంబర్ 418లో మొత్తం 93 మంది లబ్ధిదారులకు 125 గజాల చొప్పున స్థలాలను కేటాయిస్తూ పట్టాలు అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గతంలో ఇళ్ల స్థలాల కోసం పట్టాలు పొందినప్పటికీ, తదనంతర పరిణామాలతో లబ్ధిదారులకు స్థలాల పొజిషన్ అందకపోవడంతో సమస్య కొనసాగుతూ వచ్చింది. దీంతో తమకు కేటాయించిన స్థలాలను చూపించి, సొంతింటి కలను సాకారం చేయాలని లబ్ధిదారులు పలుమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతూ వచ్చారు.

***2011లో కేటాయింపులు.. ఆ తర్వాత నిలిచిన ప్రక్రియ***

తొగర్‌పల్లి, అలియాబాద్ ప్రాంతాల్లో భూములు కోల్పోయిన కుటుంబాలకు గతంలో ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ చేపట్టారు. అయితే ప్రభుత్వం మారిన అనంతరం గతంలో జరిగిన కేటాయింపులు అమలులోకి రాకపోవడంతో లబ్ధిదారులు స్థలాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. ఈ సమస్యపై మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పలుమార్లు అసెంబ్లీలో ప్రస్తావించారు.

***మంత్రి పొంగులేటిని కలిసిన జగ్గారెడ్డి***

ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి గత సంవత్సరం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. అనంతరం మంత్రి అప్పటి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతికి ఫోన్ చేసి, లబ్ధిదారులకు పొజిషన్ చూపించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.



***నిర్మలా జగ్గారెడ్డి చేతుల మీదుగా పట్టాల పంపిణీ***

తొగర్‌పల్లి సర్వే నంబర్ 418లో లబ్ధిదారులకు నిర్మలా జగ్గారెడ్డి చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, కొండాపూర్ తహసీల్దార్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పిఠాపురంలో పవన్ మార్క్

కాకినాడ సెప్టెంబర్ 23, : డిప్యూటీ సీఎం క్యాంపు ఆఫీసును పిఠాపురానికి మార్చాలని పవన్ కళ్యాణ్ నిర్ణయించుకున్నారు తన వద్దకు సమస్యల పరిష్కారం కోసం వస్తున్న ప్రజల అర్జీలను స్వీకరించడానికి, స్థానిక సమస్యలను నేరుగా పర్యవేక్షించడానికి ఏర్పాటు చేసిన పార్టీ కమిటీ పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మరింత అందుబాటులో ఉండేందుకు డిప్యూటీ సీఎం క్యాంప్ ఆఫీస్‌నే పిఠాపురానికి తరలించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.తన పర్యటనల్లో అనేకమంది ప్రజలు వినతిపత్రాలు చేతుల్లో పట్టుకుని కిలోమీటర్ల మేర నిలబడుతుండటం తనను తీవ్రంగా ఆలోచింపజేసిందని పవన్ కళ్యాణ్ తెలిపారు. పిఠాపురం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు , వారి వినతులను స్వీకరించేందుకు జనసేన తరపున ఒక ప్రతినిధి కమిటీని నియమించినప్పటికీ, ఆ కమిటీ బాధ్యతాయుతంగా పనిచేయడం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించడంపై అసహనం వ్యక్తం చేసిన ఆయన, ఇకపై బాధ్యతలను నేరుగా తమ ప్రభుత్వ యంత్రాంగమే చూసుకుంటుందని స్పష్టం చేశారు.స్థానిక నాయకత్వం , కమిటీ పనితీరు సరిగా లేకపోవడంతో, తానే స్వయంగా ప్రజా సమస్యలను పర్యవేక్షించాలని నిర్ణయించుకున్నట్లు పవన్ పేర్కొన్నారు. అందులో భాగంగానే డిప్యూటీ సీఎం క్యాంప్ ఆఫీస్ సేవలను పిఠాపురానికి విస్తరించడం, ఇక్కడి నుంచే నిర్వహించేలా మార్పులు చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు తెలిపారు. పూర్తిస్థాయి క్యాంప్ ఆఫీస్ ఏర్పాటుకు మరో మూడు నుంచి నాలుగు నెలల సమయం పడుతుందని, ఆ తర్వాత స్థానిక పాలన, ప్రజా అర్జీల స్వీకరణ అంతా పిఠాపురం నుంచే జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.తనను గెలిపించిన పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పవన్ కళ్యాణ్ ప్రకటించారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా, నియోజకవర్గానికి అవసరమైన అభివృద్ధి పనులతో పాటు ప్రజల వ్యక్తిగత, సామాజిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు నిరంతరం అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ నిర్ణయంతో పిఠాపురం నియోజకవర్గం త్వరలోనే రాష్ట్ర రాజకీయాలకు , పాలనకు కేంద్రబిందువుగా మారనుంది.ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం శాసనసభ్యుడు పవన్ కళ్యాణ్ తన సొంత నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామం, మున్సిపాలిటీకి అవసరమైన మౌలిక వసతుల కల్పన, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ , ఆధునిక సదుపాయాల సమకూర్చే దిశగా దాదాపు రూ. 1,500 కోట్ల వ్యయంతో బహుళ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పిఠాపురం సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పాలనాపరమైన, ఆర్థికపరమైన సంస్కరణలను వేగవంతం చేస్తున్నారు.ప్రత్యేకించి నియోజకవర్గంలో భూగర్భ జలాల పునరుద్ధరణ, గ్రామీణ పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెరువుల సుందరీకరణకు పవన్ ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. ఫకృద్దీన్ పాలెంలో మైసమ్మ చెరువును రూ. 73 లక్షలతో సుందరీకరించి వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్క్, ఓపెన్ ఎయిర్ జిమ్ వంటి వసతులతో గ్రామ ప్రజలకు ఆహ్లాదకర కేంద్రంగా తీర్చిదిద్దారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ. 6 కోట్లకు పైగా వ్యయంతో 14 చెరువులను ఆధునీకరించి, గ్రామీణ ప్రాంతాలకు కొత్త శోభను తీసుకువస్తున్నారు.పట్టణ పర్యావరణం, ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచేందుకు జాతీయ రహదారికి సమీపంలో ఆరు ఎకరాల విస్తీర్ణంలో రూ.1.83 కోట్ల వ్యయంతో పీఠికాపుర వనం పట్టణ అటవీ ప్రాజెక్టును ఆవిష్కరించారు. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల ఏర్పాటు, పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రుల ఆధునీకరణ, మోడల్ అంగన్వాడీ కేంద్రాల నిర్వహణతో పాటు రోడ్లు, డ్రైనేజీ



సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపుతున్నారు. పిఠాపురం పుణ్యక్షేత్రమైనందున పర్యాటకాభివృద్ధికి సైతం పెద్దపీట వేస్తున్నారు.అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షించేందుకు , పరిపాలనా వేగాన్ని పెంచేందుకు పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కి స్వయంప్రతిపత్తి హోదాను కల్పించారు. కాకినాడ జిల్లా కలెక్టర్ నేతృత్వంలో పనిచేసే ఈ సంస్థ ద్వారా ప్రణాళికాబద్ధంగా మౌలిక వసతులు, ఆర్థిక వృద్ధి , ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా పనులు శరవేగంగా సాగుతున్నాయి. పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న ఈ చొరవలతో పిఠాపురం రూపురేఖలు వేగంగా మారుతున్నాయి.

# సాంకేతికతను మేళవిస్తేనే సాగులో లాభాలు

- కలెక్టర్ ఆదర్శ్ సురభి
- మారుతున్న వాతావరణానికి అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలు వేయాలి
- వనపర్తిలో ఘనంగా 'కిసాన్ మేళా - 2026'
- వచ్చే ఏడాది జిల్లాలోనే పామాయిల్ క్రషింగ్ పరిశ్రమ ప్రారంభం



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 23(విజన్ ఆంధ్ర) : రోజురోజుకూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు కొంగొత్త ఆలోచనలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మేళవించి వ్యవసాయం చేసినప్పుడే ఆశించిన లాభాలు సాధించవచ్చని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని పద్మావతి శ్రీనివాస గార్డెన్‌లో నిర్వహించిన 'కిసాన్ మేళా – 2026' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

### ఆకట్టుకున్న ప్రదర్శన స్టాళ్లు

కిసాన్ మేళాలో వివిధ కంపెనీలు, శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ పరిశీలించారు. మేలురకం విత్తనాలు, సోలార్ ఫెన్సింగ్, రసాయన ఎరువులు, కోళ్లు, పొట్టేళ్లు, గిరి జాతి ఆవులు, సమీకృత ఉద్యాన, పట్టు పరిశ్రమ, పామాయిల్ సాగు, కిసాన్ క్రెడిట్ కార్డులు, ఆధునిక యంత్రాలు, పరికరాల ప్రదర్శనలను ఆయన తిలకించి, వాటి నాణ్యతను తనిఖీ చేశారు. వేల సంఖ్యలో రైతులు హాజరయ్యేలా మేళాను విజయవంతంగా నిర్వహించిన అధికారులను అభినందించారు.




### తగ్గిన వర్షపాతం.. ప్రత్యామ్నాయాలే శరణ్యం

ప్రస్తుత సంవత్సరంలో ఎల్ నీనో ప్రభావం వల్ల వర్షపాతం భారీగా తగ్గిందని కలెక్టర్ తెలిపారు. గతేడాది ఈ సమయానికి 100 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, ఈ ఏడు కేవలం 42 సెంటీమీటర్లు మాత్రమే నమోదైందన్నారు. సాగునీటి కొరత నేపథ్యంలో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని అధికారులవారీగా విస్తృత అవగాహన కల్పించామన్నారు. పర్యవసానంగా గతేడాది వానాకాలంలో 2.25 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, ఈసారి అది 1.70 లక్షల ఎకరాలకు తగ్గిందన్నారు. ఇదే సమయంలో మినుము సాగు 30,000 ఎకరాలకు ఎగబాకడం అభినందనీయమన్నారు.

### పామాయిల్‌తో 30 ఏళ్ల పాటు ఆదాయం

పామాయిల్ పంట ద్వారా దీర్ఘకాలిక లాభాలు ఉంటాయని, కేవలం మొదటి మూడేళ్లు అంతర పంటలు వేసుకుంటూ తోటను కాపాడుకుంటే, ఆ తర్వాత 30 ఏళ్ల పాటు స్థిరమైన ఆదాయం పొందవచ్చని కలెక్టర్ వివరించారు. వచ్చే ఏడాది వనపర్తి జిల్లాలోనే 'యూనిక్ పామ్ ఆయిల్ కంపెనీ' ప్రారంభమవుతుందని, ఇక్కడే క్రషింగ్ చేసి నూనె తీయడం వల్ల రైతులకు రవాణా ఖర్చులు తగ్గి మరింత మేలు జరుగుతుందన్నారు.

### భూసారాన్ని కాపాడుకోవాలి

ప్రస్తుతం వరి పండిస్తున్న భూముల్లో ఎకరానికి 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తున్నప్పటికీ, రసాయనాల మితిమీరిన వాడకంతో భూమి సారం కోల్పోతోందని కలెక్టర్ హెచ్చరించారు.



ఇలాగే కొనసాగితే రాబోయే తరాలకు ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి రావడం కూడా కష్టమవుతుందన్నారు. భావి తరాల కోసం సారవంతమైన నేలలను



అందించాల్సిన బాధ్యత రైతులపై ఉందన్నారు. ప్రతి మంగళవారం రైతు వేదికల్లో నిర్వహించే 'రైతు నేస్తం' కార్యక్రమానికి హాజరై శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని కోరారు.

### యాసంగిలో వరి వద్దు: జేడీఏ ఆంజనేయులు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయులు మాట్లాడుతూ.. రైతులకు నూతన సాగు పద్ధతులు, ఆధునిక యంత్రాలను పరిచయం చేయడమే ఈ మేళా ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఎల్ నీనో ప్రభావంతో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రాబోయే యాసంగిలో రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ ఆరుతడి పంటల వైపు మళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ మధుసూదన్ గౌడ్, కేవీకే ప్రతినిధులు రాజేందర్ రెడ్డి, సాయిచరణ్ రెడ్డి, మాజీ సర్పంచ్ సురేష్ చంద్రారెడ్డి తదితరులు పాల్గొని ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, లాభసాటి సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.

## సమతుల్య ఆహారంతో ఆరోగ్యవంతమైన సమాజం.

- సర్పంచ్ తొర్రి పద్మ కుమార్ యాదవ్

పోషణ మాసం పై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్



వరంగల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23(విజన్ ఆంధ్ర); గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషక విలువలతో కూడిన సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం ద్వారానే రక్తహీనతను నివారించి, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక సర్పంచ్ తొర్రి పద్మ కుమార్ యాదవ్, అంగన్వాడి టీచర్ అనిత అన్నారు. పోషణ మాసం ఉత్సవాల్లో భాగంగా పర్వతగిరి మండలం ఏనుగల్లు గ్రామంలోని అంగన్వాడీ 3వ కేంద్రంలో బుధవారం పోషకాహార అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండ్లు, చిరుధాన్యాలు, మొలకెత్తిన గింజలు, గుడ్లు తదితర వాటితో ప్రత్యేక ఆహార ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఏయే ఆహార పదార్థాల్లో ఎలాంటి విటమిన్లు, పోషకాలు ఉంటాయో వివరించారు. పిల్లలు, గర్భిణీలు, బాలింతలు మంచి పోషక విలువలు ఉండే సమతుల ఆహారం ప్రతిరోజు తీసుకోవాలని, సమతుల ఆహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాల గురించి, పిల్లల ఎదుగుదల గురించి, వారి మేధో వికాసం గురించి వివరించారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరిశుభ్రత పాటించడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం ద్వారా అనేక రోగాలను దూరం పెట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, అంగన్వాడీ టీచర్లు వినోద, అరుణ గర్భిణీలు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ రిమ్స్ ఘటన ప్రభుత్వ హత్యే

- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



ఆదిలాబాద్, సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర): ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో షార్ట్ సర్క్యూట్, ఏసీ పేలుడు కారణంగా చిన్నారులు మృతి చెందడం కేవలం ప్రమాదం కాదని, అది ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగిన హత్యలే అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్రంగా విమర్శించారు. బుధవారం ఆమె రిమ్స్ ఆసుపత్రిలోని ఎస్ఎన్‌సీయూ (రాచీజఖ) వార్డును సందర్శించి, ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. దత్తత తీసుకున్న జిల్లాలో ఐదుగురు పసిపిల్లలు చనిపోతే ముఖ్యమంత్రికి వచ్చి పరామర్శించే తీరిక లేదా అని మండిపడ్డారు. ఫుట్‌బాల్ ఆడేందుకు, విదేశాల్లో తిరిగేందుకు ఉన్న సమయం బాధితులను పరామర్శించడానికి లేదా అని ప్రశ్నించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సైతం బాధ్యతారహితంగా వ్యవహరించారని, ఎక్స్‌కర్షన్‌కు వచ్చినట్లు వచ్చి వెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిమ్స్‌లో డాక్టర్లు, నర్సులు, శానిటేషన్ సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, కనీసం ఏసీల మెయింటెనెన్స్‌కు మెకానిక్‌లు కూడా లేరని ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. నెల రోజుల్లోగా ఆసుపత్రి పెండింగ్ బిల్లులు చెల్లించి, ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్లు వేయాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. లేనియెడల ఏజెన్సీ ప్రాంతాల ఆదివాసీలతో కలిసి ఆదిలాబాద్‌ను ఘెరావ్ చేస్తామని హెచ్చరించారు. ఈ ప్రాంతంలో వైద్య సేవలపై సమగ్ర అధ్యయనం చేసేందుకు పార్టీ తరపున ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు.

## చౌటపల్లి సొసైటీ డైరెక్టర్ కు గోపనపల్లి గ్రామస్తుల సన్మానం..



వరంగల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23(విజన్ ఆంధ్ర); వరంగల్ జిల్లాలోని పర్వతగిరి మండలంలోని గోపనపల్లి గ్రామానికి చెందిన బెల్లం కుమార స్వామి చౌటపల్లి సొసైటీ డైరెక్టర్గా ఎన్నికైనందుకు గ్రామస్తుల ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జన్ను నరసయ్య గోపనపల్లి గ్రామ సర్పంచ్ నాంపల్లి విజయ అశోక్ మరియు ఆలయ కమిటీ చైర్మన్ కారంగుల రాము గ్రామ పార్టీ అధ్యక్షులు మిట్టపల్లి నాగార్జున గ్రామస్తులు ఆకుల సతీష్ గొల్ల పెల్లి తిరుపతి తుపాకుల లింగయ్య గున్నమాల సూరయ్య నాంపల్లి దేశాలు ,బెల్లశీ బొశీద్యాలు బెల్లం సాత్విక్ సంద విజయ్ నాంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## శివార్ భూమిని గ్రామ నక్ష లోకి మార్చి హద్దులు చూపాలి.

- అదనపు కలెక్టర్ కు వినతి పత్రం అందజేత




సంగారెడ్డి డెస్క్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 23:– వెంకటాపూర్ గ్రామంలో గల సర్వే నెం 41,85,88,100 లలో గల భూమి, సర్వే నంబర్ ను గ్రామ రికార్డులను నుంచి తొలగించి ఎర్రవెల్లి గ్రామ రికార్డు, నక్ష లోకి మార్చారని శివార్ వెంకటాపూర్ గ్రామస్తులు అన్నారు. బుధవారం సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట శివార్ వెంకటాపూర్ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శివార్ వెంకటాపూర్ పరిధిలో సర్వే నెంబర్లు 41, 85, 88, 100 వ్యవసాయం చేసుకుంటున్నట్లు తెలిపారు. 2015–16 వరకు గ్రామ రికార్డుల్లో సదరు సర్వే నెంబర్లు ఉండే వని తెలిపారు. 2016–17 నుంచి శివార్ వెంకటాపూర్ గ్రామ రికార్డ్ నుంచి తొలగించి సదరు సర్వే నెంబర్లను ఎర్రవెల్లి గ్రామ పరిధిలోని 325 సర్వే నెంబర్ లో కలిపారని ఆరోపించారు. శివార్ వెంకటాపూర్ గ్రామ రికార్డునకు నక్షా పటం నకు సర్వే నెం 41,85,88,100 మార్చి సరిహద్దులను చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివార్ వెంకటాపూర్ గ్రామస్తులు యాదగిరి, విఠల్, పోచయ్య, కర్ణాకర్, రాములు, జహంగీర్, పర్వతాలు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ నెలాఖరుకల్లా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

- గత సమస్యలు పునరావృతం కావొద్దు
- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 23(విజన్ ఆంధ్ర) : జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి ధాన్యం కొనుగోళ్లను అక్టోబర్ నెలాఖరు నాటికి ప్రారంభించేలా అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్‌తో కలిసి పౌరసరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.

### కేంద్రాల ఇన్‌చార్జులకు శిక్షణ

గత సీజన్‌లో ఎదురైన సమస్యలు ఈసారి పునరావృతం కాకుండా పక్కా ప్రణాళికతో ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల




నిర్వాహకులు, ఇన్‌చార్జులకు రానున్న 10 నుంచి 15 రోజుల్లో మండలాల వారీగా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. గతంలో అవకతవకలకు పాల్పడిన కేంద్రాల వారికి ఈసారి బాధ్యతలు అప్పగించవద్దని స్పష్టం చేశారు. కేంద్రాల్లో తేమ, బరువు కొలిచే యంత్రాలు, గన్నీ బ్యాగులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలన్నారు. యంత్రాలు, తూకం పరికరాలను రానున్న 15 రోజుల్లోగా తనిఖీ చేసి ధ్రువీకరించాలని, హమాలీల కొరత లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొన్నారు.

### లారీలకు తప్పనిసరిగా జీపీఎస్

ధాన్యం రవాణాలో జాప్యం లేకుండా కాంట్రాక్టర్లు కనీసం 50 వాహనాలను అందుబాటులో ఉంచాలని, ఆ లారీలకు అక్టోబర్ 10వ తేదీలోగా తప్పనిసరిగా జీపీఎస్ పరికరాలు అమర్చాలని కలెక్టర్ ఆదేశించారు.

### 2.60 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ అంచనా

ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా సుమారు 2.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని, ఇందుకోసం 450 కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ధాన్యం నిల్వ సామర్థ్యంపై పౌరసరఫరాల శాఖ అధికారులు దృష్టి సారించాలన్నారు. ప్రస్తుతం అర్హత సాధించిన 42 మిల్లుల నుంచి బ్యాంక్ గ్యారంటీలు, అగ్రిమెంట్లను ఈ నెలాఖరులోగా తీసుకోవాలన్నారు. గోడౌన్లలో ప్రస్తుతం ఉన్న 80 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పాటు, అదనంగా అవసరమయ్యే స్థలాలను గుర్తించి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ట్యాబ్ ఎంట్రీలు, రైతుల వివరాల నమోదు వేగవంతంగా జరిగేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ రామ మహేశ్వర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయులు, పౌరసరఫరాల అధికారి ఆంజనేయులు, డిఎం హరీష్, డిటిఓ సురేష్, కార్మిక శాఖ అధికారి రవి, మార్కెటింగ్ అధికారి పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

## నిర్వహణ విద్యకు భవిష్యత్ దిశ

- పుస్తకాన్ని ఆవిష్కరించిన ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్ట రెడ్డి




హైదరాబాద్ సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర) : నిర్వహణ విద్య, సాంకేతికత, వికసిత్ భారత్2047 భవిష్యత్ దిశలను ప్రతిబింబించే వచ్చే ఇరవై ఏళ్ల నిర్వహణ విద్య, సాంకేతికత, వికసిత్ భారత్ 2047 పుస్తకాన్ని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్ట రెడ్డి ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని హైదరాబాద్‌కు చెందిన నిర్వహణ విద్యా నిపుణుడు, భారతీయ నిర్వహణ పాఠశాలల సంఘం కోశాధికారి ప్రొఫెసర్ పి. నారాయణ రెడ్డి రచించారు, వేగంగా మారుతున్న సామాజిక, ఆర్థిక, సాంకేతిక పరిస్థితులకు అనుగుణంగా నిర్వహణ విద్యలో బోధన, అభ్యసనం, నాయకత్వ విధానాల్లో మార్పులు అవసరమని పుస్తకంలో వివరించారు. విద్యార్థుల్లో దీర్ఘకాలిక నైపుణ్యాలు, నిరంతర అభ్యసన, సామర్థ్యాన్ని పెంపొందించి, భవిష్యత్ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేలా తీర్చిదిద్దాల్సిన అవసరాన్ని రచయిత వివరించారు. తెలంగాణలో నిర్వహణ విద్య పరిస్థితిపై సమగ్ర స్థితిగతుల నివేదికను ఉన్నత విద్యామండలికి అందించేందుకు భారతీయ నిర్వహణ పాఠశాలల సంఘం ప్రతినిధులు అంగీకరించారు. విమానయాన నిర్వహణతో పాటు వివిధ రంగాల్లో నిపుణుల సేవలు అందించడంతోపాటు, విద్యార్థులు, అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ నిర్వహణ పాఠశాలల సంఘం కోశాధికారి ప్రొఫెసర్ పి. నారాయణ రెడ్డి, కార్య నిర్వాహక సంచాలకుడు ప్రొఫెసర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ రిమ్స్ అగ్ని ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా...

- మంత్రి దామోదర రాజనరసింహ...



ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర ) : ఆదిలాబాద్ రిమ్స్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని నిర్ణయించినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ పరిహారాన్ని అందించనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారని తెలిపారు. అవసరమైతే చిన్నారులను హైదరాబాద్‌లోని కార్పొరేట్, ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు తరలించి మెరుగైన వైద్య చికిత్స అందించాలని మంత్రి అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. అదేవిధంగా రిమ్స్‌లో 150 పడకల సామర్థ్యంతో మాతా శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్) నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించనున్నట్లు మంత్రి ప్రకటించారని కలెక్టర్ తెలిపారు. అత్యాధునిక వైద్య సదుపాయాలతో ఎంసీహెచ్ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత వైద్యాధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు.

## మంత్రి దామోదర్ రాజనర్సింహ కృషితో ఎన్టీఆర్ స్పోర్ట్స్ స్టేడియంకు రూ.10 కోట్లు మంజూరు

- మున్సిపల్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి వెల్లడి



సంగారెడ్డి డెస్క్, సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర ) : జోగిపేట ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధికి రూ.10 కోట్లను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మంజూరు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించేందుకు జోగిపేటకు మరో కీలకమైన అభివృద్ధి ప్రాజెక్ట్ ఇది అని కొనియాడారు.క్రీడలను ప్రోత్సహించేందుకు మంత్రి ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. యువతను క్రీడారంగం వైపు మళ్లించేందుకు ఈక్రీడా కాంప్లెక్స్ నిధులు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. జోగిపేటలోని యువతను రానున్న రోజుల్లో అత్యున్నతమైన స్థానంలో రాణించేలా ప్రోత్సహించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. మంత్రి జోగిపేట అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. గత పది సంవత్సరాలుగా క్రీడలను ప్రోత్సహించలేదని గుర్తు చేశారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ కృషితో క్రీడకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఎంతో ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. జోగిపేట ఎన్టీఆర్ స్పోర్ట్స్ స్టేడియం రానున్న యువతరానికి ఎంతో దోహదం చేస్తాయని ఈసందర్భంగా పేర్కొన్నారు. జోగిపేటను అభివృద్ధి పథంలో దూసుకు వెళ్లే విధంగా కృషి చేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ కు అందోల్ జోగిపేట పట్టణ ప్రజల పక్షాన ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ప్రకటించారు.

# పెంచికల్‌పేట్ మండలంలో రోడ్డు ప్రమాదం బైక్ అదుపుతప్పి యువకుడు మృతి



పెంచికల్‌పేట్, సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని ఓ యువకుడు మృతి చెందాడు. మండలంలోని కల్వడశాలిగాం గ్రామాల మధ్య రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. ఎల్కపల్లి గ్రామానికి చెందిన నల్లగొండ శ్రావణ్ బైక్‌పై ప్రయాణిస్తుండగా ప్రమాదానికి గురైనట్లు స్థానికులు తెలిపారు. కల్వడశాలిగాం మధ్య మార్గంలో బైక్ అదుపుతప్పి బోల్తా పడినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో శ్రావణ్ తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. శ్రావణ్ మృతితో ఎల్కపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. యువకుడి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

## కార్-టీ సెల్ థెరపీతో లింఫోమా బాధితురాలికి కొత్త ఆశ



హైదరాబాద్, సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర): కీమోథెరపీ పూర్తయిన రెండు నెలల్లోనే లింఫోమా తిరగబెట్టిన 50 ఏళ్ల మహిళకు బంజారాహిల్స్ కేర్ హాస్పిటల్స్‌లో కార్–టీ సెల్ థెరపీ అందించారు. డిఫ్యూస్ లార్జ్ బీ–సెల్ లింఫోమాతో బాధపడుతున్న ఆమెకు డా.సాద్విక్ రఘురామ్ వై, డైరెక్టర్–మెడికల్ ఆంకాలజీ, హీమటో–ఆంకాలజీ నేతృత్వంలోని వైద్య బృందం చికిత్స అందించగా, ప్రస్తుతం సానుకూల స్పందన కనిపిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. రోగి రక్తంలోని టీ–కణాలను సేకరించి జన్యుపరంగా మార్పులు చేసి తిరిగి శరీరంలోకి ప్రవేశపెట్టారు. చికిత్స అనంతరం సైటోకైన్ రిలీజ్ సిండ్రోమ్, నాడీ సంబంధిత దుష్ప్రభావాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం స్థిరంగా ఉందని తెలిపారు. కేర్ హాస్పిటల్స్, బంజారాహిల్స్ జెడ్‌సీఓఓ అభినవ్ జోషి మాట్లాడుతూ క్లిష్టమైన క్యాన్సర్లకు అత్యాధునిక చికిత్సలను అందుబాటులోకి తీసుకురావడంలో ఇది కీలక ముందడుగని పేర్కొన్నారు.

## గన్నారం గిరిజన బాలికలకు 10 సీట్ల భర్తీకి కౌన్సెలింగ్




కాగజ్‌నగర్, సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర): కాగజ్‌నగర్ మండలం గన్నారం తెలంగాణ గిరిజన సంక్షేమ అప్‌గ్రేడెడ్ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 24న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రమ్యకృష్ణ తెలిపారు. కళాశాలలో ఎంపీసీ విభాగంలో 8 సీట్లు, బైపీసీ విభాగంలో 2 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన బాలికలు ఈ సీట్లకు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థినులు కౌన్సెలింగ్‌కు హాజరై ఖాళీ సీట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా విద్యార్థినులు అవసరమైన ధ్రువపత్రాలను తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఎస్సెస్సీ మెమో, టీసీ, ఆధార్ కార్డు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వీటితో పాటు నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలని సూచించారు. విద్యార్థినులు ఈ నెల 24న ఉదయం 10 గంటలకు కళాశాలలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ప్రిన్సిపల్ రమ్యకృష్ణ కోరారు. ఖాళీ సీట్ల భర్తీకి అర్హులైన గిరిజన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

## గణపతి శోభాయాత్రకు ఆటంకాలు లేకుండా చూడాలి

**- అన్ని శాఖల సమన్వయంతో ముందుకు**

**- రూట్ మ్యాప్ పరిశీలించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ.**



నిజామాబాద్ సెప్టెంబర్23:( విజన్ ఆంధ్ర) ఇందూరులో నిర్వహించే వినాయకుడి శోభాయాత్రకు అధికారులు ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అధికారులకు సూచించారు. బుధవారం నగరంలోని దుబ్బ చౌరస్తా నుంచి లలితా మహల్, గాంధీ గంజ్, నెహ్రూ పార్క్, గాంధీ చౌక్, పవన్ టాకీస్, గాజుల్ పేట్, పెద్ద బజార్, గోల్ హనుమాన్ మీదుగా వినాయకుల బావి వరకు శోభాయాత్ర రూట్ మ్యాప్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఇందూరులో నిర్వహించే గణపతి శోభాయాత్ర ఎంతో ప్రత్యేకమైనది అన్నారు. సుమారు వందేళ్లుగా అనంత చతుర్దశి (ఈ నెల 25న) రోజున ప్రత్యేక రథంలో వినాయకుడి శోభాయాత్ర కొనసాగుతుందన్నారు. నగరంలోని అన్ని ప్రాంతాలను పరిశీలించడం జరిగిందని, విద్యుత్, కార్పొరేషన్, పబ్లిక్ హెల్త్, పోలీసు శాఖల సమన్వయంతో పూర్తి ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ప్రధానంగా విద్యుత్ దీపాల ఏర్పాటు, రోడ్లపై గుంతల పూడ్చివేత, అవసరమైన చోట బీటీ రోడ్ల నిర్మాణం, వినాయకుల బావి వద్ద సౌకర్యాలు పరిశీలించడం జరిగిందన్నారు. మండప నిర్వాహకులు శాంతియుతంగా భక్తి శ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మేయర్ ఉమారాణి, కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్, పబ్లిక్ హెల్త్ ఈఈ తిరుపతి, బీజేపీ కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, పసునూరి రాము, జగదీష్ కులకర్ణి, బంటు ప్రీతి ప్రవీణ్, ప్రసూన శ్రీనివాస్, జ్యోతి మురళి, నాయకులు పంచరెడ్డి శ్యామ్, శ్రీనివాస్, మరావర్ కృష్ణ, మహిళా మోర్చ అధ్యక్షురాలు వనిత తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

**- ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి**

**- అధికారులతో సమీక్షలో కలెక్టర్ భవేష్ మిశ్రా**

**- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశం**



నిజామాబాద్ సెప్టెంబర్ 23 :( విజన్ ఆంధ్ర) ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్ల కోసం క్షేత్రస్థాయిలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. అక్టోబర్ 1వ తేదీ నుండి జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణకు శ్రీకారం చుడతామని అన్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా, అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ అన్ని మండలాల తహసీల్దార్లు ఎంపీడీఓలతో కీలక అంశాలపై సమీక్ష జరిపారు. ధాన్యం అమ్మకాల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే పకడ్బందీ కార్యాచరణతో సన్నద్ధం కావాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో సదుపాయాల కల్పనతో పాటు, రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు గుర్తించిన గిడ్డంగులు, ఫంక్షన్ హాళ్లు, ఆయా ప్రదేశాలను క్షేత్రస్థాయిలో సందర్శించాలని ఆదేశించారు. కాగా, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నిర్ణీత గడువు కంటే ముందే పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించని వారిపై చర్యలు తప్పవని అన్నారు. మ్యాపింగ్ కాని వారికి, పేర్లు ఇతర వివరాలలో వ్యత్యాసం ఉన్న వారికి ఇంకనూ నోటీసులు జారీ చేయకపోతే తక్షణమే అందించాలని, నోటీసులు ఇచ్చిన వారి హియరింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. భూభారతి పెండింగ్ దరఖాస్తుల ప్రగతిని మండలాల వారీగా సమీక్షించిన కలెక్టర్, వచ్చే వారం నాటికి ఏ ఒక్క అర్జీ కూడా పెండింగ్ లో ఉండకుండా అన్నింటినీ పరిష్కరించాలని గడువు విధించారు. తహసిల్దార్, ఆర్డీఓ లాగిన్లలోని అన్ని మాడ్యుల్స్ కు సంబంధించిన దరఖాస్తులను నిశితంగా పరిశీలిస్తూ, భూభారతి నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు. హౌసింగ్ శాఖ పనితీరును సమీక్షిస్తూ, మొదటి విడతలో మంజూరు చేసిన ఇందిరమ్మ పెండింగ్ ఇళ్ళ నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేలా లబ్దిదారులను ప్రోత్సహించాలని అన్నారు. రెండవ విడత మంజూరీలను వేగవంతం చేయాలని సూచించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపు ఈ నెలాఖరు నాటికి పూర్తి కావాలని అన్నారు. 8274 డబుల్ బెడ్ రూమ్ లు పూర్తి కాగా, ఇప్పటికే వాటిలో 6713 ఇళ్ళ కేటాయింపులు పూర్తయ్యాయని, మిగిలిన 1561 ఇళ్ళను కూడా వారం వ్యవధిలో లబ్దిదారులకు లాటరీ పద్ధతిన, నిబంధనలను అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా కేటాయింపులు జరపాలని కలెక్టర్ ఆదేశించారు.

***మైనారిటీ సంక్షేమ పథకాలపై అవగాహన పెంపొందించాలి***

మైనారిటీల అభ్యున్నతిని కాంక్షిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు విస్తృత చర్యలు చేపట్టాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. మైనారిటీ సంక్షేమ శాఖ రాష్ట్ర కమిషనర్ అబ్దుల్ హమీద్ తో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. షాదీ ముబారక్ పథకం కింద జిల్లాకు 19.98 కోట్ల రూపాయల నిధులను ప్రభుత్వం కేటాయించగా, 7.79 కోట్లు మాత్రమే ఇప్పటివరకు పంపిణీ జరిగిందన్నారు. ఇతర సంక్షేమ పథకాల విషయంలోనూ ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వివిధ పథకాల గురించి క్షేత్రస్థాయిలో ముమ్మర ప్రచారం నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. తద్వారా అర్హులైన ప్రతి ఒక్కరు పతకాలను సద్వినియోగం చేసుకునేలా, ప్రభుత్వ తోడ్పాటుతో లబ్ది పొందేలా చొరవ చూపాలని కలెక్టర్ హితవు పలికారు. లబ్దిదారుల ఎంపిక విషయంలోనూ అధికారులు జాప్యం చేయకుండా దరఖాస్తులను వెంటదివెంట పరిశీలిస్తూ అర్హత కలిగిన వారికి ఆమోదం తెలుపాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీ.ఆర్.ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయ కుమారి, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, సంబంధిత శాఖల అధికారులు, అన్ని మండలాల తహసిల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా సాగిన "విభావరి నాట్య అకాడమీ" నృత్యోత్సవం

హైదరాబాద్, సెప్టెంబర్, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ విశ్వనాథ్) : ప్రముఖ నృత్య శిక్షణా సంస్థ "విభావరి నాట్య అకాడమీ" 28వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా "దివ్య దశ మౌక్తికం" పేరిట ఏర్పాటు చేసిన నృత్యోత్సవంలో విద్యార్థుల అద్భుత నృత్యాంశాల ప్రదర్శనలతో కన్నుల పండుగగా జరిగాయి. రవీంద్ర భారతి ప్రధాన వేదిక హైదరాబాద్ లో సోమవారం సాయంత్రం "విభావరి నృత్య అకాడమీ" వ్యవస్థాపకురాలు ప్రముఖ నాట్య గురువు 'మాధవి రామానుజం' నేతృత్వంలో విద్యార్థులు నేత్రపర్వంగా భావ, రాగ, తాళాలకు అనుగుణంగా ప్రదర్శించిన నృత్యాంశాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి, సంమోహితులను చేశాయి. గురు శిష్య పరంపరను ప్రతిబింబించేలా విద్యార్థులు ఎంతో నయనానందకరంగా ప్రదర్శించిన ఈ నృత్య కళా వైభవం కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా బి.ఎన్.చారి గౌరవ అధ్యక్షుడు, ఎల్ ఐ ఎ ఎఫ్ ఐ, చి.లక్ష్మీనాథాచార్యులు అధ్యక్షులు, సంస్కృత భారతి ట్రస్ట్, తెలంగాణ, కె. రామచారి సంగీత దర్శకుడు, ఐ ఎల్ ఎం ఎ, ప్రముఖ డాక్టర్. పి.ఎల్. చారిఅపోలో హాస్పిటల్స్, జి. వనజా భాస్కర్ రావు కావేరీ సీడ్స్, డాక్టర్. వనజ ఉదయ్ నాట్య గురువు, హంస అవార్డు గ్రహీత, ప్రొఫెసర్, డీన్, సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, విజయ ఎల్.రామం లాస్య ప్రియ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్, ఐ.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, కళాశ్రీ డా. పి. రమాదేవి కూచిపూడి నాట్య గురువు, పండితురాలు రచయిత హాజరై విద్యార్థులను ఆశీర్వదించి, అభినందించి వారికి మొమెంటోలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. గురువు మాధవి రామానుజం తమ ఆశీస్సులు అందజేసి ప్రశంసించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంధర్భంగా కార్యక్రమ నిర్వాహకురాలు నాట్య గురువు మాధవి రామానుజం మాట్లాడుతూ, గత 27 సంవత్సరాలుగా 1000 మందికి పైగా విద్యార్థులకు భరతనాట్యం కూచిపూడి నృత్యాలను నేర్పిస్తూ, మన కళలు, సంస్కృతి, సాంప్రదయాల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురువు మాధవి రామానుజం అతిథులను ఘనంగా సత్కరించ్చారు. సుమనోహరంగా సాగిన ఈ కార్యక్రమంలో తమ అద్భుతమైన అభినయంతో శివుడి పాత్రలో కుమారి 'అక్షయ', కృష్ణుడి పాత్రలో చిన్నారి 'సహస్ర' అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ "దివ్య దశ మౌక్తికం" నృత్యోత్సవానికి పెద్ద సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు, కళాకారులు, కళాభిమానులు, బంధుమిత్రులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి చక్కటి వ్యాఖ్యానాన్ని రామానుజం అందించారు.



## వరి ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టాలి

**- డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియలు వెంటనే పూర్తి చేయాలి**

**- రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్.**




నిర్మల్ జిల్లా,సెప్టెంబర్ 23,(విజన్ ఆంధ్ర); వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు అన్ని జిల్లాల్లో అధికారులు తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం వ్యవసాయ శాఖ కార్యదర్శి, అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, అధికారులతో హైదరాబాదు నుంచి వరి ధాన్యం కొనుగోలు ఏర్పాట్లు, డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రీ (ఫార్మర్ ఐడీ నమోదు) ప్రక్రియలపై ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని జిల్లాల్లో వరి ధాన్యం కొనుగోలుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. తగినన్ని లారీలు, టార్పాలిన్ లు, గన్నీ సంచులు, హమాలీలు, సామాగ్రి సమకూర్చుకోవాలన్నారు. సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ఏడు రకాల సన్న వరి వడ్లు పండించిన రైతులకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ అందిస్తామన్నారు. రికార్డుల ప్రకారం 10 లక్షల 50 వేలకు పైగా రైతులు దాదాపు 34 లక్షల 84 వేల ఎకరాల్లో సన్న వరి రకాలు సాగు చేశారని అన్నారు. డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియలు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ ద్వారా రైతులకు వ్యవసాయ సంబంధిత అనేక అంశాల్లో ఉపయోగాలు ఉంటాయన్నారు. డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహణలో గ్రామీణ స్థాయిలో స్థానికంగా వ్యవసాయ అంశాలపై అవగాహన ఉన్న వారిని వాలంటీర్లుగా నియమించుకోవాలని పేర్కొన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వేల వివరాలను జిల్లాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్ పాల్గొన్నారు. వీసీ అనంతరం అధికారులతో ఆయన మాట్లాడుతూ, వరి ధాన్యం కొనుగోలుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియ వివరాలను సమీక్షించారు. మిగిలిన రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వే ను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. ఈ వీసీలో జిల్లా ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, వ్యవసాయ అధికారి సుజాత, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా డిగ్రీ కళాశాలను అకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్..



మునిపల్లి మండలం: సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర) : మునిపల్లి మండలం సాంఘిక సంక్షేమ శాఖ మహిళా డిగ్రీ కళాశాల బుదేర లో బుధవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా కళాశాలలోని విద్యార్థుల బాగోగులను, కిచెన్ లో భోజనం మరియు ఆడిటోరియం, కళాశాల బిల్డింగ్ వర్కులు ఎలా జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకున్నారు.

# ఐ.టీ టవర్ ను సందర్శించిన కలెక్టర్



నిజామాబాద్, సెప్టెంబర్ 23 :( విజన్ ఆంధ్ర) నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఐ.టీ టవర్ ను కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం సందర్శించారు. ఐ.టీ టవర్ కేంద్రంగా కొనసాగుతున్న వివిధ కంపెనీల వివరాలను, వాటి పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం 13 కంపెనీలలో 380 మంది వరకు పని చేస్తున్నారని టీ.జీ.ఐ.ఐ.సీ జోనల్ మేనేజర్ శివ ప్రసాద్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా కంపెనీల నిర్వాహకులను, అందులో పని చేస్తున్న ఐ.టీ ఉద్యోగులను కలిసి స్థానికంగా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీయగా, వారు సంతృప్తి వ్యక్తం చేశారు. సాధ్యమైనంత మేరకు ఎక్కువ కంపెనీలు స్థానికంగా నెలకొల్పేలా చూడాలని, తద్వారా ఈ ప్రాంత యువతకు స్థానికంగా మరింత ఎక్కువ సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు లభించేందుకు ఆస్కారం ఉంటుందని కలెక్టర్ సూచించారు. వినూత్న ఆలోచనలు, సరికొత్త ఆవిష్కరణలతో ముందుకు వచ్చే స్టార్ట్ అప్ కంపెనీలకు ఐ.టీ టవర్ చక్కటి వేదికగా నిలుస్తుందని, దీనిని ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట టీ.జీ.ఐ.ఐ.సీ ఏ.ఈ శివకృష్ణ ఉన్నారు.

## ఆదిలాబాద్ రిమ్స్ ఘటన యావత్ రాష్ట్రాన్ని కలిచివేసింది

**- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్**

ఆదిలాబాద్, సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర): ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో చోటుచేసుకున్న ఘటన యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలను తీవ్రంగా కలిచివేసిందని మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆమె మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి తదితర బీఆర్ఎస్ నాయకులతో కలిసి రిమ్స్‌లో ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైద్య, ఆరోగ్య రంగాలను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. మృతి చెందిన శిశువుల కుటుంబాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తరపున లక్ష రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి మృతి చెందిన శిశువుల కుటుంబాలకు రూ. 25 లక్షలు, గాయపడిన వారికి రూ. 10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న చిన్నారుల వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించాలని కోరారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వైద్య రంగానికి పెద్దపీట వేసి పేదలకు మెరుగైన వైద్యం అందించామని, కాంగ్రెస్ పాలనలో ప్రజా సంక్షేమం గాడి తప్పిందని వారు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ ముఖ్య నేతలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ రిమ్స్ అభివృద్ధికి రూ. 150 కోట్లు మంజూరు చేయాలి

**- ఎమ్మెల్యే పాయల్ శంకర్**

ఆదిలాబాద్, సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర): ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో ఇటీవల చోటుచేసుకున్న విషాద ఘటన నేపథ్యంలో ఆసుపత్రి అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం వెంటనే రూ. 150 కోట్లు మంజూరు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. రిమ్స్‌లో ప్రస్తుతం ఉన్న వసతులు, అదనంగా నిర్మించాల్సిన 150 పడకల ఆసుపత్రి, ఇతర అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించి తక్షణమే పూర్తిస్థాయి ఎస్టిమేట్లు సిద్ధం చేయాలని కోరారు. ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ స్థాయి వైద్యం అందకపోగా, కనీస వైద్యుల కొరత తీవ్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులకు అత్యుత్తమ వైద్యం అందించేందుకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక వైద్యుల బృందాన్ని పంపాలని, అవసరమైతే ప్రైవేట్ వైద్యుల సేవలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా 24 గంటలు పనిచేసే ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ వ్యవస్థ, పటిష్టమైన ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, పేదలకు మెరుగైన వైద్యం అందించేలా రిమ్స్‌ను అన్ని విధాలుగా బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు హనుమాన్లు, గంటా జీవన్, పోసాని కార్తీక్, నరేష్, ఆత్రం సాయి, సతీష్ యాదవ్, రాము, దత్తు, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇనార్బిట్ మాల్ సైబరాబాద్‌లో 'మాచా ల్యాండ్'




హైదరాబాద్, సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర) : మాచా, వెల్‌నెస్, ఫిట్‌నెస్, హెల్తీ ఫుడ్, అథ్లీజర్, మ్యూజిక్‌ను ఒకే వేదికపైకి తీసుకొచ్చే 'ది మాచా సోషల్ : మాచా ల్యాండ్' రెండు రోజుల లైఫ్‌స్టైల్ ఫెస్టివల్ సెప్టెంబర్ 26, 27 తేదీల్లో ఇనార్బిట్ మాల్ సైబరాబాద్‌లో జరగనుందని నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో 'మాచా సమెలియర్ ఎక్స్‌పీరియన్స్', గైడెడ్ టేస్టింగ్స్, లైవ్ మాచా ప్రిపరేషన్, 'మాచా డిస్కవరీ యాక్టివిటీ షీట్', కప్ డిజైనింగ్, 'మాచా టోట్ బ్యాగ్ పెయింటింగ్' వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఫిట్‌నెస్, క్రియేటివ్ యాక్టివిటీస్, సంగీతంతో పాటు కుటుంబాలు, పిల్లలు, వెల్‌నెస్ ఔత్సాహికులను ఆకట్టుకునేలా ఫెస్టివల్‌ను రూపొందించినట్లు తెలిపారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు

*గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలల్లో అంకితభావంతో విధులు నిర్వహించాలి.....డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ..*




అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23,( విజన్ ఆంధ్ర) : గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అంకితభావంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. బుధవారం కేరమెరి మండలం మోడీ స్కూల్ కాంప్లెక్స్‌ రాసిమెట్ట, అనార్పల్లి, మోడీ పాఠశాల సముదాయాలకు చెందిన ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ పాల్గొని పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఉపాధ్యాయుడు పనిచేయాలని అన్నారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు బలమైన పునాది ఏర్పడేలా బోధన కొనసాగించాలని, ఖీచీ ఆధారిత విద్యా విధానానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యార్థుల హాజరు, పాఠశాల రికార్డుల నిర్వహణ, పాఠశాల పరిశుభ్రత, ఆహ్లాదకరమైన పాఠశాల వాతావరణం, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు తదితర అంశాలపై సమావేశంలో వివరంగా చర్చించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న యూనిఫామ్స్, నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు తదితర సామగ్రి సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు, విధుల నిర్వహణ, బోధనా ప్రణాళికలు, విద్యార్థుల అభ్యసన ఫలితాలు తదితర అంశాలను క్రమం తప్పకుండా పరిశీలించాలని తెలిపారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

డిప్యూటీ డి ఈ ఓ గోడం చందన్.

ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు ఆదేశాలకు అనుగుణంగా గిరిజన సంక్షేమ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల్లో చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలు, భాషా సామర్థ్యం, ఆలోచనా శక్తి, సృజనాత్మకత వంటి అంశాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేసే దశ ప్రాథమిక విద్యేనని, అందువల్ల ప్రతి ఉపాధ్యాయుడు తన బాధ్యతను గుర్తించి విద్యార్థుల అభివృద్ధి కోసం కృషి చేయాలని జాదవ్ అంబాజీ పేర్కొన్నారు. పాఠశాలల పనితీరును అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని, విధుల్లో నిర్లక్ష్యం లేదా బాధ్యతారాహిత్యం కనిపిస్తే నిబంధనల ప్రకారం శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డి ఈ ఓ ఏజెన్సీ గోడం చందన్,ఏసీఎంఓ పూర్కా ఉద్ధవ్, ఏటీడీఓ శ్రీనివాస్, జి సి డి ఓ కొట్నాక్ శకుంతల మూడు స్కూల్ కాంప్లెక్స్‌ల ప్రధానోపాధ్యాయులు అనిత, ప్రేమదాస్, సురేష్, ఎస్సీఆర్పీలు శంకర్, నరేష్, శ్యాంరావుతో పాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణను ప్రపంచ ఏఐ హబ్‌గా తీర్చిదిద్దేందుకు పనిచేయాలి

**- తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఐఏఎస్**




హైదరాబాద్, సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర) : తెలంగాణను ప్రపంచ ఏఐ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం, పరిశ్రమలు కలిసి పనిచేయాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఐఏఎస్ పిలుపునిచ్చారు. సీఐఐ తెలంగాణ ఆధ్వర్యంలో 'ప్రపంచానికి తెలంగాణ : గ్లోబల్ ఏఐ, జీసీసీ పరివర్తన' ఇతివృత్తంతో హైదరాబాద్‌లో ఏఐ సమ్మిట్–2026 నిర్వహించారు. ఏఐ ఉత్పత్తులు, ఐపీ, జీసీసీలు, డేటా సెంటర్లు, జీపీయూ మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, బాధ్యతాయుత ఏఐపై చర్చించారు. ఇక్కడే నిర్మించండి.. ఇక్కడే సృష్టించండి.. ఇక్కడే పెట్టుబడి పెట్టండి' అని సంజయ్ జాజు పరిశ్రమలకు పిలుపునిచ్చారు. అనుదీప్ దురిశెట్టి ఐఏఎస్, ఎం.గౌతమ్ రెడ్డి, ఎం.వి.రెడ్డి, సంజీవ్ దేశ్‌పాండే, నీలోత్పల్ కుమార్ దత్తా, రాజన్ నవానీ, గౌరవ్ మహేశ్వరి తదితరులు ఏఐ ఆవిష్కరణలు, సురక్షిత మౌలిక సదుపాయాలు, స్టార్టప్‌లు, జీసీసీలు, పరిశ్రమ–ప్రభుత్వ సహకారంపై తమ అభిప్రాయాలు వెల్లడించారు.

## గర్భిణీ బాలింతలు పిల్లలు పోషణ లోపం లేకుండా రక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించిన అంగన్వాడి టీచర్ తొట్ల వెంకటలక్ష్మి



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర): మహబూబాబాద్ జిల్లా పరిధిలోని తొరూరు ప్రాజెక్టుకు సంబంధించిన నెల్లికుదురు మండలంలో వస్త్రం తండా జిపి లోని లాలు తండా అంగన్వాడి సెంటర్లో ఈరోజు అంగన్వాడి కేంద్రంలో గర్భిణీ స్త్రీలు పిల్లలతో పోషణ లోపం లేకుండా రక్షిస్తానని వారి ముందు ప్రతిజ్ఞ చేసిన అంగన్వాడి టీచర్ తొట్ల వెంకటలక్ష్మి నా దేశంలోని పిల్లలు బాలికలు మహిళలను పోషణ లోపం నుండి రక్షిస్తానని అన్నారు . జాతీయ పోషణ మాసం సందర్భంగా నేను ప్రతి ఇంటికి సరైన పోషణ పోషకాహారం త్రాగు నీరు పరిశుభ్రతపై సమాచారం ఇస్తాను నేను పోషణ అభియాన్ మన దేశ వ్యాప్త జనచైతన్యంగా మలుస్తాను ప్రతి ఇల్లు బడి పల్లె పట్టణం సరైన పోషణ నినాదాలతో మరు మ్రోగేలా చేస్తాను. ఈరోజు చైతన్యం ద్వారా దేశ సోదరా సోదరామణులు పిల్లలు సంపూర్ణ ఆరోగ్య వంతులైతారు మెరుగైన శక్తి సోమర్థ్యాలతో జీవితాలను స్వార్థకం చేసుకుంటారు ఇదేనా ప్రతిజ్ఞ సరైన పోషణ ఆరోగ్య తెలంగాణ పోషణ లోపం ఏ ఊరిలో కనిపించకూడదు అనే నా ప్రతిజ్ఞ సూపర్వైజర్ సరిత ప్రోత్సవంతో చాలా చక్కగా పోషణ మాసం కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## భూ సేకరణను వేగవంతం చేసి జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి.


**- సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర బ్యూరో) : నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాలతోపాటు మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణను పూర్తిచేసి, పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితే పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించి మండలాల వారీగా చేయాల్సిన భూసేకరణ పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సేకరణకు ఎలాంటి ఇబ్బందులు లేని చోట సంబంధిత రైతులకు నిబంధనల ప్రకారం అవార్డు పాస్ చేసి ముందుకెళ్లాలన్నారు. మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధిత రైతులతో గ్రామసభలు నిర్వహించి ప్రాజెక్టు ఆవశ్యకతపై అవగాహన కలిగించాలని సూచించారు. గుడ్డెం దొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 15 టీఎంసీలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయించినందున అవసరమైన భూ సేకరణ ప్రక్రియను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. జూరాల ప్రాజెక్టు కుడి కాలువ పరిధిలో వరి సాగు చేసిన రైతులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు నీటిని విడుదల చేయడం జరిగిందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ఆర్డీవో శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఎస్ఈ కేశవరావు, సర్వే ఏడి నూకరాజు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కాగజ్ నగర్ పట్టణంలో పలు వార్డులలో చెత్త కుప్పలు



కాగజ్‌నగర్, సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర): కాగజ్‌నగర్ పట్టణంలోని పలు వార్డుల్లో చెత్త కుప్పలు పేరుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కాపువాడ ప్రధాన రహదారిపై చెత్త పేరుకుపోయి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. రహదారి పక్కన ఎక్కడికక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తను సకాలంలో తొలగించకపోవడంతో పరిసర ప్రాంతాల్లో దోమలు, ఈగలు విపరీతంగా పెరుగుతున్నాయని తెలిపారు. దీంతో ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసిన సమయంలో చెత్తతో పాటు మురుగు నీరు రహదారిపైకి చేరడంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోందని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఈ రహదారిపై రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వ్యాపారులు, స్థానిక నివాసితులు కూడా చెత్త సమస్యతో అవస్థలు ఎదుర్కొంటున్నారని అన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది క్రమం తప్పకుండా చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రహదారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. చెత్త కుప్పల వల్ల వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను కోరారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కాపువాడ ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## రెండో విడత ఇందిరమ్మ ఇండ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాలు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి23 సెప్టెంబర (విజన్ ఆంధ్ర) : ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి గూర్చి ఎంపిడిఓ, మున్సిపల్ కమిషనర్లు, గృహనిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి జూమ్ సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు రెండవ విడతలో మంజూరు చేయబడిన లబ్ధిదారుల వివరాల గెజిటెడ్ ఆఫీసర్ వెరిఫికేషన్ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, వెరిఫై చేసిన తరవాత ఆ దస్త్రాలను కలెక్టరేట్ కి పంపించాలని ఆదేశించారు. ఆయా మండలాల వారిగా ప్రణాళిక ప్రకారం గెజిటెడ్ ఆఫీస్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని నిర్మాణ దశలకు అనుగుణంగా అందేలా చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో ఇళ్ల నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న సమస్యలను లబ్ధిదారులతో మాట్లాడి వెంటనేపరిష్కరించాలని, నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులను ప్రోత్సహించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమమని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సహాయం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారి భగవంత్ రావు, డిఈ తదితరులు పాల్గొన్నారు.

## విజన్ ఆంధ్ర పత్రిక జర్నలిస్టుపై దాడి చేసిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి

**- జిల్లా ఎస్పీ కి వినతి పత్రం అందజేసిన**

**- తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా కమిటీ.**






గద్వాల సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర బ్యూరో) : గద్వాల రూరల్ పరిధిలోని సంఘాల చెరువు సమీపంలో మంగళవారం రాత్రి 7 గంటలకు విజన్ ఆంధ్ర రిపోర్టర్ నర్సింహులు పై ఇద్దరు వ్యక్తులు పాత కక్షలు మనసులో పెట్టుకొని దాడి చేశారు. ఇట్టి సంఘటనపై స్పందించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కమిటీ సభ్యులు, ఇతర సంఘాల సభ్యులు బుధవారం జిల్లా ఎస్పీ టి శ్రీనివాసరావు ని కలిసి జర్నలిస్ట్ నరసింహులు పై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పించారు. రాబోయే రోజుల్లో జర్నలిస్టులపై దాడులు పునరావతం కాకుండా చూడాలని జిల్లా ఎస్పీ కి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కమిటీ జిల్లా అధ్యక్షుడు బి.గిరిబాబు విన్నవించారు. ముందుగా గాయపడిన జర్నలిస్ట్ నరసింహులు ను కమిటీ సభ్యులు గద్వాల ప్రభుత్వ హాస్పిటల్ లో పరామర్శించారు. ఇట్టి విషయముపై జిల్లా ఎస్పీ టీ శ్రీనివాసరావు స్పందిస్తూ జర్నలిస్టుపై దాడి చేసిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసు చేశామని అన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గిరిబాబు మాట్లాడుతూ జిల్లాలో చాలా ప్రాంతాలలో వచ్చే న్యూస్ పై అవగాహన లేకుండా కొందరు ప్రజాప్రతినిధులు ఎందరో జర్నలిస్టులను బెదిరింపులకు కూడా గురి చేశారని గుర్తు చేశారు.వార్తలు రాసే జర్నలిస్టులపై వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని ఆయన అన్నారు.ఇట్టి దాడి పై జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు. ఉపాధ్యక్షులు సురేష్, శ్రీనివాసులు, కేబీ. తిమ్మప్ప, కమిటీ సభ్యులు టి. వీరన్న, మహబూబ్, వరప్రసాద్, ఇలియాస్, విష్ణువర్ధన్ గౌడ్, సత్యం, రవి కుమార్ ,తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ప్రశాంత గణేష్ నిమజ్జన శోభాయాత్రకై పోలీసుల మార్గదర్శకాలు

- బాలానగర్ ఏసీపీ,




మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర బ్యూరో): ఈ నెల 25వ తేదీన జరగనున్న గణేష్ నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా భక్తులు, మండప నిర్వాహకులు పలు ముఖ్యమైన జాగ్రత్తలు పాటించాలని బాలానగర్ ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శోభాయాత్ర ప్రశాంతంగా, సురక్షితంగా, ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ముగిసేందుకు.. భద్రత, పౌర సదుపాయాల పర్యవేక్షణ కోసం సైబరాబాద్ పోలీస్ సుమారు 200 మందిపైగా పోలీసు సిబ్బందిని మోహరించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు, నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలని కోరారు. సైబరాబాద్ పోలీస్, సిఎంసీ, హైడ్రా, టిజిఎస్పీడీసీఎల్, జలమండలి సమన్వయంతో చేపట్టిన నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా, సురక్షితంగా ముగిసేందుకు, శాంతిభద్రతలు, ట్రాఫిక్ నిర్వహణ దృష్ట్యా నిర్వాహకులకు పోలీసుల ముఖ్యమైన, కీలక మార్గదర్శకాలు చేశారు. గణేష్ మండపాల వద్ద నిర్వహించే అన్నదానాలు, లడ్డూ వేలం, ఇతర కార్యక్రమాలను వీలైనంత త్వరగా పూర్తి చేసుకోవాలి. ఉదయం 10' గంటల నుంచి మధ్యాహ్నం 12' గంటల మధ్యలోనే శోభాయాత్రను ప్రారంభించి, ఆలస్యం చేయకుండా అధికారులు నిర్దేశించిన నిమజ్జన ప్రదేశానికి చేరుకోవాలన్నారు. గణేష్ విగ్రహాల తరలింపు మార్గంలో విద్యుత్ వైర్లు, చెట్ల కొమ్మలు లేదా ఇతర అడ్డంకులు ఉంటే ముందుగానే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సంబంధిత అధికారులతో సమన్వయం చేసి వాటిని తొలగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గణేష్ శోభాయాత్రలో హైకోర్టు ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. డీజేల వినియోగం పూర్తిగా నిషేధం. ఎలాంటి నిబంధనల ఉల్లంఘన జరగకుండా నిర్వాహకులు పూర్తి బాధ్యత వహించాలని హెచ్చరించారు. గణేష్ విగ్రహాలను తరలించే వాహనాల కండిషన్‌ను, వాహన ఫిట్‌నెస్ ముందుగానే తనిఖీ చేసుకోవాలన్నారు. చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న అనుభవజ్ఞులైన డ్రైవర్లను మాత్రమే వాహనాలు నడిపేందుకు అనుమతించాలన్నారు. ప్రతి గణేష్ విగ్రహం వెంట బాధ్యత కలిగిన నిర్వాహకులు తప్పనిసరిగా ఉండాలని. రహదారులపై అనవసరంగా వాహనాలు నిలిపివేయకుండా, సాధారణ ప్రజలకు, ఇతర వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ప్రజల భద్రత కోసం, విస్తృతమైన అత్యవసర ప్రతిస్పందన చర్యలు చేపట్టబడ్డాయని. నీటిలో నిమజ్జన ప్రక్రియను సురక్షితంగా నిర్వహించడానికి, సైబరాబాద్ పోలీస్, హైడ్రా అన్ని ప్రధాన సరస్సుల వద్ద ప్రత్యేక నైపుణ్యం గల ఈతగాళ్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నిమజ్జనం సమయంలో క్రేన్ కింద ఎవరూ నిలబడటం చేయకూడదు, చెరువులు లేదా ట్యాంక్‌లలోకి ఎవరూ నేరుగా దిగకూడదని సూచించారు. పూజా సామగ్రి, పూలను నీటిలోకి వెళ్లి వేయకుండా నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్త వహించాలన్నారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు ప్రదేశంలో ఉండే పోలీసుల సూచనలను కచ్చితంగా పాటించాలని. 25న పెద్ద సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనానికి వచ్చే అవకాశం ఉన్నందున, ప్రతి ఒక్కరూ మత సామరస్యానికి ప్రతీకగా, శాంతియుత వాతావరణంలో, బాధ్యతాయుతంగా వ్యవహరించి, పోలీస్ శాఖకు సహకరించి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఏసీపీ విజ్ఞప్తి చేశారు.

## విజన్ ఆంధ్ర పత్రిక విలేఖరి నరసింహులు పై దాడి అమానుషం,హేయమైన చర్య

**- వెంటనే స్పందించి కేసు నమోదు చేసిన రూరల్ ఎస్సై. శ్రీకాంత్ కి ధన్యవాదములు**

**- దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఫోరం సలహాదారుడు**



గద్వాల సెప్టెంబర్ 23( విజన్ ఆంధ్ర బ్యూరో) : గద్వాల సమీపంలో మంగళవారం సాయంత్రం సీనియర్ విలేకరి( విజన్ ఆంధ్ర పత్రిక) నరసింహులు పనులు ముగించుకొని తిరుగు ప్రయాణంలో అవుటర్ రింగ్ రోడ్డు పెట్రోల్ బంక్ దగ్గర సీనియర్ విలేఖరి నర్సింహులు పై ఇద్దరు యువకులు అకారణంగా దాడి చేసిన ఘటన బాధాకరమని దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిజ్వారం ఎస్. తిరుమలేష్, దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర సలహాదారులు పాల్వాయి ఎస్.రంజిత్ కుమార్ ఖండించారు.జరిగిన ఘటనపై గద్వాల రూరల్ ఎస్సై.శ్రీకాంత్ స్పందించి వెను వెంటనే చర్యలు తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. నిందితులను చట్టప్రకారంగా శిక్షించాలని వారు కోరారు.

## జూరాల ప్రాజెక్టుకు కృష్ణా జలాలు విడుదల..

**- కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపిన తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేల బృంధం**



గద్వాల సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర బ్యూరో) : బుధవారం బెంగుళూరులోని కర్ణాటక రాష్ట్ర సచివాలయంలో జూరాల ప్రాజెక్టుకు కృష్ణా జలాలను విడుదల చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కి తెలంగాణ రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణ రావు, వాకిటి శ్రీహరి , ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి , మెగా రెడ్డి, జి మధుసూదన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న రైతుల పంటలను కాపాడేందుకు కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో సహాయకరంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల సమన్వయంతో రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు మరింత సహకారం కొనసాగాలని ఆకాంక్షించారు. జోగులాంబ గద్వాల జిల్లా ప్రజల తరపున గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కర్ణాటక ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.

## అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు అధికారులకు సీఎం ఆదేశాలు

హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టో హామీ మేరకు అసైన్డ్ భూముల లబ్ధిదారులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని, ఇందుకోసం అవసరమైన కసరత్తు ప్రారంభించాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సెక్రటేరియెట్‌లో జరిగిన ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం అమలుపై ఉన్నత స్థాయి కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అసైన్డ్ భూముల పరిరక్షణకు ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించాలని, జిల్లాల్లో అసైన్డ్ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించినట్లు సమాచారం.

# గణేశుని విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన బండి రమేష్




మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర బ్యూరో): వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా బుధవారం టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ శ్రీ బండి రమేష్, కూకట్‌పల్లి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేశుని విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ 3వ ఫేజ్ మరియు 4వ ఫేజ్లో ఏర్పాటు చేసిన గణేశుని విగ్రహాలను దర్శించుకుని స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం మూసాపేట్ డివిజన్‌లోని ఆంజనేయ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశుని విగ్రహాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, వినాయక చవితి పండుగను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఐక్యతతో జరుపుకోవడం సంతోషకరమన్నారు. విఘ్నేశ్వర స్వామి ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యాలను ప్రసాదించాలని ఆకాంక్షించారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుడి ఆశీస్సులు అందరిపై ఉండాలి

**- మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పూదరి ప్రభాకర్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23,(విజన్ ఆంధ్ర ) : ప్రజలందరిపై వినాయకుడి ఆశీస్సులు ఉండాలని మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పూదరి ప్రభాకర్ కోరారు. బుధవారం చిన్నంబాటిలోని 100 ఫీట్ల రోడ్ లో అంజనిపుత్ర ఎస్టేట్స్ గుర్రాల శ్రీధర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపంలో మాజీ మున్సిపల్ కమిషనర్ పూదరి ప్రభాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ ప్రభాకర్ మాట్లాడుతూ అంజనీపుత్ర ఏస్టేట్స్ గత 12 సంవత్సరాలుగా వినాయకుడిని ఏర్పాటు చేస్తూ, నిత్య అన్నదానం నిర్వహించడం సంతోషకరమ్మన్నారు.అంజనీపుత్ర ఎస్టేట్స్ లోని వెంచర్లలో అందరికి అందుబాటులో అతితక్కువ ధరలకే ప్లాట్లు విక్రయిస్తూ,వారి బంగారుభవిష్యత్తు కు బాటలు వేస్తున్నారని అన్నారు. అంతే కాకుండా సేవా కార్యక్రమాలు చేపడుతూ అందరి మన్ననలు పొందుతున్నారని పేర్కొన్నారు. అనంతరం పూదరి ప్రభాకర్ కు అంజనీపుత్ర ఎస్టేట్స్ చైర్మన్ గుర్రాల శ్రీధర్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో దుస్స తిరుపతి, రౌతు రవి, నిర్వాహకులు పాల్గొన్నారు.

## కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఢిల్లీ నుంచి జిల్లా కలెక్టర్ కు ప్రత్యేక ఆహ్వానం

**- ఉత్తమ నీటి నిర్వహణ విధానాలపై ఈనెల 24న ప్రజెంటేషన్ ఇవ్వనున్న కలెక్టర్**



గద్వాల సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్‌ను ఈనెల 24న ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ప్రత్యేక సెషన్‌కు ఆహ్వానం లభించింది. ఈ సందర్భంగా బెస్ట్ వాటర్ మేనేజ్మెంట్ ప్రాక్టీసేస్ అంశంపై జిల్లా కలెక్టర్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు.దేశంలోని వివిధ ప్రాంతాల్లో అమలు చేస్తున్న ఉత్తమ నీటి నిర్వహణ విధానాలు, అనుభవాలను తెలుసుకునే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా లభించనుంది. తద్వారా ఆయా ఉత్తమ పద్ధతులను జిల్లాలో, ముఖ్యంగా పీఎండిడికేవై కార్యక్రమం కింద చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు అన్వయించుకునేందుకు ఉపయోగపడుతుంది. జాతీయ స్థాయి వేదికపై జిల్లా తరఫున ప్రజెంటేషన్ ఇవ్వడానికి లభించిన ఈ అవకాశంతో జిల్లా ప్రాధాన్యతను సంతరించుకుంది.

## ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23,( విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని తిర్యాణి మండలం గిన్నెదరి గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి హాజరు పట్టిక, ఆపరేషన్ థియేటర్, మందుల నిల్వ గది పరిసరాలను పరిశీలించి, ప్రతిరోజు ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలు పొందుతున్న ప్రజల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జ్వరాలు, ఇతర అంటువ్యాధుల బారిన పడి ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాలలో ప్రతిరోజు ఆరోగ్య కార్యకర్తలు సందర్శించి ప్రజలకు వైద్య సేవలు అందించాలని, నెలలు నిండిన గర్భిణులకు సుఖ ప్రసవం కొరకు సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. వైద్య సేవల నిమిత్తం ఆసుపత్రికి వచ్చే ప్రజల పట్ల వైద్యులు, సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం మండలంలోని విజయనగర్ గ్రామంలో గల జంగుబాయి మండల సమాఖ్య కార్యాలయాన్ని సందర్శించి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తయారు చేస్తున్న ఏకరూప దుస్తుల నాణ్యతను పరిశీలించారు. ఏకరూప దుస్తులు కుట్టడంలో నాణ్యత పాటించాలని, విద్యార్థులకు మరొక జత దుస్తులను త్వరగా సిద్ధం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఎ.పి.ఎం. శ్రీనివాస్, మహిళా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మరణించిన హోంగార్డ్ కుటుంబానికి రూ.20 వేల వెల్ఫేర్ ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత



భూపాలపల్లి జిల్లా : 23 సెప్టెంబర్ ( విజన్ ఆంధ్ర ) పోలీస్ హెడ్క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ గోలి శ్రీనివాస్ ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ తరఫున వెల్ఫేర్ ఎక్స్‌గ్రేషియా కింద మంజూరైన రూ.20,000 చెక్కును జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. హోంగార్డ్ గోలి శ్రీనివాస్ అకాల మరణం పోలీస్ శాఖకు తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ వెల్ఫేర్ పథకాలు సిబ్బంది కుటుంబాలకు ఆపద సమయంలో ఆర్థిక భరోసా కల్పించడంలో కీలకంగా నిలుస్తాయని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ సంతోష్ కుమార్ పాటు హోంగార్డ్ గోలి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఆయుష్ వైద్య విధానాలు చికిత్స పద్ధతులను ఉపయోగించుకోవాలి - వైద్యాధికారి ధనరాజ్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి 23 సెప్టెంబర్ (విజన్ ఆంధ్ర) : జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత మెగా ఆయుష్ వైద్య శిబిరం బుధవారం సిద్దిపేట పట్టణంలోని స్వచ్ఛ బడి ఆవరణలో, పాత బురుజు వద్ద నిర్వహించబడింది. ఈ ఉచిత మెగా ఆయుష్ వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ధనరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. ధనరాజ్ ఆయుష్ వైద్య విధానాల ప్రాముఖ్యతను వివరించారు. ఆయుష్ వైద్య విధానాలు ఆరోగ్య పరిరక్షణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయని, శిబిరానికి హాజరైన ప్రజలు మరియు రోగులు ఆయుష్ వైద్య విధానాలు, మందులు మరియు చికిత్సా పద్ధతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెరుగైన ఆరోగ్య ఫలితాల కోసం అవసరమైన సందర్భాల్లో ఆయుష్ వైద్య పద్ధతులను ఉపయోగించుకోవాలని తెలిపారు. అలాగే ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఆధ్యాత్మికతను పెంపొందించుకోవడం ద్వారా వ్యక్తిగత శ్రేయస్సుతో పాటు సమాజం మరియు ప్రపంచ శ్రేయస్సుకు దోహదపడాలని ఆయన సూచించారు.ప్రభుత్వ నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఇందిరా ఝాన్సీ మాట్లాడుతూ, ఆయుష్ వైద్య విధానాల్లో భాగంగా కంటి సంబంధిత చికిత్సను స్వయంగా పొందిన తన అనుభవంలో మంచి ఫలితాలు పొందినట్లు తెలిపారు. ఆయుష్ వైద్య విధానాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మాజీ కౌన్సిలర్ శ్రీమతి దీప్తి నాగరాజు మాట్లాడుతూ, ఆయుష్ వైద్య విధానం సంపూర్ణ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని శరీరం, మనస్సు మరియు జీవనశైలిని సమగ్రంగా పరిగణించే హోలిస్టిక్ చికిత్సా విధానం అని తెలిపారు. ఇటువంటి సమగ్ర వైద్య విధానాలు ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు సమాజాన్ని మరింతఆరోగ్యవంతంగా, మెరుగైన ప్రపంచంగా తీర్చిదిద్దేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. శిబిరం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 4:00 గంటల వరకు నిర్వహించబడింది. శిబిరంలో 300లకు పైగా రోగులు పాల్గొని వల్ల సమస్యలకు వైద్యాన్ని పొందారు. ఈ వైద్య శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులు, కీళ్ల నొప్పులు, అస్తమా, అలెర్జీలు, కిడ్నీలో రాళ్లు, థైరాయిడ్, రక్తపోటు మధుమేహం (షుగర్), చర్మ వ్యాధులు తదితర వ్యాధులకు ఆయుష్ వైద్య సేవలు అందించడంతో పాటు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.అలాగే శిబిరంలో దాదాపు 100 మంది మధుమేహ పరీక్షలు, బ్లడ్ గ్రూపింగ్, హిమోగ్లోబిన్ వంటి ఉచితంగా నిర్వహించిన రక్త పరీక్ష సేవలను వినియోగించుకున్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఆయుష్ వైద్య సేవలనువినియోగించుకున్నారు.శిబిర నిర్వహణలో పాల్గొన్న ఆయుష్ బృందంనోడల్ ఆఫీసర్: డా. కె. అనిల్ కుమార్ సమీకృత ఆయుష్ ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్: డా. ఉమా దేవిజిల్లా ప్రోగ్రామ్ అధికారి: డా. భానుతేజ ఆయుర్వేద వైద్యులు: డా. కేదారి, డా. సంపత్ కుమార్యునాని వైద్యులు: డా. అజీమ్ అహ్మద్ హోమియోపతి వైద్యులు: డా. గౌతమి ప్రియ ఫార్మసిస్టులు: శివ ప్రసాద్, జ్యోతి, ఐజాజుద్దీన్, సంతోషి రాణిఎస్.ఎన్.ఓలు: వెంకటేష్, రమేష్, స్వామి యోగ ఇన్‌స్ట్రక్టర్లు: మనోహర్, రేవతి, శ్రీనివాస్, కవిత ప్రజలకు నాణ్యమైన ఆయుష్ వైద్య సేవలను అందించడంతో పాటు ఆయుష్ వైద్య విధానాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలనునిర్వహిస్తున్నట్లు ఆయుష్ విభాగం సిద్దిపేట జిల్లా అధికారులు తెలిపారు.

## బీచుపల్లి ఆయిల్ మిల్లులో ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు క్షేత్రస్థాయిలో పరిశీలన

**- త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి ప్రాసెసింగ్ యూనిట్ పనులు ప్రారంభం**

**- జిల్లా ఉద్యాన శాఖ అధికారి రాజ్‌కుమార్**



ఎర్రవల్లి సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం బీచుపల్లిలోని ఆయిల్ మిల్లులో ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సంబంధించి ఫ్యాక్టరీ లేఅవుట్‌ను ఖరారు చేసేందుకు టీజీ ఆయిల్‌ఫెడ్, హైదరాబాద్‌కు చెందిన సాంకేతిక బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం బీచుపల్లి ఆయిల్ మిల్లును టీజీ ఆయిల్‌ఫెడ్‌కు చెందిన టి. సుధాకర్ రెడ్డి, జే. సత్యనారాయణ మేనేజర్ (మార్కెటింగ్), శ్రీకాంత్ రెడ్డి మేనేజర్ (ప్లాంట్స్ అండ్ ప్రాజెక్ట్),ఆకుల బాలకృష్ణ మేనేజర్ (టెక్నికల్), తదితరులతో కూడిన సాంకేతిక బృందం పూర్తిగా పరిశీలించినట్లు రాజ్‌కుమార్ తెలిపారు.ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులు, యంత్రాల ఏర్పాటు, ఉత్పత్తి ప్రక్రియకు అనుగుణంగా ఫ్యాక్టరీలోని వివిధ విభాగాలను సాంకేతిక బృందం పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా సీడ్ హౌస్‌లో ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు అవసరమైన నమూనా లేఅవుట్‌ను ఖరారు చేసినట్లు పేర్కొన్నారు.ఖరారు చేసిన లేఅవుట్‌కు అనుగుణంగా తదుపరి పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సాంకేతిక బృందం తెలిపిందని రాజ్‌కుమార్ వెల్లడించారు. ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సంబంధించిన టెండర్ ప్రక్రియను త్వరలోనే పూర్తి చేసి, ప్రాజెక్టు పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని సాంకేతిక బృందం తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ యూనిట్ అందుబాటులోకి రావడం ద్వారా జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు రైతులకు గెలల సేకరణ, తూకం, రవాణా మరియు ప్రాసెసింగ్ సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని రాజ్‌కుమార్ తెలిపారు.అనంతరం అయిజ మండలం వెంకటాపురం స్టేజి వద్ద ఏర్పాటు చేయనున్న ఆయిల్‌పామ్ గెలల సేకరణ కేంద్రాన్ని సాంకేతిక బృందం పరిశీలించినట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. కేంద్రంలో వెయ్‌బ్రిడ్జి, రైతు సేవా కేంద్రం తదితర సౌకర్యాల ఏర్పాటుకు నిధులు, అనుమతులు మంజూరైనట్లు పేర్కొన్నారు. రైతులకు సులభతరంగా గెలల సేకరణ, తూకం, రవాణా సౌకర్యాలు కల్పించేలా పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేష్ సివిల్ ఇంజనీర్, టీజీ ఆయిల్‌ఫెడ్, ఉద్యాన శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పనులు ప్రారంభించకపోతే అక్టోబర్ 2 నుంచి తాత్కాలిక రోడ్డు పనులు



పెంచికల్‌పేట్, సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర): కొమరం భీం జిల్లా పెంచికల్‌పేట్ మండలంలోనిలోడ్‌పల్లి మధ్య రహదారి అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. రహదారికి ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలను జేసీబీ సహాయంతో తొలగిస్తూ స్థానిక నాయకులు శ్రమదానం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. రహదారి గుంతలమ యంగా మారడంతో ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనదారులు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రహదారి పరిస్థితిపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదని అన్నారు. అక్టోబర్ 1వ తేదీలోపు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. పనులు ప్రారంభించకపోతే అక్టోబర్ 2వ తేదీ నుంచి కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో తాత్కాలిక రోడ్డు మరమ్మతు పనులు చేపడతామని స్పష్టం చేశారు. “ఎవరిపైనా ఆరోపణలు చేయడం మా ఉద్దేశం కాదు. అధికారంలో ఉన్న నాయకులు ప్రజల ఇబ్బందులను గుర్తించి వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలి. పది రోజుల్లో పనులు ప్రారంభించకపోతే మేము అధికారంలో లేకపోయినా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక రోడ్డు మరమ్మతు పనులను చేపడతాం” అని స్థానిక బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. రహదారి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి ప్రజల సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

## గడువులోగా హియరింగ్ ప్రక్రియ పూర్తి చేయాలి...

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23,( విజన్ ఆంధ్ర) : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా చేపట్టిన హియరింగ్ ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని తిర్యాణి మండలం రొంపల్లి గ్రామంలో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న హియరింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఓటర్లు అందిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జాబితాలో ఓటు నమోదు కొరకు వచ్చిన దరఖాస్తులతో పాటు డిక్లరేషన్ తీసుకొని దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. అనంతరం ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యా బోధన, కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులకు సకాలంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలని తెలిపారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని రొంపల్లి గ్రామపంచాయతీలోని మెస్రంగూడ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇండ్లను సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు. ఆదివాసీల ఇండ్ల గోడలపై వేసిన ముగ్గులను చూసి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం మర్కగూడ గ్రామంలో గల గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరిశీలించి వారికి చాక్లెట్లు అందజేశారు. రొంపల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యులు, సిబ్బంది హాజరు పట్టిక, మందుల నిలువల రిజిస్టర్ లను పరిశీలించారు. ముందస్తు అనుమతి లేకుండా వైద్యాధికారి ఆసుపత్రికి గైర్హాజరు కావడంపై జరవాణి ద్వారా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సమాచారం అందించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నగేష్, వైద్యులు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత నాణ్యమైన విద్య, వైద్యం అందించే వారికే ఓటు వేయాలి

**- వరంగల్ పశ్చిమలో ఎమ్మెలే..నాయిని రాజేందర్ రెడ్డీనా.. ఆయన అల్లుడా**

**- ఆంధ్ర నుండి వచ్చి తెలంగాణలో బెదిరింపులు**

**- రాజేందర్ రెడ్డి విమర్శలు నిజమని నిరూపిస్తే దేనికైనా సిద్ధం**

**- బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు దుగ్గంపూడి రంజిత్ రెడ్డి**



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 ( విజన్ ఆంధ్ర ): డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం పౌరుల హక్కు అయినా ఉచిత విద్య, ఉచిత వైద్యం పేద, ధనికా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికి సమానంగా నాణ్యమైన సేవలు అందించే వారినే ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు దుగ్గంపూడి రంజిత్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రంజిత్ రెడ్డి మాట్లాడుతూ గత కొంతకాలంగా ప్రజలను చైతన్యం చేసేందుకు ఉచిత విద్య, వైద్యం ప్రభుత్వాలు అందించాలనే నినాదంతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఏ ఎన్నిక జరిగిన ప్రజలు తమ ప్రాథమిక హక్కు అయినా ఉచిత విద్య వైద్యం అందించే వారికి ఓటు వేస్తామని కరాకండిగా చెప్పాలని సూచించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డినా.. ఆయన అల్లుడా అనే అనుమానాలు ప్రజలకు తలెత్తుతున్నాయని అన్నారు. ఏకంగా ఆయన అల్లుడు అధికారులనే ఆదేశాలిస్తూ దానిని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. తన మాట వినని యువకులపై కేసులు పెట్టిస్తూ ఆంధ్ర నుండి వచ్చిన వ్యక్తి తెలంగాణలో బెదిరింపులు చేస్తున్నారని వాపోయారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తనపై చేసిన విమర్శలు నిజమని నిరూపిస్తే దేనికైనా సిద్ధమే అన్నారు. తాను కుటుంబంతో ప్రమాణం చేస్తానని ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి తమ కుటుంబం పై ప్రమాణం చేయాలని అన్నారు. నగరంలో భూకబ్జాలు చేసేందుకు ఒక టీంను పెట్టుకొని వారి ఆధ్వర్యంలో అడుగడుగున భూకబ్జాలు చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ నిత్యం పేద ప్రజలు వైద్యం పొందుతున్న ఎంజీఎం హాస్పిటల్ లో పర్యటించి అక్కడి సమస్యలు పరిష్కరించాల్సింది పోయి సమస్యలను తెలుసుకునేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ పై దాడి హేయమైన చర్య అన్నారు. ఇప్పటికైనా రాజేందర్ రెడ్డి పద్ధతి మార్చుకోవాలని లేకపోతే ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు అని హెచ్చరించారు.

## జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు

**- అక్టోబర్ 7,8 తేదీల్లో రాష్ట్ర స్థాయి సెలక్షన్ ట్రయల్స్ కుహాజరు కావాలి**

**- జిల్లా యువజన,క్రీడల అధికారి టి.రామలింగేశ్వర్ గౌడ్**



గద్వాల సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర బ్యూరో) : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిం చనున్న అల్ ఇండియా సివిల్ సర్వీస్ టోర్నమెంట్ 202627లో తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయడానికి వివిధ క్రీడా విభాగాల్లో రాష్ట్ర స్థాయి సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించను న్నట్లు జిల్లా యువజన మరియు క్రీడల అధికారి తెలిపారు.జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంపిక ట్రయల్స్‌లో ప్రతిభ కనబరిచి అర్హత సాధించిన ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర స్థాయి సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనే అవకాశం కల్పించినట్లు తెలిపారు.తొలుత సెప్టెంబర్ 24, 25 తేదీల్లో నిర్వహించాల్సిన రాష్ట్ర స్థాయి ఎంపిక ట్రయల్స్‌ను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో పాల్గొనే ఉద్యోగులకు రవాణా, ఇతర లాజిస్టిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తాజాగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ద్వారా విడుదల చేసిన సవరించిన షెడ్యూల్ ప్రకారం రాష్ట్ర స్థాయి సెలక్షన్ ట్రయల్స్ 2026 అక్టోబర్ 7, 8 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్.బి . స్టేడియం, జింఖానా మైదానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు/ప్రభుత్వ ఉద్యోగులు సవరించిన షెడ్యూల్‌ను గమనించి, తమకు కేటాయించిన క్రీడా విభాగం,తేదీ , వేదిక ప్రకారం రాష్ట్ర స్థాయి సెలక్షన్ ట్రయల్స్‌కు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. రాష్ట్ర స్థాయి సెలక్షన్ ట్రయల్స్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపికై, తదుపరి నిర్వహించనున్న అల్ ఇండియా సివిల్ సర్వీసెస్ పోటీల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంటుందని జిల్లా యువజన, క్రీడల అధికారి తెలిపారు.జిల్లా స్థాయి ఎంపికల్లో అర్హత సాధించిన ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్ర స్థాయి సెలక్షన్ ట్రయల్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆయన ఆకాంక్షించారు.

## వరంగల్ విమానాశ్రయానికి సేవాలాల్ మహారాజ్ పేరు పెట్టాలి

**- జీవీఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర ప్రవీణ్ నాయక్ విజ్ఞప్తి,**




మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర బ్యూరో): వరంగల్‌లో నిర్మాణం కానున్న విమానాశ్రయానికి ప్రపంచ బంజారా, గిరిజన సమాజాల ఆధ్యాత్మిక మార్గదర్శకులు, మహాగురు సేవాలాల్ మహారాజ్ పేరును పెట్టాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ని జీవీఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర ప్రవీణ్ నాయక్ కోరారు. బంజారా సమాజానికి మహాగురు సేవాలాల్ మహారాజ్ అందించిన ఆధ్యాత్మిక, సామాజిక సేవలు చిరస్మరణీయమని, ఆయన పేరును వరంగల్ విమానాశ్రయానికి పెట్టడం ద్వారా బంజారా, గిరిజన సమాజాల గౌరవాన్ని మరింత పెంచినట్లవుతుందని ఆయన పేర్కొన్నారు. వరంగల్ విమానాశ్రయం ఉత్తర తెలంగాణకు కీలకమైన రవాణా కేంద్రంగా అభివృద్ధి చెందనుంది. తెలంగాణ ప్రభుత్వం కూడా విమానాశ్రయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయడం, వరంగల్ చరిత్రసంస్కృతికి ప్రతిబింబంగా ఉండేలా రూపకల్పన చేయడం వంటి అంశాలపై దృష్టి సారిస్తున్నట్లు ప్రకటించింది. అందువల్ల వరంగల్ విమానాశ్రయానికి మహాగురు సేవాలాల్ మహారాజ్ విమానాశ్రయం అనే పేరు పెట్టే అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని కొర్ర ప్రవీణ్ నాయక్ విజ్ఞప్తి చేశారు. మహాగురు సేవాలాల్ మహారాజ్ గారి పేరు ఒక విమానాశ్రయానికి పెట్టడం ద్వారా బంజారా జాతి చరిత్ర, సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వం భవిష్యత్ తరాలకు చిరస్థాయిగా గుర్తుండేలా చేయాలి" అని ఆయన కోరారు.

## నయీం హత్య కేసులో మరో ముగ్గురి అరెస్ట్

**- ప్రధాన సూత్రధారి ఉమామహేష్ సహా ఇద్దరి పట్టివేత,**

**- మొత్తంగా అదుపులో 11 మంది నిందితులు,**



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర బ్యూరో): బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో రౌడీషీటర్ మహమ్మద్ నయీం హత్య కేసులో పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారి సహా ముగ్గురిని నాగోల్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఖమ్మంకు చెందిన కె.ఉమామహేష్ అలియాస్ జేకే మహేష్ (34), సాయినగర్‌కు చెందిన మహమ్మద్ మున్నా అలియాస్ బోలె (47), ఖమ్మం జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దుగ్గిరాల కార్తీక్ (29)లను ఎల్.బి.నగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 14న బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో నయీమ్‌పై నిందితులు వేటకొడవళ్లతో దాడి చేసి హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఈ నెల 16న ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన సూత్రధారి ఉమామహేష్ మాత్రం అప్పటి నుంచి పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. తాజాగా అతడితో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేశారు. నయీం, ఉమామహేష్ బాల్య స్నేహితులు. చిన్నతనం నుంచే నేరాలకు పాల్పడటంతో ఇల్లందు పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరిపై రౌడీషీట్లు ఉన్నాయి.

## నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

**- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు,**



మేడ్చల్ మల్లికాజిగిరి జిల్లా సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర బ్యూరో): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో వివిధ ప్రాంతాలకు చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు, మరియు తదితరులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు.. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు. పలు ప్రాంతాలలో జరగబోయే గణేశ్ ఉత్సవాల్లో పాల్గొనాలని పలువురు ఆహ్వానించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్,**



మేడ్చల్ మల్లికాజిగిరి జిల్లా సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర బ్యూరో): ఈరోజు షాపూర్‌నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ నివాస కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, సంక్షేమ సంఘాల సభ్యులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వినాయక నవరాత్రి వేడుకల పూజా, నిమజ్జన కార్యక్రమాలకు హాజరు కావాల్సిందిగా ఆహ్వానించారు. అలాగే నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే శ్రీ కూన శ్రీశైలం గౌడ్ తెలిపారు.

## ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనం.. ఆయుర్వేద వైద్య విధానం

**- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 ( విజన్ ఆంధ్ర ) : ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనం భారతీయ ఆయుర్వేద వైద్య విధానం అని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం ప్రపంచ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా హనుమకొండ టీచర్స్ కాలనీ ఫేజ్-1లోని ప్రగతి మిత్ర కమ్యూనిటీ హాల్‌లో ఆయుర్వేద మెగా శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ముఖ్య అతిథిగా హాజరై ఆయుర్వేద మెగా క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ..భారతీయ ఆయుర్వేద వైద్య విధానంలో అనేక వైద్య విధానాలు ప్రజల విశ్వాసాన్ని పొంది ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా కరోనా విపత్కర పరిస్థితులలో ఆయుర్వేదం యొక్క గొప్పదనం, విశిష్టత, మానవాళిని రక్షించడంలో ఆయుర్వేదం అందించిన సేవల గురించి వివరించారు. ఆయుర్వేద మెడికల్ క్యాంపులో సుమారు 312 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఆయుర్వేద మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే యోగా ద్వారా రోగాలను ఎలా నియంత్రించుకోవాలో యోగా ఇన్‌స్ట్రక్టర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయుష్ విభాగం ప్రాంతీయ ఉప సంచాలకులు డాక్టర్ ప్రమీలా దేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, జిల్లా ఆయుష్ ఇన్చార్జి డాక్టర్ ఎస్. మహేంద్ర కుమార్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ భానుప్రకాష్, డాక్టర్ పి. వీరారెడ్డి, కాలనీ అధ్యక్షులు రామ్ రెడ్డి, సీనియర్ వైద్యులు డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ రావుల జగదీశ్వర్ ప్రసాద్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ జయప్రకాశ్, డాక్టర్ అల్లం సర్వేశం, డాక్టర్ మాధవి, డాక్టర్ కుమార్, డాక్టర్ కోక్య, ఆయుష్ విభాగం ఫార్మసిస్టులు, యోగా ప్రచారకులు, ఎస్ఎన్ఓలు, యోగా ఇన్‌స్ట్రక్టర్లు ప్రభు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పట్టించుకునే అభ్యర్థికే మద్దతు

**- తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం స్పష్టం**




హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 ( విజన్ ఆంధ్ర ) : రాబోయే మార్చి నెలలో జరగనున్న వరంగల్ - ఖమ్మం - నల్గొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎం.ఎల్.సి. (ఎం . ఎల్.సి .) ఎన్నికలలో పట్టభద్రులు, రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు, లెక్చరర్లు ఆలోచించి, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసే అభ్యర్థినే ఎన్నుకోవాలని తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ కుందూరు గోపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, గతంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు స్వార్థ ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చారని, ప్రజల సమస్యలను విస్మరించారని విమర్శించారు. ఉమ్మడి జిల్లాల్లో దాదాపు 2 శాతం మాత్రమే ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై శ్రద్ధ చూపుతున్న పాలకులు, మిగిలిన 98 శాతం సాధారణ ప్రజల, పెన్షనర్ల సమస్యలను పూర్తిగా పక్కన పెట్టేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి నిర్ణయం

సహకార శాఖలో సీనియర్ ఇన్‌స్పెక్టర్, ఆడిటర్‌గా పనిచేసి నలభై ఏళ్లకు పైగా ప్రజాసేవలో ఉన్న తనకు ప్రజల మరియు పెన్షనర్ల సమస్యలపై పూర్తి అవగాహన ఉందని గోపాల్ రెడ్డి తెలిపారు. తెలంగాణ తొలి మరియు మలి దశ ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న అనుభవం తనకు ఉందని, రాజకీయ ప్రయోజనాలు కాకుండా కేవలం ప్రజాసేవే లక్ష్యంగా రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. పట్టభద్రులందరూ ఓటు హక్కును పొంది, విజ్ఞతతో ఆలోచించి ప్రజాసేవా దృక్పథం కలిగిన అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా పెన్షనర్స్ అధ్యక్షులు కుందూరు గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పిండి కుమారస్వామి, వైస్ ప్రెసిడెంట్ పగడాల సరళ, కార్యదర్శి ఎల్లంభట్ల శేషయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ముదిగంటి వెంకటేశ్వర్లు, యూనిట్ అసోసియేట్ ప్రెసిడెంట్ గన్నోజు సదానంద చారి, జాయింట్ సెక్రటరీలు కుందూరు జగదీశ్వర్ రెడ్డి, నోముల ప్రభాకర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు కొండం రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆయుర్వేద వైద్యంతో సంపూర్ణ ఆరోగ్యం

**- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23,(విజన్ ఆంధ్ర ) : ఆయుర్వేదంతో ఆరోగ్యకరమైన భవిష్యత్తు ఉంటుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. 11వ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన మెగా ఆయుర్వేద వైద్య శిబిరానికి హాజరై శిబిరంలో అందిస్తున్న ఆయుర్వేద వైద్య సేవలు, వివిధ ఆయుర్వేద ఔషధాలను పరిశీలించి, వాటి వినియోగం, ప్రయోజనాల గురించి ఆయుర్వేద వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణలో ఆయుర్వేదం ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలని, ఆయుర్వేద వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. జీవనశైలి మార్పుల కారణంగా వచ్చే రక్తపోటు, మధుమేహం తదితర అసంక్రమణ వ్యాధుల నియంత్రణలో ఆరోగ్యకరమైన ఆహారం, క్రమబద్ధమైన జీవన విధానం, వ్యాయామం, యోగా, ధ్యానం వంటి అలవాట్ల ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలని, జిల్లాలోని 12 ఆయుర్వేద ఆసుపత్రుల ద్వారా ప్రజలకు ఆయుర్వేద వైద్య సేవలు అందించడం తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కొనసాగుతున్న సదరం శిబిరాన్ని సందర్శించి నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, అందిస్తున్న సేవల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్యాంపుకు సంబంధించిన రికార్డులు, పత్రాలను పరిశీలించి, నిబంధనల ప్రకారం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సదరం శిబిరానికి వచ్చిన సికిల్ సెల్, ఎనీమియా బాధితులు, వారి తల్లిదండ్రులకు కూడా ఆయుర్వేద వైద్యం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్, ప్రభుత్వ ఆసుపత్రి ఆర్.ఎం.ఓ. డా. శ్రీధర్, జిల్లా ఆయుర్వేద వైద్యాధికారి డా.నీరజ, జిల్లా ప్రోగ్రాం అధికారి రవీందర్ రాథోడ్, ఆయుష్ వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి

**- రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తుల శాఖ కమిషనర్ సురేంద్రమోహన్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23,(విజన్ ఆంధ్ర ) : ప్రతి కొనుగోలు కేంద్రంలో రైతులకు సరిపడా మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తుల శాఖ కమిషనర్ సురేంద్రమోహన్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు(రెవెన్యూ), జిల్లా వ్యవసాయ అధికారులు, జిల్లా మార్కెటింగ్ అధికారులు, జిల్లా కో-ఆపరేటివ్ అధికారులు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, జిల్లా నోడల్ శాస్త్రవేత్తలకు డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రీ, ప్రభుత్వం గుర్తించిన సన్న రకాల వరి ధాన్యం కొనుగోలు, బోనస్ చెల్లింపు, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ ఉత్పత్తుల శాఖ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక వ్యవసాయ పట్టభద్రుని గాని, డిప్లమా అభ్యర్థిని గాని గుర్తించి వారికి సన్నరకం వరి ధాన్యాలపై అవగాహన, శిక్షణ ఇప్పించి కొనుగోలు కేంద్రాలకు వాలంటీర్ గా నియమించాలని, వారికి నెలవారీగా గౌరవ భృతి చెల్లించి వారి సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. అన్ని కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే ముందు అవసరమైన తూకం యంత్రాలు, గన్నీ సంచులు, టార్పాలిన్లు, ఇతర మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను తక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాలలో ఏర్పాటు చేయకుండా తగిన ప్రదేశాలను ముందుగానే గుర్తించాలని తెలిపారు. ధాన్యం సేకరణ, రవాణా, నిల్వ ప్రక్రియలలో ఎక్కడా జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే సంబంధిత మిల్లులకు తరలించేలా వాహనాల ఏర్పాట్లు ముందుగానే చేసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో విధులు నిర్వహించే సిబ్బందికి అవసరమైన సూచనలు, శిక్షణ అందించాలని, రైతులకు ధాన్యం నాణ్యత ప్రమాణాలు, తేమ శాతం, కొనుగోలు విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. వానాకాలం ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు మాట్లాడుతూ జిల్లాలో వానాకాలం 2026-27 సంబంధించి ధాన్యం కొనుగోలుకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు ముద్దుబిడ్డ కు దక్కిన గౌరవం డాక్టరేట్ అవార్డు




సిద్దిపేట జిల్లా బ్యూరో చీఫ్ (విజన్ ఆంధ్ర) సెప్టెంబర్ 23 : కష్టపడి చదువును నమ్ముకొని చివరికి డాక్టర్ రేటు అవార్డు అందుకున్నకరీంనగర జిల్లా పుట్టి అక్బర్ పేట నివాసముంటున్న చిలుక సాయి కృపకు ప్రస్తుతం హైదరాబాదులో నివాసం ఉంటున్న విద్యానగర్‌కు చెందిన చిలుక మాదవి, రమేష్ దంపతుల కుమార్తె చిలుక సాయి కృపకు డాక్టరేట్ లభించింది. విద్యానగర్‌కు చెందిన సాయి కృప పదో తరగతి విద్యను కరీంనగర్‌లోని సెయింట్ జాన్ హైస్కూల్‌లో, ఇంటర్మీడియట్‌ను ఆల్‌ఫోర్స్ జూనియర్ కళాశాలలో పూర్తి చేశారు. అనంతరం బీటెక్, ఎంటెక్ విద్యను జేఎన్‌టీయూలో అభ్యసించి, హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ప్రొఫెసర్ శేఖర్ రావు సతీష్ కుమార్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను సాయి కృపకు డాక్టరేట్ లభించింది. మంగళవారం గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా ఆమె డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, విద్యావేత్తలు సాయి కృపను అభినందించారు.

## అర్హులైన దివ్యాంగులందరికీ సదరం ధ్రువపత్రాలు

**- ప్రత్యేక మెగా సదరం శిబిరంను సందర్శించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర బ్యూరో) : అర్హులైన దివ్యాంగులందరికీ సదరం సర్టిఫికెట్స్ నిబంధనల ప్రకారం జారీ చేయడం జరుగుతుందని, ప్రత్యేక శిబిరంకు హాజరు కాలేకపోయిన దివ్యాంగులు నిర్దేశిత సమయంలో ప్రభుత్వాసుపత్రిలో కూడా పరీక్షలు చేయించుకోవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సెర్ప్ సహకారంతో గద్వాలలోని జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో రెండు రోజులపాటు మానసిక సమస్యలున్న దివ్యాంగులకు నిర్వహించిన ప్రత్యేక మెగా సదరం శిబిరంను బుధవారం జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు, వైద్యులతో మాట్లాడి తగు సూచనలు చేశారు. శిబిరంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పలువురు కుటుంబ సభ్యులతో దివ్యాంగుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. శిబిరానికి వచ్చిన వారందరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. రెండో రోజు ప్రత్యేకంగా దివ్యాంగ చిన్నారులకు పరీక్షలు నిర్వహిస్తున్నామని, అర్హులైన వారందరికీ సదరం ధృవపత్రాలు మంజూరు చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిఆర్డిఓ ముషాహిదా బేగం, డిపిఎం అరుణ, ఏపిఎం భీమన్న, తదితరులున్నారు.

## వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పటిష్ట ఏర్పాట్లు

**- 17 చెరువుల్లో 30 క్రేన్ల ఏర్పాటు..**

**- రూ.2 కోట్లతో ప్రత్యేక ఏర్పాట్లు**

**- అన్ని శాఖల సమన్వయంతో నిమజ్జన కార్యక్రమాల నిర్వహణ**



జీడబ్ల్యూఎంసీ సెప్టెంబర్ 23 ( విజన్ ఆంధ్ర ) : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వినాయక నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు.బుధవారం వరంగల్ జిల్లా పరిధిలోని చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద కుడా చైర్‌పర్సన్ శ్రీమతి గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్నతో కలిసి ఆమె వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ బల్దియా పరిధిలోని 17 చెరువుల్లో నిమజ్జనానికి 30 క్రేన్లను ఏర్పాటు చేసి, మొత్తం రూ.2 కోట్లతో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జీడబ్ల్యూఎంసీతో పాటు రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్, మత్స్య, మైనింగ్ తదితర శాఖలను సమన్వయం చేస్తూ హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు, బల్దియా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు వివరించారు.నిమజ్జన కార్యక్రమాలకు నగరం మొత్తం శోభాయమానంగా ముస్తాబైందని, గురువారం సాయంత్రం వరకు సుమారు 8 వేల వినాయక విగ్రహాలు నిమజ్జనం అయ్యే అవకాశం ఉందని తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతా చర్యలు, క్రేన్లు, సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో మట్టి విగ్రహాల వినియోగాన్ని మరింత ప్రోత్సహించడం ద్వారా చెరువుల కాలుష్యాన్ని నివారించవచ్చని ప్రజలకు సూచించారు.వాతావరణ శాఖ నివేదిక ప్రకారం రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, భక్తులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వీలైనంత త్వరగా గణేశ్ విగ్రహాల నిమజ్జనం పూర్తి చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్ విజ్ఞప్తి చేశారు. నిమజ్జన సమయంలో అధికారులు, పోలీస్ సిబ్బంది సూచనలను పాటిస్తూ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. నిమజ్జనం అనంతరం చెరువుల్లో మిగిలే విగ్రహాల అవశేషాలను తొలగించడం బల్దియాకు కీలక బాధ్యతగా పేర్కొంటూ, వాటిని పూర్తిస్థాయిలో తొలగించి చెరువులను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమాలు పూర్తయిన అనంతరం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించి అవసరమైన చెరువుల్లో పూడికతీత, శుభ్రత కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు.నీటి నిల్వ అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని, నగరవ్యాప్తంగా 145 మంది గజ ఈతగాళ్లతో పాటు డీఆర్ఎఫ్ సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలోని ప్రధాన చెరువుల వద్ద అన్ని శాఖల సమన్వయంతో బల్దియా ఆధ్వర్యంలో పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నిమజ్జన కార్యక్రమాలు గురువారం వరకు కొనసాగే అవకాశం ఉన్నందున అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న మాట్లాడుతూ వినాయక నిమజ్జన కార్యక్రమాలను సురక్షితంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో సమగ్ర కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. నిమజ్జన ఏర్పాట్ల కోసం రూ.2 కోట్లను వెచ్చించి, 17 చెరువుల్లో 30 క్రేన్లతో పాటు పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, లైటింగ్, ట్రాఫిక్ నిర్వహణ, అత్యవసర సేవలకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.నిమజ్జన ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య బృందాలను అందుబాటులో ఉంచి, ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విగ్రహాల నిమజ్జనం పూర్తయిన వెంటనే చెరువుల పరిసరాలను శుభ్రం చేసి, విగ్రహాల అవశేషాలను సకాలంలో తొలగించేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.భక్తులు అధికారులకు సహకరించి నిర్దేశించిన నిమజ్జన ప్రాంతాల్లోనే విగ్రహాలను నిమజ్జనంన చేయాలని, చెరువుల్లోకి దిగకుండా భద్రతా సిబ్బంది సూచనలను తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ వెంకన్న కోరారు. ప్రజలు, భక్తులు, గణేష్ ఉత్సవ నిర్వాహకుల సహకారంతో నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా, పర్యావరణహితంగా విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, వరంగల్ అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అదనపు కమిషనర్ జోనా, బల్దియా సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఆర్‌డీవో సుమ జీడబ్ల్యూఎంసీ, కుడా, రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్, మత్స్య, మైనింగ్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 14 కొత్త రేషన్ షాపులకు డీలర్ల నియామకం

**- నియామక ప్రక్రియ ప్రొసీడింగ్ కాపీలు అందజేసిన ఏఐసిసి కార్యదర్శి డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్**



అలంపూర్ సెప్టెంబర్ 23( విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని వడ్డేపల్లి మండల కేంద్రమైన శాంతినగర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసిసి కార్యదర్శి అలంపూర్ మాజీ శాసనసభ్యులు డాక్టర్ ఎస్ఏ. సంపత్ కుమార్ చేతుల మీదుగా మొత్తం 14 కొత్త రేషన్ షాపులకు సంబంధించిన డీలర్లకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఅలంపూర్ నియోజకవర్గ ప్రజలకు రేషన్ బియ్యం పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా మరింత సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు మొత్తం 14 కొత్త రేషన్ షాపులను ఏర్పాటు చేసి డీలర్లను నియమించినట్లు తెలిపారు. ఈ క్రమంలో రేషన్ షాపుల డీలర్ల నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించగా, నియమితులైన డీలర్లకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను అందజేశామని అన్నారు. సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో మాట్లాడి ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా కొత్త రేషన్ షాపుల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.కొత్త రేషన్ షాపుల ద్వారా అలంపూర్ నియోజకవర్గంలోని ప్రజలకు రేషన్ సరుకుల పంపిణీ మరింత సులభతరం కానుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బింగి దొడ్డి దొడ్డప్ప, అలంపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రేషన్ షాప్ డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

# 59వ వార్షిక గణేష్ నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్న వీహెచ్ హనుమంతరావు

- ఛత్రినాక మిత్ర యువజన సంఘం గణేష్ మండపంలో ప్రత్యేక పూజలు
- ఘనంగా సత్కరించిన సంఘం ప్రతినిధులు
- భక్తులతో కిటకిటలాడిన మండపం





తెలంగాణ స్టేట్ బ్యూరో, ఛత్రినాక, సెప్టెంబర్ 21 (విజన్ ఆంధ్ర): చారిత్రాత్మక ఛత్రినాక మిత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న 59వ వార్షిక గణేష్ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బీసీ సంక్షేమ, అభివృద్ధి సలహాదారులు, మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంత రావు (ఎఎ) గణేష్ మండపాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గణపతికి ప్రత్యేక పూజలు, హారతి నిర్వహించి భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. గత 59 ఏళ్లుగా నిర్విరామంగా గణేష్ ఉత్సవాలను నిర్వహిస్తున్న మిత్ర యువజన సంఘం సభ్యులను ఎఎ అభినందించారు. అనంతరం సంఘం ప్రతినిధులు వి.హెచ్ కు శాలువా కప్పి ఘనంగా సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.పి. కాంతి కుమార్, సిఎఫ్ఐ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, సంఘం ప్రతినిధులు కె. భరద్వాజ్, బి. నితిన్ చారి, సంతోష్, ఎస్. కరణ్, బి. వెంకటేష్, కె. సరోజ్, దుర్గా ప్రసాద్, రితేష్, రిషి, అభిలాష్, యజత్, స్థానిక భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఇళ్ల స్థలాల కోసం జర్నలిస్టుల వినతి..

- ఏళ్లుగా జర్నలిజం వృత్తినే నమ్ముకుని ప్రజల తరపున పనిచేస్తున్నాం
- టిజిఐఐసి చైర్మన్, తహసీల్దార్, ఆత్మ కమిటీ చైర్మన్‌కు కొండాపూర్ మీడియా మిత్రుల విజ్ఞప్తి..






కొండాపూర్, సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర) : కొండాపూర్ మండలంలో సుదీర్ఘకాలంగా జర్నలిస్టులుగా సేవలందిస్తున్న అర్హులైన మీడియా ప్రతినిధులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ టి జి ఐ ఐ సి చైర్మన్, నిర్మల జగ్గారెడ్డి, తహసీల్దార్ అశోక్, ఆత్మ కమిటీ చైర్మన్ వై.ప్రభు లకు కొండాపూర్ మండల మీడియా మిత్రులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మీడియా మిత్రులు మాట్లాడుతూ.. గత పదేళ్లుగా ఎలాంటి పరిస్థితుల్లోనైనా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తూ తమ వృత్తిపరమైన బాధ్యతలను నిర్వర్తిస్తున్నామని తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కల్పిస్తామని గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. గతంలో కొండాపూర్ మండలానికి చెందిన కొందరు మీడియా మిత్రులకు తోగర్పల్లి శివారులో ఇళ్ల స్థలాలు కేటాయించిన నేపథ్యంలో, అదే విధంగా ప్రస్తుతం అర్హత కలిగిన జర్నలిస్టులకు కూడా తోగర్పల్లి గ్రామంలో స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఏళ్లుగా జర్నలిజం వృత్తినే నమ్ముకుని ప్రజల తరపున పనిచేస్తున్నాం, అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలం అందేలా అధికారులు చొరవ చూపాలని వారు కోరారు. తమ విజ్ఞప్తిని అధికారులు సానుకూలంగా పరిశీలించి, అర్హులైన జర్నలిస్టులకు తోగర్పల్లిలో శివారులో ఇళ్ల స్థలాలు కేటాయించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. తమ సమస్యకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందనే ఆశాభావాన్ని మీడియా మిత్రులు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ర సూర్య రిపోర్టర్ రాజు, ప్రజావాణి రిపోర్టర్ అనంతయ్య, ప్రజాపక్షం రిపోర్టర్ శ్రీకాంత్ రెడ్డి, విజన్ ఆంధ్ర రిపోర్టర్ శేఖర్, నవతెలంగాణ రిపోర్టర్ అనిల్, జ్ఞాన తెలంగాణ రిపోర్టర్ శ్యామ్ ప్రసాద్, జనం సాక్షి రిపోర్టర్ బాలయ్య, మనం రిపోర్టర్ నర్సింలు ఉన్నారు.

# మైదానాలు ఉన్నాయి.. వేదికలు ఎక్కడ!!

- హైదరాబాద్ దాటి తెలంగాణ క్రికెట్ ఎప్పుడు విస్తరిస్తుంది?
- 33 జిల్లాలు.. 119 నియోజకవర్గాలు
- హెచ్.సి.ఏ. పరిధి కోసం టిసిజెఎసి డిమాండ్
- పట్టణాల్లో 209 క్లబ్‌లు.. గ్రామీణ తెలంగాణకు కేవలం 8
- ప్రతిభ పల్లెల్లోనే.. అవకాశాలు మాత్రం నగరాల్లోనేనా?
- టిసిజెఏసీ చైర్మన్ జిమ్మీ బాబు






**హైదరాబాద్ (స్పోర్ట్స్ డెస్క్), సెప్టెంబర్ 23:**
క్రికెట్‌లో ప్రతిభకు కొదవ లేదు.. పల్లె నుంచి పట్టణం వరకు బ్యాట్ పట్టే యువతకు కొరత లేదు. కానీ ఆ ప్రతిభకు సరైన వేదిక ఉందా? పోటీ క్రికెట్‌లోకి అడుగుపెట్టే అవకాశం అందరికీ సమానంగా లభిస్తుందా? తెలంగాణ క్రికెట్ వ్యవస్థపై తాజాగా తెరపైకి వచ్చిన డిమాండ్లు ఈ ప్రశ్నలను మరోసారి ముందుకు తెచ్చాయి. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్.సి.ఏ.) పరిధిని తెలంగాణలోని అన్ని జిల్లాలు, అసెంబ్లీ నియోజకవర్గాలకు విస్తరించాలని తెలంగాణ క్రికెట్ జాయింట్ యాక్షన్ కమిటీ (టిసిజెఎసి) డిమాండ్ చేసింది. రాష్ట్రంలోని 33 జిల్లాలు, 119 నియోజకవర్గాలకు హెచ్.సి.ఏ. అనుబంధం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఈ మేరకు సెప్టెంబర్ 23న హెచ్.సి.ఏ. కార్యదర్శికి కమిటీ ప్రెస్‌నోట్ ద్వారా తన డిమాండ్లను వెల్లడించింది.

### తెలంగాణ మారింది.. క్రికెట్ వ్యవస్థ మారలేదా?

2014 జూన్ 2న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించింది. అనంతరం పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా 201617లో రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 33కు పెరిగింది. కొత్త జిల్లాలు ఏర్పడ్డాయి.. కొత్త పరిపాలనా కేంద్రాలు వచ్చాయి.. ప్రజలకు పాలన మరింత చేరువైంది. కానీ క్రీడా రంగంలో, ముఖ్యంగా క్రికెట్‌లో ఈ విస్తరణ అదే స్థాయిలో కనిపించడం లేదన్నది టిసిజెఎసి ప్రధాన వాదన.
రాష్ట్రంలోని 33 జిల్లాలు, 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు హెచ్.సి.ఏ. అనుబంధాన్ని విస్తరించాలని కమిటీ కోరుతోంది. 201617లో రాష్ట్రపతి జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను అమలు చేయాలని కూడా డిమాండ్ చేస్తోంది. పరిపాలనా పునర్వ్యవస్థీకరణకు అనుగుణంగా క్రీడా వ్యవస్థ కూడా విస్తరించాల్సిన అవసరం ఉందని టిసిజెఎసి పేర్కొంది.

### 209 వర్సెస్ 8.. అసలు కథ ఇదేనా?

తెలంగాణ క్రికెట్‌లో పట్టణగ్రామీణ అంతరాన్ని వివరించేందుకు టిసిజెఎసి వెల్లడించిన గణాంకాలు ఇప్పుడు చర్చకు కేంద్రంగా మారాయి. రాష్ట్ర జనాభాలో సుమారు 35 శాతం పట్టణ ప్రాంతాల్లో ఉండగా, అక్కడ 209 క్రికెట్ క్లబ్‌లు ఉన్నాయని కమిటీ తెలిపింది. మరోవైపు సుమారు 65 శాతం గ్రామీణ జనాభాకు కేవలం 8 క్లబ్‌లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. ఈ సంఖ్యలు కేవలం క్లబ్‌ల లెక్కలు మాత్రమే కాదు.. అవకాశాల విస్తరణలో ఉన్న అంతరాన్ని సూచిస్తున్నాయని టిసిజెఎసి అభిప్రాయపడింది. నగరాల్లో శిక్షణ, పోటీలు, క్లబ్ వ్యవస్థ అందుబాటులో ఉండగా.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్నప్పటికీ ఆ ప్రతిభను అధికారిక పోటీ వేదికపై నిరూపించుకునే అవకాశాలు పరిమితంగా ఉన్నాయని కమిటీ ఆరోపించింది.

### పల్లెల్లో బ్యాట్ ఉంది.. కానీ అవకాశం?

తెలంగాణలోని మారుమూల ప్రాంతాల్లో క్రికెట్‌పై ఆసక్తి పెరుగుతున్నప్పటికీ, ప్రతిభను గుర్తించి తదుపరి స్థాయికి తీసుకెళ్లే వ్యవస్థ లేకపోవడం సమస్యగా మారుతోందని టిసిజెఎసి పేర్కొంది. ఒక గ్రామీణ యువకుడు మంచి ఆటగాడిగా ఎదగాలంటే కేవలం ప్రతిభ సరిపోదు. నిరంతర శిక్షణ, సరైన మైదానం, క్లబ్ సభ్యత్వం, అధికారిక పోటీలు, ఎంపిక ప్రక్రియల్లో పాల్గొనే అవకాశం అవసరం. ఈ వ్యవస్థకు దూరంగా ఉన్న ప్రతిభావంతులు తమ సామర్థ్యాన్ని నిరూపించుకునే ముందే వెనుకబడే పరిస్థితి ఏర్పడుతోందని కమిటీ అంటోంది. అందుకే గ్రామీణ ప్రాంతాల్లో కొత్త హెచ్.సి.ఏ. అనుబంధ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తోంది.


### క్రికెట్ వికేంద్రీకరణే పరిష్కారమా?

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న క్రికెట్ వ్యవస్థను జిల్లాలు, నియోజకవర్గాల స్థాయికి విస్తరించాల్సిన సమయం వచ్చిందని టిసిజెఎసి పేర్కొంది. 33 జిల్లాల్లో స్థానిక స్థాయిలో పోటీ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు 119 నియోజకవర్గాల్లో క్రికెట్‌కు ప్రాతినిధ్యం కల్పించేలా క్లబ్‌లను ఏర్పాటు చేయాలని కోరింది. గ్రామీణ ప్రాంతాల్లో కొత్త క్లబ్‌లు ఏర్పడితే స్థానిక ప్రతిభకు పోటీ వేదిక లభించడంతో పాటు, అక్కడి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయికి ఆటగాళ్లను ఎంపిక చేసే అవకాశం పెరుగుతుందని కమిటీ పేర్కొంది. క్రికెట్ అభివృద్ధి ఒకే ప్రాంతానికి పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది.

### ప్రతిభకు ప్రాంతం అడ్డంకి కాకూడదు

క్రికెట్‌లో ప్రతిభ ఎక్కడ పుడుతుందో ముందుగా చెప్పలేము. హైదరాబాద్‌లో పుట్టిన ఆటగాడికే అవకాశాలు పరిమితం కాకుండా, తెలంగాణలోని ఏ గ్రామం నుంచి వచ్చినా ప్రతిభను నిరూపించుకునే వేదిక ఉండాలని టిసిజెఎసి కోరుతోంది. పట్టణగ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న అవకాశాల వ్యత్యాసాన్ని తగ్గించేందుకు హెచ్.సి.ఏ. అనుబంధ వ్యవస్థను విస్తరించాలని డిమాండ్ చేస్తోంది. రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు, ప్రతి నియోజకవర్గానికి క్రికెట్‌ను చేరువ చేయడం ద్వారా మాత్రమే తెలంగాణ క్రికెట్‌కు సమగ్ర రూపం వస్తుందని కమిటీ పేర్కొంది. ఈ అంశంపై హెచ్.సి.ఏ. వెంటనే స్పందించి స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని కోరింది. "ప్రతిభకు సరిహద్దులు ఉండకూడదు.. అవకాశాలకు ప్రాంతీయ గోడలు ఉండకూడదు" అన్న భావనతో తెలంగాణ క్రికెట్ అభివృద్ధిని అన్ని ప్రాంతాలకు విస్తరించాల్సిన అవసరం ఉందని టిసిజెఎసి చైర్మన్ జిమ్మీ బాబు, కన్వీనర్ వెంకటేశ్వర్ రెడ్డి, కో-కన్వీనర్లు కె. మల్లికార్జున్, డా. పుల్లా రావు యాదవ్ కోరారు.

**- గడ్డం సంతోష్ రాజ్**
**స్పెషల్ కరస్పాండెంట్ విజన్ ఆంధ్ర**




# హామీల హంగామా
# పింఛన్ల గమ్యం ఎక్కడ!!

హామీల వెలుగులు తెరపై మెరిసినా.. పింఛన్ల చీకట్లు ప్రజల జీవితాలను కమ్మేశాయి. వాగ్దానాల వర్షం కురిసినా, ఆశల నేల ఎండిపోయింది. నిరీక్షణలో మిగిలిన వృద్ధుల కళ్లలో నిశ్శబ్దం, హృదయాల్లో ఆవేదన. వాస్తవం కోసం పోరాటం, వాగ్దానాల మధ్య నిశ్శబ్ద గాథను తెలిపే "విజన్ ఆంధ్ర" సోషల్ ఇష్యూస్ అనాలసిస్ స్టోరీ.

- ముసలి కళ్లలో మాయని నిరీక్షణ
- ఆధారం కోసం ఆడబిడ్డల ఆర్తనాదం
- దివ్యాంగుల దైన్యంపై దృష్టేదీ?
- ఒంటరి మహిళల ఒంటరి పోరాటం
- విపక్షాల గగ్గోలు.. పేదల కన్నీళ్లు
- ఓ సార్లు.. పింఛన్లు ఇయ్యరాదుర్రి

హైదరాబాద్(సోషల్ ఇష్యూస్ డెస్క్), సెప్టెంబర్ 23:
కాలాన్ని కొలిచే గడియారపు ముళ్లు వేగంగా కదులుతున్నాయి. కానీ ఆ ముసలి కళ్లలో మాత్రం కాలం అక్కడే ఆగిపోయింది. గడప దాటి బయటకు రాలేని వయసులో, బ్యాంకుల వైపు, నాయకుల రాక కోసం రోడ్డు వైపు చూసి చూసి ఆ చూపులు అలసిపోయాయి. "ప్రజా పాలన" కొత్త వెలుగులు తెస్తుందని ఆశపడ్డ హృదయాలకు నేటికీ నిరాశే మిగిలింది.

### కన్నీటి ముత్యాల కబుర్లు..!

**వృద్ధాప్యం చలి మంట**

మందుల బిళ్ల కోసం, నూనె చుక్క కోసం చేతులు చాచాల్సిన దుస్థితి. తెల్ల జుట్టు పెద్దల ఆశలు రోజురోజుకూ కరిగిపోతున్నాయి.

**వితంతువుల దీన స్థితి**

భర్త భుజం కోల్పోయి, పిల్లను సాకాలని రోదిస్తున్న తల్లుల కంట్లో పింఛనే ఏకైక భరోసా. కానీ ఆ భరోసా అందని ద్రాక్షలా ఊరిస్తూనే ఉంది.

**దివ్యాంగుల నిస్సహాయత**




చక్రాల కుర్చీ కోసం, మందుల కోసం పాలకుల కరుణ ఎదురు చూస్తున్న వేదన. కాళ్లు ఉన్నా నడవలేని వారు, చేతులు ఉన్నా పనిచేయలేని వారుడ వారి కన్నీళ్లు సమాజాన్ని కదిలించాలి.

**ఒంటరి మహిళల పోరాటం**

సమాజపు ఒంటరి చూపులను భరిస్తూ, బతుకు బండిని ఈడ్వలేక సతమతమవుతున్న గుండెల్లో పెను తుఫాను.

**విపక్షాల గగ్గోలుడ ప్రజా గొంతుకల రోదన!**

ఎన్ని ప్రభుత్వాలు మారినా మా రాత మాత్రం మారడం లేదా?అని

ప్రతి గడప నుంచి వినిపిస్తున్న మూగ వేదన. కొత్త పింఛన్ల జాడ ఎక్కడ ఉందని ప్రతిపక్షాలు నిలదీస్తుంటే, పాలకుల గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లవుతోంది. మాటల్లో చెప్పే అభివృద్ధి, నేల మీద కనిపిస్తున్న కన్నీళ్లకు మధ్య దూరం రోజురోజుకూ పెరుగుతోంది.

**ఓ సారు జర పింఛన్లు ఇయ్యరాదుర్రి..!**

కాలికి బలపం కట్టుకుని ఊరూరా తిరిగి హామీలు ఇచ్చిన నేతలకు ఈ నలిగిపోయిన గుండెలు ఎందుకు కనిపించడం లేదు? "మా బతుకులు పండగ అయితయి!" అని ఆ ముసలవ్వ ఆవేదనగా అంటోంది. ఇది కేవలం డబ్బుల కోసం కాదుడ ఆత్మగౌరవంతో బతికే హక్కు కోసం చేస్తున్న కన్నీటి విజ్ఞప్తి. "విజన్ ఆంధ్ర స్టోరీ" వాస్తవం కోసం పోరాటం. ఈ కథ కేవలం పింఛన్ల కోసం ఎదురుచూపుల గాథ కాదుడ ఇది ప్రజల ఆత్మగౌరవం కోసం పోరాటం. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు వీరి జీవితాలు కేవలం దరఖాస్తు ఫారాల్లోని పదాలు కావు. ఇవి ఒక పూట తిండి కోసం, ఒక చుక్క మందు కోసం, ఒక చక్రాల కుర్చీ కోసం పడే నిస్సహాయ వేదనల స్వప్నాలు. ప్రజల ఆశలు హామీలలోనే బంధించబడ్డాయి. కొత్త పింఛన్ల దస్త్రాలకు మోక్షం ఎప్పుడు లభిస్తుంది? ఆ ఇళ్లలో మళ్లీ దీపాలు ఎప్పుడు వెలుగుతాయి? ఆ అడుగుల చప్పుడు కోసం ఆశగా ఎదురుచూస్తున్న ఆ కనుమరుగవుతున్న చూపులకూ సమాధానం దొరికేదెన్నడో..!

**- గడ్డం సంతోష్ రాజ్**
**స్పెషల్ కరస్పాండెంట్ (విజన్ ఆంధ్ర)**

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.